ఆంధ్రపత్రిక సచిత్రవారపత్రిక




25 నయాపైసలు

23-4-'58


ANDHRA PATRIKA

ILLUSTRATED WEEKLY



పునర్నవం

ఫొటో : పసల కృష్ణకుమార్ — మద్రాసు.



"ఇయం సు స్తనీ మ స్తకన్య స్త కుంభా...."

చిత్రకారుడు:—జి. రామమోహన్, సికిందరాబాదు

సంవత్సర చందా
రు. 13-0-0
విడిప్రతిక 25న.పై.

ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక

సంపుటము 52
సంచిక 35
23-4-58

Founder : K. NAGESWARA RAO

విలంబి వైశాఖ శు చతుర్థీ బుధవారం

విషయానుక్రమణిక

★

ముఖచిత్రం !

హిందీనటి మాలాసిన్హా



మోలియర్ నాటకం "అఫెక్టెడ్ యంగ్ లేడీస్"లో ఒక దృశ్యం.



హెన్రీటా హెర్మిలిన్.

దేశపర్యటన సాగించిన

అమెరికన్ విశ్వవిద్యాలయ నటీనటులు

★

"ప్రవీణ్"

భూతద్దంలోనుంచి చూస్తే, మనుష్యులు కూడా భూతాలలాగే కనుపిస్తారు; వస్తువులూ భూతాలలాగే కనుపిస్తాయి.

అమెరికాకు సంబంధించినంతవరకు మనకు ముఖ్యంగా మూడు భూతద్దాలున్నాయి. ఒకటి హాలీవుడ్. 'రాక్ అన్ రోల్' నృత్యాలను, అసభ్యశృంగార సన్నివేశాలను, హత్యలను, దొంగతనాలను, దారిదోపిడీలను చూపించి 'ఇదే అమెరికా సుమా!' అని హెచ్చరిస్తుంది హాలీవుడ్.

రెండో భూతద్దంపేరు జాన్ ఫాస్టర్ డల్లెస్. ఈ పెద్దమనిషి ఏమాట ఎక్కడ అనకూడదో—ఆమాట అక్కడే అనేసే ప్రావీణ్యత సంపాదించుకొన్నాడు.

డల్లెస్ మహాశయుని సంపూర్ణ సహకారంతోనే, అమెరికాని ప్రపంచమంతటినీ మ్రింగజూసే పెనుభూతంగా చూపిస్తుంది మూడో భూతద్దం—కమ్యూనిస్టు ప్రచారయంత్రం.

అమావాస్య కొకసారి, పున్నమి కొకసారి—అమెరికానుంచి 'సన్నకారు' రాజకీయవేతలు కొందరువచ్చి విమానం దిగుతూంటారు. దేశమంతా ఒక్కసారి గిర్రున తిరిగేసి, వెళ్ళి, పుస్తకం ఒకటి రాసి, ప్రచురించి డబ్బుచేసుకుంటారు—భారతీయ సంస్కృతినిగురించి, కమ్యూనిస్టు ప్రమాదాన్నిగురించి, భారతదేశంలో జరుగుతున్న బ్రహ్మాండమైన ప్రజాస్వామ్య ప్రయోగాన్ని గురించి! వీళ్ళు ఇక్కడ సమావేశాలు ఏర్పాటుచేసి, ప్రశ్నలడుగుతుంటారు మనల్ని. కాశ్మీరుపై అమెరికా విధానాన్ని గురించి ప్రశ్నించండి. కళ్ళు చిట్లించి చూస్తారు! నీగ్రోలయెడ శ్వేతజాతుల ప్రవర్తనను గురించి అడగండి: కళ్ళెర్రచేసి చూస్తారు.

కమ్యూనిసులు మనల్ని విమర్శ చేయడానికి ఉద్యుక్తులు కానంతకాలం, ప్రధాని నెహ్రూ డలెస్ చేసే ప్రసంగాలవంటి ప్రసంగాలు చేయనంతకాలం, భారతీయ చిత్రాలు అమెరికాకు ఎగుమతి కానంతకాలం—ఈ సన్నకారు రాజకీయవేత్తలే మనపాలిటి భూతద్దాలు.

అమెరికన్ నటీనటులు

ఈ భూతద్దాలను ఒక్కసారి పక్కకు నెట్టండి. ఒకింతసేపు ఈ భూతద్దాలలోంచి చూడడానికి నిరాకరించండి. అమెరికా నుంచి వచ్చి, ప్రస్తుతం భారతదేశం పర్యటిస్తున్న వేన్ విశ్వవిద్యాలయ నాటకబృంద కార్యక్రమాన్ని సమీక్షిదాం.

వేన్ విశ్వవిద్యాలయం అమెరికాలోని మిషిగాన్ రాష్ట్రంలో వుంది. అమెరికన్ విశ్వ విద్యాలయ నాటక బృందాలలో పురాతనమైనవాటిలో ఈ బృందం ఒకటి. వీరి నాటక ప్రదర్శనా ప్రావీణ్యం, నాటక ప్రదర్శన వృత్తిగా పెట్టుకున్న వారి ప్రావిణ్యముతో దాదాపు సమానంగా తులతూగ గలదని అంటారు. భారతదేశంలోని అమెరికన్ సమాచారశాఖ సహకారంలో, అమెరికన్ నేషనల్ థియేటర్ అండ్ అకాడమీ వారి ఆధ్వర్యాన ఈ బృందం ప్రదర్శనాలు ఇస్తోంది. భారతదేశంలోని కార్యక్రమాలను నిర్ణయించింది భారతీయ నాట్య సంఘం—ఇంగ్లీషులో చెప్పాలంటే "థియేటర్ సెంటర్, ఇండియా."

ఈ సమీక్ష చదివేవాటికి బహుశః ఈ నాటక బృందం తమ ప్రదర్శనా కార్యక్రమంముగించుకొంటుంది. బొంబాయి, ఢిల్లీ, కలకత్తా, అహమ్మదాబాద్ వంటి నగరాలలో ప్రదర్శనలిచ్చి, ఈ బృందం మార్చి 24-వ తేదీకి హైదరాబాదు చేరింది. హైదరాబాదునుంచి 28 వ తేదీన బయలుదేరి బెంగుళూరు వెళ్ళింది. బెంగుళూరునుంచి మదరాసు, మదరాసునుండి విమానంలో బొంబాయి, బొంబాయినుండి యూరపుమీదుగా అమెరికా—ఇది వారి ప్రయాణ కార్యక్రమం. జనవరి 28న బొంబాయిలో ప్రారంభమైన వారి కార్యక్రమం ఏప్రిల్ 13 న మదరాసులో అంతమయింది.

"వండర్ ఫుల్!"

"సరిగా రెండు రోజులు ఆలస్యముగా వచ్చాం" అన్నాడు బృందంలో నిఒక సభ్యుడు "దేనికి?" అన్నాను నేను. "మేం జనవరి 28న వచ్చాం. 26న వస్తే, దీపాల ఉత్సవాలు చూసేవాళ్ళం" అన్నాడు. "హోలీ చూశారా?" అని అడిగాను. "ఓ! ఢిల్లీలో ఉన్నాం అప్పుడు. వండర్ ఫుల్!" అన్నాడు జ్ఞాపకం, చేసుకొని నవ్వుకుంటూ. 'వండర్ ఫుల్!,' 'లవ్లీ!'—ఇవి అమెరికనులకు ఊత పదాలు. మన ఆడపిల్లలు కట్టుకొన్న చీరల దగ్గరనుంచి, గండిపేట చెరువుదగ్గర వీచే పిల్లగాలులవరకు, అన్నీ వండర్ ఫుల్లే! అన్నీ లవ్లీయే!

కేవలం మర్యాదకోసం వారు చేసే పొగడ్తలకు మనం మోసపోనక్కర్లేదు. కాని



భారతదేశంలో పర్యటించిన వేన్ విశ్వవిద్యాలయ నటీనటబృందం; మార్చి ఆఖరువారం హైదరాబాదులో ప్రదర్శన లిచ్చారు

వాళ్ళ కార్యక్రమాలలో ఒకవిధమైన చురుకుదనం ఉంది; సమర్థత ఉంది; చిన్న, పెద్ద భావాలకి అతీతమైన పరస్పర సహకార భావం ఉంది. భారతదేశంలో ఉన్న మూడు మాసాలలో చూడ గలిగిందంతా చూసి, నేర్చుకో గలిగిందంతా నేర్చుకొనిపోవాలనే ఉత్సాహం ఉంది. నాటికలను ప్రదర్శించినట్లుగా వాళ్ళ భావాలను ప్రదర్శించలేదు. ఈ భావాలు పదహారుగురు వ్యక్తుల్లో దాదాపు ప్రతీ వ్యక్తిలోనూ అంతర్లీనంగా కనపడ్డాయి.


బృందంలో 16 గురు సభ్యులున్నారు. పదహారుగురిలో నలుగురు స్త్రీలు. బృందానికి ప్రొఫెసర్ లియోనార్డ్ లియోన్ నాయకత్వం వహించారు. సహాయదర్శకులుగా మరి ఇద్దరు అధ్యాపకులు ప్రొఫెసర్ రిచర్డ్ స్పియర్, మిసెస్ మార్గరెట్ స్పియర్ ఉన్నారు. వీరిద్దరూ దంపతులు. మిగిలిన పదముగ్గురూ విద్యార్థులు.

మార్చి 24 వ తేది సోమవారం సాయంత్రం నాలుగు గంటలకి సరోజినీనాయుడు హాలులో పత్రికా ప్రతినిధులకీ స్థానిక కళాకారులకీ తదితర కార్యక్రమ కర్తలకీ అల్పాహార విందు ఏర్పాటు చేయబడింది. (ఆనాటి విందు భవదీయుడి పాలిట నిజంగా అల్పాహారవిందే ఐంది. ఇటుప్రక్కన కూచున్న అమెరికన్ వనితను 'గులాబ్ జాం' చూపించి 'తింటారా?' అని ప్రశ్నించాడు భవదీయుడు—మర్యాదకోసం. 'టూ స్వీట్' అంది ఆమె. అటుప్రక్కన కూచున్న నీగ్రో యువకుడికి 'చుఢువా' చూపించి 'తినండి' అంటే, "ఓ! టూ హాట్! ఐడోన్లైక్ స్పైసెస్" అని సమాధాన మిచ్చాడు. మరి భవదీయుడి కావిందు అల్పాహారవిందెందంటే ఆశ్చర్యం ఏముంది?) విందు ముగిసిన తర్వాత ప్రొఫెసర్ లియోన్ అమెరికాలోని రంగస్థల కార్యక్రమాలను గురించి, ఆ కార్యక్రమాలలో విశ్వవిద్యాలయ నాటక బృందాల పాత్రను గురించి ప్రసగించారు. భారతీయ నాట్య సంఘం—ఆంధ్రప్రదేశ్ శాఖ—కార్యదర్శి శ్రీ మామిడిపూడి ఆనందం వందన సమర్పణ చేశారు.

సోమవారంనాటి సాయంత్రమే ఆంధ్రప్రదేశ్ రవాణా సౌకర్యాల మంత్రి శ్రీ మండుముల నరసింగరావు సమకాలీన అమెరికన్ రంగస్థల కార్యక్రమాలకు సంబంధించిన చిత్రపట ప్రదర్శనకు ప్రారంభోత్సవం జరిపారు. భారతీయ నాట్యసంఘం-ఆంధ్రప్రదేశ్ శాఖ-అధ్యక్షులు డా. మర్రి చెన్నారెడ్డి నాట్య సంఘ కార్యక్రమలను గురించి ప్రసంగించారు. తరువాత ఆంధ్ర రంగస్థల నాటకాల ఉత్పన్న వికాసాలను గురించి శ్రీ కోణంగి శ్రీ రామ అప్పారావు మాట్లాడారు.

తప్పుడు వ్రాతలు

శ్రీ అప్పారావు తమ ప్రసంగంలో తెలుగు నాటక రంగస్థల పరిణామాలను

నాట్యసంఘం నటరాజ చిత్రం బహూకరిస్తున్న దృశ్యం. "1857" ప్రదర్శించిన బృందంతో అమెరికన్ నటీనటులు.

గురించి సవివరంగా చర్చించారు. నేడు ఆంధ్ర విశ్వవిద్యాలయ నాటక బృందం ఆంధ్ర నాటక కళా పరిషత్తు చేస్తున్న కృషిని గురించి ప్రస్తావించారు. కాని శ్రీ అప్పారావు ప్రసంగంలోని ప్రత్యేకత ఈ ప్రస్తావనలలో లేదు.

ఫాబియన్ బిరల్స్ అనే అమెరికన్ రచయిత 'థియేటర్ ఇన్ ది ఈస్టు' అనే గ్రంథాన్ని ప్రచురించారు. అందులో రంగస్థల నాటకోద్యమాన్ని గురించి ప్రస్తావిస్తూ ఆంధ్రలో జానపద నాటకాలను ఆధారంగా తీసుకొని కమ్యూనిస్టులు తమ తమ ప్రయోజనాల కోసం ఒక ఉద్యమాన్ని తీసుకువచ్చారని కమ్యూనిస్టుల ఈ ఉద్యమాన్ని మినహాయిస్తే ఆంధ్రలో నాటక రంగస్థలోద్యమమే లేదని, కమ్యూనిస్టుల ఓటమిలో ఈ ఉద్యమం దెబ్బ తిందని, ఇప్పుడు ఆంధ్రులు తిరిగి తమ జానపద నాటకాల వైపు దృష్టిని మరలిస్తున్నారని వ్రాశారు. శ్రీ అప్పారావు తమ ప్రసంగంలో ఈ అభిప్రాయాలను తీవ్రంగా విమర్శించారు. సంగతులు సరిగా గ్రహించకుండానే ఆయన ఆ గ్రంథంలో ఆ విధంగా వ్రాసినందుకు శ్రీ అప్పారావు తమ విచారాన్ని ప్రకటించారు. వారి ప్రసంగాన్ని ఇంగ్లీషులో చేశారు. తరువాత ప్రసంగం ప్రతులను అతిథులకు పంచిపెట్టారు.

ఆనాటి రాత్రి అతిథుల సమక్షంలో కొన్ని జానపద ప్రదర్శనాలు జరిగాయి. సూర్యాపేట వాస్తవ్యులు శ్రీ సూర్యనారాయణశర్మ, వారి మిత్రులు గొల్లసుద్దులు చెప్పారు. వీధి భాగవత ప్రదర్శనం ఇచ్చారు. శ్రీ బెనర్జి, వారి మిత్రులు నాగారున సాగరంపై బుర్రకథ చెప్పారు. తెలుగులో. రాజధానీ నగర ప్రాంతంలో నివసించే లంబాడీ వనితలు పదిహేనుగురు నృత్యప్రదర్శన లిచ్చి అతిథులను రంజింపచేశారు.

మంగళవారం రాత్రి, గురువారం రాత్రి, వేన్ విశ్వవిద్యాలయబృందం నాటక ప్రదర్శన లిచ్చింది. బుధవారం రాత్రి స్థానిక నాటక సమాజాలు రెండు తెలుగు ఏకాంకికలు, ఒక హిందీ నాటకం ప్రదర్శించాయి. శుక్రవారం మధ్యాహ్నం గండిపేటవద్ద పిక్నిక్ ఏర్పాటు చేయబడింది. ఆనాటి సాయంత్రం సికిందరాబాదు మేయర్ అధ్యక్షాన అతిథుల సమక్షంలో కుమారి సుమతి భరత నాట్యం ప్రదర్శించింది. ఆనాటిరాత్రి వేన్ యూనివర్శిటీ బృందం సికిందరాబాదునుండి బెంగుళూరు వెళ్ళిపోయింది.

వారి నాటకాలు

మంగళవారంనాటి రాత్రి వేన్ యూనివర్శిటీ బృందం ప్రదర్శించిన నాటకం ప్రఖ్యాత గ్రీకు నాటకకర్త సాఫాకిల్స రచించిన "ఈడిపస్ రెక్స్" కథ క్లుప్తంగా ఇది. తీబిస్ రాజ్యానికి రాజు ఈడిపస్. అతడు తన తండ్రిని చంపి, తల్లిని వివాహమాడతాడని 'డెల్ఫిక్ ఆరెకుల్' జోస్యం. ఈ ఉపద్రవాన్ని తప్పించడంకోసం తండ్రి చిన్నప్పుడే ఈడిపస్‌ని ఒక గొర్రెల కాపరి కిచ్చి పంపించేశాడు. కారింత్ దేశపురాజు, రాణీ అతనిని తన కుమారుడిగా పెంచుకుంటారు. ఈడిపస్ కారింత్ రాజకుమారుడుగా పెరుగుతూన్నప్పుడే అతనికి 'ఆరకిల్' జోస్యం సంగతి తెలియవస్తుంది. అతని ఉద్దేశ్యంలో కారింత్ దేశపురాజే తన తండ్రి. అతన్ని ప్రమాదంనుంచి తప్పించడంకోసం దేశం విడిచిపోతాడు ఈడిపస్. మధ్యేమార్గంలో తండ్రి అని తెలియక తీబిస్ రాజుని చంపేస్తాడు. తీబిస్ ప్రజలను పీడించుకుతింటూన్న ఒక రాక్షసినిచంపేసి, ప్రజల కోరికపై, తీబిస్ సింహాసనం అధిష్ఠిస్తాడు. రాణి జొకొస్టాను పెళ్ళి చేసుకుంటాడు. నాటక ప్రారంభకాలానికి ఈ విధంగా 'ఆరకిల్' చెప్పిన రెండు జోస్యాలు ఫలిస్తాయి.

అతడు తండ్రిని చంపి తల్లిని వివాహమాడినందుకు దేవతలకు కోపం వస్తుంది. దేశం అరిష్టాలపాలవుతుంది. అరిష్టాలకు కారకుడెవ్వరో తెలుసుకోవడానికి ప్రయత్నించిన 'ఈడిపస్'కు తానే కారణమని తెలుస్తుంది. అతను కళ్ళు పాడి చేసుకుంటాడు. జొకొస్టా మరణిస్తుంది.

ఈ నాటకానికి ప్రొఫెసర్ రిచర్డు స్పియర్ దర్శకత్వం వహించారు.



'అనార్కలీ' నటీనటులతో
మిస్ హెర్మిలిన్

★ అమెరికన్ నటీనటులు ★

తండ్రిని చంపి, తల్లిని పెండ్లాడి దేశానికి అరిష్టం తెచ్చిన రాజు 'ఈడిపస్,'గా ఎర్ల్ శెట్టింజర్ నటన అత్యద్భుతంగా ఉంది. నటీనటులందరూ ఉన్నతస్థాయిలో నటనాసామర్థ్యాన్ని వ్యక్తంచేశారు. ఈ నాటక ప్రదర్శనను గురించి ప్రత్యేకంగా పేర్కొనదగిన విషయాలు రెండుమూడు ఉన్నాయి. మొదటిది స్టేజికిముందు మనం సాధారణంగా ఉపయోగించే తెర లేకపోవడం. ప్రాచీన గ్రీకు నాటకకర్త రచించిన నాటకాన్ని, ఇతివృత్తానికి అనుగుణమైన వాతావరణంలోనే ప్రదర్శించాలనే అభిప్రాయం దర్శకుల కున్నట్లు కనిపిస్తోంది. నాటక ప్రారంభంలోను, విరామకాలాంతరాన కూడా రంగస్థలాన్ని అంధకారమయంచేసి, క్రమంగా కాంతిప్రసారాన్ని ఎక్కువచేశారు. విరామకాలంముందు ఉన్న సంభాషణలు కొన్ని, విరామకాలానంతరంకూడా చెప్పించి రసోత్పత్తికి భంగం వాటిల్లకుండా శ్రద్ధ వహించారు నిర్వాహకులు.

లైటింగ్ ఏర్పాట్లు

మనం గమనింపవలసిన రెండవది లైటింగు పద్ధతి. మనం మిక్కిలి కాంతివంతమైన లైట్లను ఉపయోగిస్తాం. కాంతికిరణాలు స్టేజి అంతటా పరుగులెడతాయి. నటుడు రచయిత భావాలను నటనద్వారా వ్యక్తీకరించడానికి ఈ పద్ధతి అనుకూలంగా ఉండదు. స్పాట్ లైట్ ను ఉపయోగించవచ్చునుగాని, అది యాంత్రిక సాధనంగా ప్రేక్షకులదృష్టి నాకర్షిస్తుంది నాటక ప్రయోజనాన్ని సాధించడానికి భంగకరంగా ఉంటుంది. అందువల నాటక నిర్మాత రంగస్థల వేదికపై ఎక్కడ ఎప్పుడు ఎంతకాంతిని ప్రసరింపచేయాలని అనుకుంటాడో, అక్కడ అప్పుడు అంతే కాంతిని-ప్రేక్షకులదృష్టిని ఆకర్షించకుండా ప్రసరించే సాధనాలు మనకి కావాలి.

వేన్ నాటకబృందంవారు మొత్తం నలభై ఏభైలైట్లను ఉపయోగించారు. ఇందులో కొన్ని వేదికపైన వరుసగా బిగించారు. తొమ్మిది పదిలెట్లు స్టేజికి ఎడమవైపున, తొమ్మిదిపదిలెట్లు ఆడిటోరియంలో కుడి ప్రక్కన ఏర్పాటుచేశారు. ఒక్కొక్క లైటు వేదికపైన ఒక్కొక్క భాగంపై కాంతిని ప్రసరిస్తుంది. లైట్లలోనే "డిమ్మర్లు" ఏర్పాటు చేయడంవల్ల, ప్రేక్షకులకు స్పష్టంగా కనిపించకుండానే కాంతి ఒకచోటినుంచి మరోచోటికి కదులుతూంటుంది.

మూడో విషయం మేకప్ పద్ధతి. "ఈడిపస్ రెక్స్"లో అవలంబించిన మేకప్ పద్ధతి చాలా విచిత్రంగా ఉంది. స్వాభావికత లేదు. కాని స్వాభావికత లేకపోవడానికి నిర్మాత అజ్ఞానం కారణంకాదు. "ఈడిపస్ రెక్స్" ఇతివృత్తం ఈ నాటిదికాదు. అసలు ఏనాటిదీ కాదు. ఇతివృత్తానికి అనుగుణమైన నటనా పద్ధతి, నాటక ప్రదర్శనా పద్ధతి అవలంబించవలసిన అవసరం "ఈడిపస్ రెక్స్" నిర్మాత గ్రహించారు. అందువల్లనే ముందు తెరను తీసివేయడం; అందువల్లనే వాస్తవికతకు దూరంగావున్న వార్తాహరుల నటన.

గురువారం రాత్రి వేన్ యూనివర్సిటీ బృందం మూడు నాటికలు ప్రదర్శించింది: యుజీన్ ఓనీల్ రచించిన "వేర్ ది క్రాస్ ఈస్ మేడ్," మోలియర్ ది "ది టూ ఎఫెక్టెడ్ యంగ్ లేడీస్," థారన్టన్ వైల్డర్ ది "పుల్ మాన్ కార్ హయ్ వాలా". ఈ మూడింటిలో కూడా రచనావిధానానికి అనుగుణమైన ప్రదర్శనాపద్ధతి అవలంబించబడింది. నటన ఉత్తమస్థాయిలో ఉంది. ప్రత్యేకంగా మోలియర్ నాటకంలో ప్రధానపాత్ర (డా. హిగ్గిన్స్) ధరించిన జోసఫ్ బేరెట్ నటనను పేర్కొనాలి. 'పుల్ మాన్ కార్ హయ్ వాలా' ప్రయోగాత్మక నాటిక. మొదటి నాటక రంగస్థలాలంకరణను రిచర్ స్పియర్ నిర్వహించారు. దర్శకత్వం ప్రొ॥ లియోనార్డు లియోన్స్. రెండవ నాటికకు ప్రొ॥ స్పియర్ దర్శకత్వం వహించారు. మూడవ నాటికకు దర్శకత్వం మిసెస్ మార్గరెట్ స్పియర్ ది. రాబర్ వెస్లీ స్టేజ్ మేనేజర్ గా వ్యవహరించారు.

"అనార్కలి"

బుధవారంనాటి రాత్రి శ్రీ పాతూరి శ్రీరామశాస్త్రి దర్శకత్వంక్రింద 'అనార్కలీ' తెలుగు నాటిక ప్రదర్శించబడింది. రచన శ్రీ ముద్దుకృష్ణ. ఇందులో శ్రీ శ్రీరామశాస్త్రి (అక్బర్), శ్రీమతి రమాదేవి (అనార్కలీ), శ్రీయుతులు ఎ. ఆనందమోహన్ (సలీం), బి. లక్ష్మీపతి (అబుల్ ఫజల్), డి. కె. వెంకటేశ్వర్లు నటించారు. 'ఆధునిక గృహస్తి' హిందీ నాటకానికి శ్రీమతి ఫాతక్, శ్రీ వసంత్ గాడ్సే దర్శకత్వం వహించారు. ఇందులో శ్రీయుతులు కుర్దుకర్, ఆర్గడే, బీడ్ సుర్ కర్, శ్రీమతులు ప్రఫుల్ల, లీలా సుందరయ్య, పాలినీ భోగ్లే పాల్గొన్నారు. రచన శ్రీ రంగ్నేకర్. మూడవ నాటిక ఇండియన్ నేషనల్ థియేటర్ హైదరాబాదుశాఖ సమర్పించిన '1857.' ఇందులో శ్రీయుతులు ఎ. ఆర్. కృష్ణ, పన్నూరి రామారావు, శ్రీనివాసరావు మంత్రి, తురగా కృష్ణమోహన్ రావు, బి. కృష్ణరాజు, పి. పి. నాయుడు, కుమారి వాణీకుమారి పాల్గొన్నారు. శ్రీ ఎస్. గోపాలమూర్తి స్టేజ్ మేనేజర్ గా వ్యవహరించారు.

బుధవారంనాటి రాత్రి వెస్లీ హైస్కూల్ విద్యార్థిని కుమారి ముక్త భరతనాట్య ప్రదర్శనం ఇచ్చింది.

వేన్ యూనివర్సిటీ బృందం హైదరాబాదును విడిపోయినప్పుడు ఎటువంటి అభిప్రాయాలను మూటగట్టుకుపోయారో తెలియదు. 'లవ్లీ' అన్న పదాన్ని విరివిగా ఉపయోగించారు ఇక్కడ ఉన్నంతకాలం. పైన చెప్పినట్లు ఇది వాళ్ళకి ఒక ఊతపదం. 'భారతదేశంలో మీరు చూసిన నాటకాలపై మీ అభిప్రాయంఏమిటి?' అని, ప్రొ. లియోన్ ను వచ్చిన రోజునే ప్రశ్నించాను. "మీ నాటకాలలో స్వాభావికతకువాస్తవికతకుమరీఎక్కువగా ప్రాధాన్యంఇస్తున్నారు. నాటికలలో, నాటకాలలో టెంపో కావలసినదానికంటె అధికంగాఉంటోంది. మూడవవిషయం మీరు మీ ప్రాచీనసాంప్రదాయలపై ఆధారపడాలిగాని, పాశ్చాత్య పద్ధతులను అనుకరించకూడదు" అన్నాడు. ఆయన చెప్పిన రెండవ విషయంలో మనం అంగీకరించక తప్పదు. మొదటి అభిప్రాయం వెనుక దాగి ఉన్న సత్యం వారు ప్రదర్శించిన నాటకాలు చూసిన తర్వాత అర్థమైంది. మూడవ అభిప్రాయంతోటే పూర్తిగా అంగీకరించలేని పరిస్థితిలో ఉన్నాం మనం.

"మీరు ప్రతీది తాపీగా విశ్రాంతిగా తీసుకుంటారు. అదే మీలో నాకు వచ్చినగుణం. మేము పరుగులెడుతూంటాం, ఎప్పుడూ విశ్రాంతి లేకుండా—" అన్నది మిస్ మేర్జరీ డీబాల్ తన అభిప్రాయాన్ని వెల్లడిచేస్తూ.


"నీగ్రోల సమస్య! ఔను. నీగ్రోలసమస్య ఉంది. దాన్ని సమస్యగానే పరిగణించి, పరిష్కరించాలి మనం. కంగారుపడి ప్రయోజనం లేదు" అన్నాడు నీగ్రో యువకుడు ఛార్లెస్ టర్నర్.

"రాక్ అన్ రోల్ కాదూ? అది అమెరికాలో ఉంది. కాని అమెరికన్ ప్రజాజీవితంలో అది చాలా చిన్నపాత్ర వహిస్తుంది. పదిపదిహేనేళ్ళ కుర్రాళ్ళకి మాత్రమే రాక్ అన్ రోల్ అంటే ఇష్టం. హాలీవుడ్ సంగతి సరేసరి. ఇటువంటివాటికే ప్రాధాన్యమిస్తుంది" అన్నాడు ఎర్ల్ శెటింజర్.

చీరల మోజు!

వేన్ విశ్వవిద్యాలయ విద్యార్థులు ఇక్కడనుంచి చీరలు కొన్ని పట్టుకెళ్ళారు. వాళ్ళకోసం కాకపోతే, వాళ్ళ అప్పచెల్లెళ్ళకోసం! కొందరు చెప్పుల జతలు కొనుక్కొని తోడుకొన్నారు. ఎర్ల్ బెట్టింజర్ కు లాల్చీ,పంచ కావలసివచ్చాయి. ఇవన్నీ వాళ్ళు తనలో తీసుకుపోయారు. ఇవన్నీ సరే! వాళ్ళుతమతో తీసుకొనిపోయిన భావాలు, అభిప్రాయాలు ఏమిటో?

(46-వ పేజీ చూడండి)



రైల్వే వారోత్సవాల హంగామా

రైల్వే వారోత్సవాలు ఏప్రిల్ 10 వ తేదీ నుంచీ మొదలుపెట్టి బ్రహ్మాండంగా చేశారు. ఢిల్లీలో రైల్వే మంత్రి భార్య శ్రీమతి జగ్జీవన్‌రాం ఉత్సవాలను మొదలు పెడుతూ చేతిపనుల ప్రదర్శనానికి ప్రారంభోత్సవం చేసింది. నాలుగురోజులపాటు నాట్యాలు, నాటకాలు, రెండురోజులపాటు సంగీతకచేరీలు, నాట్యాలు జరిగాయి. ఏప్రిల్ 15 వ తేదీన రకరకాల వేడుకలు జరిగాయి 16 గుదు రైల్వే కార్మికులకు బంగారు పతకాలు, నగదు రూపేణా బహుమతులు బహూకరించటంతో రైల్వేవారం ముగిసింది

ఈ తంతు అంతా చూస్తే అమెరికాలో నీగ్రోల పరిస్థితి జ్ఞాపకంవస్తుంది. లింకన్ నీగ్రోలకు స్వాతంత్ర్యంకలగజేశాడు. ఆ తరవాత యాభైఏళ్లపాటు నీగ్రోలకు తమ స్వాతంత్ర్యాన్ని ఏంచేసుకోవాలో తెలియలేదు. అందుచేత వారు నాట్య, సంగీత సాధనలో మునిగిపోయారు. ఇదంతా మనకి అనవసరం. ముఖ్యమైనదేమిటంటే, ఇలా రకరకాల వారాలు జరపవలసిన అగత్యం ఏమిటీ అని. ముఖ్యంగా రైల్వేవారం జరపటంలో అర్థమేమిటీ? ఇదివరకటి పరిపాలనా సామర్థ్యం, క్రమశిక్షణ, పరిశుభ్రత పూర్తిగా నాశనంకాకపోయినా, చాలామటుకు నాశనమైనాయనే సంగతిని బాహాటంగా ప్రకటించటంకోసమా ఈ ఉత్సవాలు? మంత్రులు తమ ఇష్టంవచ్చినట్లు రైల్వేలలో క్లాసులు మార్చటంతో రైలుప్రయాణమునేది తప్పనిసరిగా అనుభవించాల్సినశిక్షగా తయారైంది. పొదుపు నేర్చుకోవాలి అని మంత్రులు ఒకవంక ప్రజలకి చెబుతూనూ ఉన్నారు; మరొకవంక ఇలాంటి ఉత్సవాలు అట్టహాసంగాచేయిస్తూనూ ఉన్నారు. ఈ ఉత్సవాలవల్ల జరిగేదేమిటంటే, ఏమంత్రికో బ్రహ్మరథం పట్టటం, దానికోసం బోలెడు ప్రజాధనం దుబారా కావటం.

రైల్వే వారాని కెంత ఖర్చు చేశారో ప్రజలు తెలుసుకునిఉంటే మంచిది. అసలు రైల్వే వారంలో ఏర్పాటుచేసిననాటకాలకీ, నాట్యాలకీ, సంగీతాలకీ, రైల్వేలకీ సంబంధమేమిటి? రైల్వేలలో సమర్థతను, శుభ్రతను అభివృద్ధిచేయటానికి, రైల్వే కార్మికులలో క్రమశిక్షణ పెంపొందించటానికీ ఈ రైల్వే వారాన్ని ఉపయోగించినట్లయితే బాగుండేది. రైల్వేస్టేషనులను విద్యుద్దీపాలతో అలంకరించినంతమాత్రాన రైల్వే పరిపాలన బాగుపడుతుందా?

స్వానుభవాన్నిబట్టి ఒక చిన్న విషయం ఉదహరిస్తాను. కిందటేడు ఏప్రిల్ 13 వ తేదీన నేను కాన్పూరుస్టేషనులో ఉన్నాను.

శ్రీకృష్ణ
[ఆంధ్రపత్రిక ప్రతినిధి]

అప్పుడు ఉత్సవాలు జరుగుతున్నాయి. కాన్పూరుస్టేషనుఅంతా ధగధగాయమానంగా ఉంది. స్టేషనుకు వచ్చే దోవలన్నీ విద్యుద్దీపాలతో మెరిసిపోతున్నాయి హౌరా మెయిలుకోసం కాన్పూరు స్టేషనులో ఒకపూట పూటంతా వృథాగా ఉండిపోవలసి వచ్చింది. ఫస్టు క్లాసు వెయిటింగ్ రూమ్ అనబడే ప్రదేశం చెప్పలేనంత ఛండాలంగా ఉన్నది. విశ్రాంతి మందిరంలోని గదుల్లోకి వెళ్లాను. ఆ గదులు విశ్రాంతి తీసుకుంటున్నాయి అంటే ఆరోజున వాటి నెవరూ ఉపయోగించటం లేదన్నమాట. అక్కడ పరుపులు మురికిగా చిరిగిపోయివున్నాయి స్నానాలగదిలో నీళ్లు వృథాగా కారిపోతున్నాయి. అక్కడి నేల శుభ్రంచేసి కనీసం కొన్ని వారాలై ఉంటుంది. ఉత్సవాలకు అట్టహాసం చేసే బదులు, సూపరింటెండెంటు మహాశయుడు స్టేషను భవనాన్ని పూర్వపు అధికారులు చేసినట్లుగా ఒక్కసారి సమాలోకనం చేసివుంటే కాస్త శుభ్రముగానన్నా వుండేది.

కాంగ్రెసు కార్యవర్గం ఇటీవల ఇక్కడ సమావేశమైంది. కాంగ్రెసువాదులలో నానాటికి ప్రబలుతున్న తిరుగుబాటు ధోరణి అగ్రనాయకులకు గొంతుక దిగని పచ్చి వెలక్కాయగా తయారైంది. ఈ ధోరణిని మాన్పించడానికి ఒకమార్గంగా సంతకాల సేకరణను నిషేధించాలని నిర్ణయించారు. కాని అసలు ఆ తిరుగుబాటు ధోరణికి వేరే బలవత్తరమైన కారణాలున్నాయి. రాష్ట్ర కాంగ్రెసు సంస్థలకు నాయకులను అంటగట్టటం మూలంగానే ఈ తిరుగుబాట్లు రేగుతున్నాయి. దీనికొక ఉదాహరణ డా॥ కైలాసనాథ కట్జూ. ఈయనగారు జీవితంలో చాలాభాగం అలహాబాదులో గడిపారు. పార్లమెంటు ఎన్నికలకోసమని ఈయనకు మధ్యప్రదేశ్‌లో ఒక నియోజకవర్గాన్నిచ్చారు. మధ్యప్రదేశ్ ప్రజలనెత్తిన ఆయన్ని రుదినట్లయిందా లేదా? అయితే కాంగ్రెసు పలుకుబడివల్ల ఆయన ఎన్నికలలో గెల్చారు. దాంతో ఆయన్ని శాసనసభ కాంగ్రెసుపార్టీ నాయకుడుగా, ముఖ్యమంత్రిగా మధ్యప్రదేశ్‌కు పంపించారు. ఈ పంపించటం స్థానిక కాంగ్రెసువాదులతో సంప్రదించకుండానే పంపించారు.

డా॥ హరికృష్ణ మెహతాబ్‌ను ఒరిస్సానుంచి తీసుకొచ్చి కేంద్రప్రభుత్వంలో చేర్చుకున్నారు. ఎందుకు చేర్చుకున్నారో తెలియదు. ఒకానొకశుభప్రభాతాన ఆయన్ని కేంద్రప్రభుత్వంలోంచి తీసివేశారు. ఈలోగా ఒరిస్సా కాంగ్రెసులోని యువనాయకులను ప్రమోట్ చేశారు. డా॥ మెహతాబ్ అలా అలా తిరిగి తిరిగి కొంతకాలానికి మళ్ళీ ఒరిస్సా చేరుకున్నారు. ఈయన పునరాగమనం ఫలితాలు ఇప్పుడిప్పుడు బయటపడుతున్నాయి.

పంజాబులో పరిస్థితి మరీ చిత్రమైనది. అక్కడ కూడా కేంద్రప్రభుత్వం అంటగట్టిన నాయకత్వం కనిపిస్తుంది. ఇప్పటి ముఖ్యమంత్రి సిక్కు

★ న్యూఢిల్లీ లేఖ ★

అయినప్పటికీ ఇబ్బంది పెట్టని వ్యక్తి గనుక ఆయన్ని బలపరుస్తున్నారు. అయితే కొన్ని చిక్కులున్నాయి. ఒకటి - క్రమశిక్షణ అనేది శుష్క వివాదం కాదు. నాగరిక సంఘంలో అవశ్యాచరణీయమైనది. కాంగ్రెసు నాయకులు క్రమశిక్షణను గూర్చి ఎన్ని ఉపన్యాసాలైనా ఇస్తారుగాని అది అమలు జరిగేట్లు మాత్రం చేయరు. ఇందు చేతనే కాంగ్రెసు శిథిలమైపోతోంది. చాలా విడ్డూరంగా కనిపించవచ్చును గాని, యజమానులు కమ్యూనిస్టుల చెప్పుచేతల్లో ఉన్న ట్రేడ్ యూనియన్‌తో వ్యవహరించటానికి ఇష్టపడినంతగా ఇతర్లతో వ్యవహరించటానికి ఇష్టపడరు. ఎందుకంటే కమ్యూనిస్టులు తమ ట్రేడ్ యూనియన్ సభ్యులలో క్రమశిక్షణ ఉండేట్లు చేసి, ఒడంబడికలను జాగ్రత్తగా మన్నిస్తారు. భారత జాతీయ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు కార్మిక ప్రతినిధిసంస్థ అని నిరూపించటానికి కార్మిక మంత్రి శ్రీ గుల్జారీలాల్ నందా ఎంత శ్రమపడి ఎన్ని లెక్కలు చూపించినా, కమ్యూనిస్టుల అధీనంలో ఉన్న ట్రేడ్ యూనియనులు రోజు రోజుకూ బలపడుతున్నాయని స్పష్టమవుతూనే ఉంది. దీనివలన తేలేదేమిటంటే, కొంచెం ఇబ్బంది అయినా, సభ్యులలో క్రమశిక్షణను అమలుచేయనిపక్షంలో కాంగ్రెసు పరిస్థితి ఎంతమాత్రమూ బాగుపడదు.

రెండోది—ఎంత కాంగ్రెసు నాయకులైనా సరే, ప్రతివారూ ఇంతవయస్సు దాటాక రిటైరు కావాలని ఒక నియమం ఉండాలి.

మహంతుల మాదిరిగా, కాంగ్రెసు నాయకులు చనిపోయేవరకూ పదవులకు అంటిపెట్టుకుని ఉండటం మంచిది కాదని ప్రధానమంత్రి చేసిన విమర్శ చాలా ఆశాజనకంగా ఉన్నది. మౌలానా అజాద్ కిందటేడే రిటైరయి ఉంటే ఆయన ఇంకా నిక్షేపంగా ఉండేవారు. కొందరు కొందరు మరీ దారుణం; వారానికి మూడురోజులు మంచంపట్టే ఉంటారు. అయినా రిటైరు కావటానికి ఒప్పుకోరు. ఎవరన్నా 'రిటైరు కావయ్యా మహాశయా' అని చెబితే, తక్షణం సంతకాల సేకరణోద్యమం ప్రారంభమవుతుంది.

మూడోది—అగ్రశ్రేణి నాయకుల్లో ఎవరూ మంత్రి పదవిని వదులుకుని కాంగ్రెసు సంస్థను బాగుచేయటానికి దిగివచ్చేందుకు ఒప్పుకోవటంలేదు. ఇక కాంగ్రెసు వ్యవహారాలను నడిపిస్తున్న మనుషులెవరికీ ప్రజలలో అంత పలుకుబడి, గౌరవం లేవు.

ఈ సాధారణసూత్రాలు వదిలేసి ఢిల్లీ కాంగ్రెసు వ్యవహారాలే ఉదాహరణగా తీసుకుందాం. ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెసు చిత్తుగా ఓడిపోయింది. మామూలుగా ఉంటున్న కాంగ్రెసు యంత్రాంగాన్ని తొలగించి దానిస్థానే తాత్కాలిక సంఘాన్ని నియమించినా పరాజయం తప్పలేదు. కాంగ్రెసు ఎందుకు ఓడిపోయిందో తాత్కాలిక సంఘసభ్యులకీ పాటికి తెలిసిఉండాలి. పరాజయపు పోస్టుమార్టమ్ ఫలితాలకై ఢిల్లీ ప్రజలు ఎదురుచూస్తున్నారు. శ్రీమతి అరుణా అసఫాలీగూర్చి, ఢిల్లీ మేయరు పదవిగూర్చి కిందటివారం రాశాను. ఆ తరవాత ఢిల్లీ కాంగ్రెసు తను ఏయితర పక్షంతోనూ ఒడంబడిక చేసుకోదలచలేదనీ, మేయరు పదవికికూడా అభ్యర్థి నెవరినీ నిలబెట్టబోవటం లేదనీ, అయితే శ్రీమతి అసఫాలీ అభ్యర్థినిగా నిలబడితే ఆమెకు ఓటుచేస్తావని ప్రకటించింది.

వర్డ్స్‌వర్త్ మిల్టన్‌ను గూర్చి వ్రాసినట్లుగా, "మహాత్మాజీ! మీరు ఈనాడు జీవించి ఉండవలసింది. భారతదేశానికి మీ అవసరం ఎంతయినా ఉంది," అని వ్రాయవచ్చు. కాంగ్రెసు సహాయంలేనిదే శ్రీమతి అసఫాలీ ఆల్డర్‌మన్ కాలేదు. అదిగాక మేయరు కావటానికి ఆమె అన్నివిధాలా తగిన వ్యక్తిఅని అంటున్నారు అయితే కావచ్చుగాని, అన్నివిధాలా తగినవ్యక్తులను కాంగ్రెసు ఎన్నికలలో ఎందుకు నిలబెట్టలేదు అని ప్రశ్న.

ఒక కాంగ్రెసు నాయకుడు నాకు అసలు జరిగినకథంతా చెప్పారు. కాంగ్రెసు మునిసిపల్ పార్టీలో ఐకమత్యంలేదట. మేయరు పదవికైతే నేమి, డిప్యూటీ మేయరుపదవికైతేనేమి మొత్తం ముగ్గురు అభ్యర్థులున్నారట. వీరిలో ఎవరి అనుయాయులు వారికున్నారు. వీరిలో వీరు కీచులాడుకోవటం శ్రీమతి అసఫాలీకి లాభించింది. కాంగ్రెసు అధ్యక్షునికీ, ఇతరకీ ఈ అంతఃకలహాల సంగతి తెలుసు. 'విభేదాలు మరిచిపొండి' అని వీరు ఉపన్యాసాలు దంచుతున్నారు. అంతేకాని విభేదాలను రూపుమాయించటానికి ఏచర్యా తీసుకోవటంలేదు. ఢిల్లీలో ఇక కాంగ్రెసు పని అఖరే అని కొందరు భావిస్తున్నారు.

* * *

ఇటీవల ప్రధానమంత్రి పత్రికా విలేఖరులతో గోష్ఠి జరుపుతూండగా, శ్రీ ఎస్. కె. పాటిల్ ప్రసక్తి వచ్చింది. మంత్రులకీ మంత్రులకీమధ్య, కేంద్రానికీ రాష్ట్రాలకూ మధ్య సరియైన సహకారం, సమన్వయభావం లేవని శ్రీ పాటిల్ పార్లమెంటులో ఆరోపించారు. దానిమీద ఒక పత్రికా విలేఖరి కేంద్రప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు బాగా అలుసు ఇస్తోందని అన్నాడు. ప్రధాన మంత్రి ఆ మాటను ఖండిస్తూ, రాష్ట్రాలు స్వయం నిర్ణయాధికారం కలిగినవనీ, కేంద్ర ప్రభుత్వం గట్టిగా మాట్లాడే రాష్ట్రప్రభుత్వాల స్నేహం సంపాదించుకో లేదనీ అన్నారు.

అయితే, సమస్య ఏమిటంటే కేంద్ర ప్రభుత్వం గట్టిగా చెప్పడాలని కాదు, రాష్ట్రాలకు అడిగినప్పుడల్లా డబ్బిచ్చి నెత్తెక్కించుకోవట మెందుకూ అని. ప్రణాళిక పుణ్యమా అని, రాష్ట్రాలకు కోటకొద్దీ డబ్బు హారతి పళ్లెంలో పెట్టి దానం చేస్తున్నారు. ఒక ఉదాహరణ చెబుతాను కేంద్ర విద్యాశాఖ కేవలం తనమనుగడను, విస్తరణను సమర్థించుకోటానికిగాను సెకండరీ విద్యా సంఘాన్ని ఏర్పాటుచేసింది. ఈ సంఘానికయ్యే ఖర్చు తప్ప కేంద్రానికి సంబంధించినంత వరకూ మరింకే ఖర్చూ దీనివల్ల ఉండదని అప్పట్లో అన్నారు. కాని ఆ సంఘం తనని వేదికలో కేంద్రం రాష్ట్రాలకు భారీఎత్తున ధనసహాయం చేయక తప్పనిరీతిగా సూచనలుచేసింది. జరిగినకథ ఇది. కేంద్ర విద్యాశాఖ తనకు సంబంధంలేని రాష్ట్రవిషయాల్లో జోక్యం చేసుకుని ప్రాథమిక పాఠశాలలోపాధ్యాయుల జీతాలు ఎక్కువ చేయాల్సిందని సలహా ఇచ్చింది. ఈ సలహాకు రాష్ట్రాల సమాధానం—డబ్బివ్వండి, జీతాలు ఎక్కువ చేస్తామని. తీరా డబ్బిచ్చిన తర్వాత—ఆడబ్బు దేనికైతే ఇచ్చారో దానికి సక్రమంగా ఖర్చుచేస్తున్నారో లేదో కేంద్రం పరిశీలించాలంటే — అచ్చే అదివీలులేదు. రాష్ట్ర విషయాల్లో కేంద్రజోక్యం పనికిరాదు అని ఎదురు సమాధానం. ఇంతకంటె మంచి ఉదాహరణ — అధికోత్పత్తి ఉద్యమం. ఒక దశాబ్దంపాటు ఉద్యమం ముమ్మరంగా సాగించిన తరవాత — ఆహార స్వయం సమృద్ధి సాధించడం అసంభవమని ప్రధాన మంత్రే అంగీకరించారు.

* * *

ఇతరదేశాల్లో ఉన్న భారతీయ శాస్త్రజ్ఞులు, టెక్నీషియన్లు ఆయా దేశాల్లోని భారత రాయబార కార్యాలయాల్లో కొన్ని ఫారాలు అడిగితీసుకుని వాటి మీద తమకు సంబంధించిన వివరాలన్నీ పూర్తిచేసి ఇవ్వాలని భారత ప్రభుత్వం ఈమధ్య ఒక విజ్ఞప్తి చేసింది. భారతదేశపు అభివృద్ధి ప్రణాళికలకు ఎందరు శాస్త్రజ్ఞులు, ఎందరు సాంకేతిక నిపుణులు లభ్యమవుతారో సమాచారం సేకరించటానికి ప్రభుత్వం ఈ విజ్ఞప్తి చేసింది.

భారతీయ విద్యార్థుల్లో ఎక్కువ మంది బ్రిటన్‌లో ఉంటున్నారు. బ్రిటన్‌లో భారత ప్రభుత్వానికి పెద్ద కార్యాలయం ఉంది. దానికి బోలెడు ఖర్చు అవుతూ వుంది. భారత హైకమిషన్ లోని విద్యాశాఖ ఆమోదం లేనిదే ఏ భార

(49-వ పేజీచూడండి)

జీవితం-చదువు

రావు

కాగితంమీద కలం పెట్టబోతుంటే "ఏమండీ!" అంటూ శ్రీమతి గదిలోకి వచ్చింది.

నేను అనుకుంటూనే ఉన్నాను-ఈరోజయినా ఈ కథసాగేమాట ఎంతవరకు నిజమని. వ్రాద్దామనుకున్న కథ అయిదు నెలల నుంచీ వాయిదాపడుతున్నది. ఆదివారం కోసం వారంరోజులపాటు ఎదురుచూస్తాను. తీరా ఆరోజు 'ఇదిగో వచ్చాను' అని చెప్పకునే శుభవేళకు ఏదోఒక కొత్తపని పలకరించి చేయిపట్టుకొని ఈడ్చుకుపోతుంది—ఇంటికివచ్చినఆదివారావాన్ని పరామర్శించే వ్యవధయినా ఉండదు. ఇలా ఇరవై ఆదివారాలు వచ్చినయ్, పోయినయ్. ఈ ఆదివారమయినా ముడిపడుతుందేమో ననుకుంటుంటే ఎన్నడూలేని ఆప్యాయత ఒలకబోస్తూ శ్రీమతి వేంచేసింది.

చదువుకునేరోజుల్లోనే నయం—వారానికో కథ వ్రాసేవాడిని. సంసారపు జంఝాటంలోపడి నాకు క్షణంతీరిక ఉండటం లేదు; జీవితయాత్రలో నిమిషంపాటు విశ్రాంతి లభించటంలేదు. పగలల్లా పనిచేసి తెచ్చుకునే జీతపురాళ్ళు రాత్రింబవళ్ళ ఖర్చుకు చాలని కారణాన రాత్రిళ్ళూ కష్టపడాల్సి వస్తున్నది.

"ఏమండీ!"

ఇక సమాధానమీయకపోతే గరిస్తున్న మేఘం వర్షిస్తుందేమోనని భయపడి 'ఏమిటి?' అన్నట్లు తలెత్తి చూశాను.

"సినిమా మాట ఏం చేశారు?" గోముగా ప్రశ్నించింది.

సినిమాకు తీసికెళ్తానని మాట యిచ్చినట్లుగా నాకు జ్ఞాపకం లేదు. శ్రీమతి వేసే ఎత్తులలో ఇది ఒకటి. ఇచ్చినమాట తప్పటం నా జీవితంలో లేదు. ఆ బలహీనతను కనిపెట్టి ఉపయోగించుకో చూస్తున్నది.

"తీసికెళ్తానని అన్నానా?"

ఇలాంటి ఎదురుప్రశ్న వస్తుందని ఆశించి ఉండలేదో ఏమో పాపం తడబడింది శ్రీమతి.

"అహ...అనలేదనుకోండి...ఆదివారం కదా...సినిమాచూసి వారంరోజులయింది."

"నువ్వు సినిమా చూసి వారంరోజులైతే నేను కథ వ్రాసుకుని అయిదు నెలలయింది. దానికేమంటావ్?"

"కథదేముంది. రాత్రికి రాసుకోవచ్చును లెద్దురూ?"

ఇలా కాకుండా నా పరిస్థితి వర్ణంచేసుకుని 'మీరు వ్రాసుకోవాల్సిన పనుంటే వచ్చేవారంపోదాం లెద్దురూ' అని ఉంటే నేను కరిగిపోయేవాణ్నేమో! కాని పోవాల్సిందేనని మంకుపట్టుపట్టటం నాకేమాత్రం సమంజసంగా కన్పించలేదు.

"రాధనో, అమ్మనో తోడుతీసికెళ్ళు. అసలేం సినిమాకు పోదామనుకుంటున్నావ్?"

"హంతకుడు - అని మంచి డిటెక్టివ్ పిక్చర్ ...చాలా బావుంటుందని పత్రికలో వ్రాశారు..."

"అదయితే ఈ పూటే ఆఖరి ఆట... ఎవరయినా వసే పో. ఒంటరిగా పోయినా నాకేమభ్యంతరం లేదు"

కొండముది హనుమంతరావు

ఏమనుకుందో ఏమో శ్రీమతి ఇంట్లోకి వెళ్ళిపోయింది.

టేబుల్ మీద ఉన్న అలారం గడియారం కాలచక్రాన్ని ముందుకు తోసుకుపోతున్నది. ఎనిమిదిగంటలయింది టైము. కిటికీలోంచి పడుతున్న మాఘమాస ప్రభాత సూర్యకాంతిని ఏడు రంగులుగా పొదుగుతున్న టేబుల్ వెయిట్‌ను చూస్తూ—కథ ఎలా మొదలుపెడ్తే అందంగా, ఆకర్షణీయంగా ఉంటుందా — అని ఆలోచిస్తున్నాను. ఎంతకీ తేలటంలేదు సమస్య. ఏదో ఒక విధంగా వ్రాసేద్దామంటే కొద్దో, గొప్పో పేరున్న రచయితను — అందులోనూ చాలాకాలానికి కన్పించబోయే కథ—కాబట్టి బాగా ఆలోచించి, ఒళ్ళు దగ్గర పెట్టుకు వ్రాయాలి. అలాకాక ఆషామాషీగా వ్రాశానా—సంపాదకులు ప్రచురించినా, ప్రచురించిన మరుసటి రోజు నుంచి పత్రికలు మొహాన దుమ్మెత్తిపోస్తారు; నిర్మొహమాటంగా ఉత్తరాల ద్వారా దుయ్యబట్టారు.

పక్కింటివారి అమ్మాయి పార్వతి కర్ర కోసం వెదుకుతున్న విషయం గ్రహించని శునకం దాలిగుంటలో నిశ్చింతగా నిద్రిస్తున్నది.

వెనుకనుంచి ఎవరో తరుముతూన్నట్లుగా కిటికీలోంచి రివ్వున వచ్చినగాలి టేబుల్ మీది కాగితాలను 'ఉఫ్' న ఊదింది.

కథాప్రారంభం కళ్ళముందు కన్పించింది.

* * *

రాధ

"ప్రాపరీస్ ఆఫ్ మాటర్"ను పటేవ దుమ్ము దులిపి 'కెప్లర్స్ లాస్' చదవబోతున్నాను—"ఏమమ్మా! రాధా!" అంటూ వదిన గదిలోకి వచ్చింది.

వదిన నన్ను వెతుక్కుంటూ నా గదిలోకి వచ్చిందంటే ఏదో పని ఉందన్నమాటే! ఈ ఆదివారం కదలకుండా కూర్చుని 'ప్రాపరీస్ ఆఫ్ మాటర్' సగమయినా పూర్తిచేసేయాలనుకున్నాను.

ఫిబ్రవరికూడా వచ్చి పదిహేనురోజులయింది. పటుమని నెలరోజులుకూడా లేవు ఇంకా పబ్లిక్ పరీక్షలు. క్లాసు రాకపోవటం మాట అలా ఉంచి ప్యాసయినా అవగలనా-అని అనుమానం కల్గుతున్నది.

అమ్మ వద్దంటున్నా అన్నయ్య మాట నాసరాగా తీసుకుని బి. యస్సీలో జేరినందుకు అన్నయ్య గౌరవం దక్కనిస్తే ధన్యురాల్నే. సినిమాలకూ, షికార్లకూ ఇన్నాళ్ళు ఇష్టం వచ్చి తిరిగాను. మహిళామండలి కార్యదర్శిని పదవి, కళాశాల విద్యార్థినీ నాట్య సమితి అధ్యక్షుపదవీ నెత్తి నేసుకుని కాలమంతా వృధాచేసుకున్నాను. అమ్మ 'చదువుకోవేమే' అని హెచ్చరిస్తూన్నా వినిపించుకోలేదు. అన్నయ్య 'దానికామాత్రం తెలియదా' అనుకున్నాడో ఏమో మాటమాత్రమయినా అనలేదు ఎన్నడూ. వదిన సంగతి సరేసరి! ఆమె నా విషయమేగాదు—ఇంట్లో ఎవరి సంగతీ పట్టించుకోదు. ఆమె నవలలేమో, ఆమేమో! అన్నయ్యవిషయంలోకూడా ఆమె అంతే!

అలాంటిది ఈ రోజునే చదువు ప్రారంభింపబోయే వేళకు 'రాధా' అంటూ తనకు తాను వచ్చింది.

పుస్తకాన్ని టేబుల్ మీద పెట్టూ "ఏమిటివదినా?" అన్నాను—ఆమె గౌరవం నిలబెట్టూ.

★ జీవితం - చదువు ★

"మార్నింగ్ షోకి పోదాం. వస్తావేమో వని"

నేననుకున్నంతా అయింది. వదిన ఊరికే నేరాలేదు. ఆమెకు తెలియకుండానే తెరిచిన పుస్తకాన్ని మూయించటానికి వచ్చింది.

నేను సందిగ్ధావస్థలో పడ్డాను. ఏడాది నాడు కాపురానికి వచ్చిన వదిన నానుంచి ఎలాంటి సహాయమూ కోరలేదు. కనీసం తల్లో చెండు పెట్టమనికూడా అడగలేదు. అలాంటి ఆమె ఈ రోజు నోరు తెరుచుకుని సినిమాకురమ్మని అడిగేసరికి నేనో అగ్నిపరీక్షకు గురి అయినాను.

పోనీ ఒక్క నాటికేంపోయె—అనుకుందామంటే ఈ రోజు పొద్దునే భగవంతుని ముందు ప్రమాణం తీసుకున్నాను—ఈ నాటినుంచి సినిమాలకూ, 'బీచ్'కూ పోకూడదని

వదినకోసం 'ఈరోజు' రేపటినుంచి అనుకుందామంటె ప్రమాణాలంటె నాకు చెడ నమ్మకం; అవి తప్పటమంటే ప్రాణాల్తో చెలగాటమని నా గాఢవిశ్వాసం.

"ఏమిటమ్మాయ్! ఇంత సేపాలోచిస్తున్నావ్? వారానికి రెండు మూడు సినిమాలు చూసేదానివి"

నా మనసుకు చాలా కష్టమేసింది. వదినతో సినిమాకు రావటం నాకిష్టంలేక మాట్లాడటం లేదనుకుంటున్నది గాని నాలో రేగిన కల్లోలం ఆమె కెలా అర్థమవుతుంది?

"అది కాదు వదినా! నా చదువువిషయం నీకు తెలియదు..."

"నిన్నడగటం లేదని నీ చదువును గురించి నాకు తెలియదనుకొన్నావా? భలేదానివే! మీ అన్నయ్య ఎప్పుడూ చెప్తానే ఉంటుంటారు. నువ్వు చాలా తెలివిగలదానివిట. చదవాలే గాని ప్యాసుకాకపోవటమంటూ ఉండదుట"

నేను లాగకుండానే ఆమె దారిలోకి వచ్చినందుకు సంతోషించి అదారి తప్పనీయకుండా నడిపించాను.

"ఆ చదవటమే వదినా ఇంతవరకు లేనిది. పరీక్షలింకా నెలరోజులుకూడా లేవు. ఈ నెలరోజులయినా గట్టిగా చదివితేనే ప్యాసవక్లేది."

"నువ్వు నెలల్లా చదవాలా? ఇంటర్ పరీక్షలకెన్నాళ్లు చదివింది నాకు తెలియదూ? మార్చి ఒకటిన మొదలు పెట్టావు చదవటం."

వదిన నాకు వదినకాకముందు కూడా మా ఇంటికి వస్తూపోతూ ఉండేది నాకన్న ఒక క్లాసు సీనియరు; అన్నయ్యకన్నా ఒక సంవత్సరం జూనియరు. అయినా దూరపు బంధుత్వంవల్ల మాదగ్గరకు వస్తుండేది.

"అవును. పదిహేనురోజులే ఆ పరీక్షలకు చదివింది."

"అయినా ఫస్టుక్లాసు వచ్చిందిగా మీ క్లాసుమేటు విశాలవిషయమేమయింది?"

"చావు తప్పి కన్ను లొట్టపోయినట్లు జస్ట్ ప్యాసుమార్కులు వచ్చినయ్?"

"అంటె ఆ అమ్మాయి చదవకనా?"

"అలా అని ఎవరంటారు? కాలేజీలో చేరినరోజునుంచీ రెగ్యులర్ గా చదివింది. కానీ ఏంలాభం? చివరికి పరీక్షలో సరిగా రాయలేకపోయింది ఎవరు ఎప్పుడు ఎంత చదివినా పరీక్షలో వ్రాస్తేనే చదివినదాని ఫలం దక్కేది."

"బాగా చెప్పావు. మరియేం. నువ్వు పదిరోజులు చదివితే చాలు. వ్రాసేయగలవు. ఈ పూట సినిమాకు పోదాం పద..."

"ఇంటర్ కు పదిహేను రోజులు చదవాల్సి వచ్చినపుడు డిగ్రీపరీక్షకు నెలరోజులయినా చదువవద్దూ?"

"ఇంతెందుకు రాధా! నాతో రావటం ఇష్టంలేకపోతే లేదని చెప్పు. నిన్నింతవరకెప్పుడూ అడగలేదు ఇకముందు అడగను. 'హంతకుడు' ఇవ్వాళే ఆఖరు రోజట. మీ అన్నగారేమో అయిదు నెలలనుంచి వాయిదాలు వేస్తూవస్తున్న కథాకన్యతో ముచ్చటించుకోవాలిట—తీరదన్నారు. అందుకని నిన్నింతగా బతిమిలాడుకోవాల్సివచ్చింది"

అని అంటున్న వదినకంఠంలో కాఠిన్యం మొహంలో కోపభావం ప్రస్ఫుటంగా దృగ్గోచరించాయి ఉదయం చేసుకున్న ప్రమాణం, నిశ్చయం—విపులంగా చెప్పుకున్నాను. వదిన కోపాకారం వదిలిపెట్టూ నిట్టూర్చింది. నాపరిసితి అర్థం చేసుకుందో ఏమో నాకు తెలియలేదుగాని మొత్తంమీద వదినసౌమ్యంగానే సమాధానం చెప్పింది.

"అలాఅయితే నిన్ను రమ్మనటం తప్పులే రాధా! చదువుకో. మీ అమ్మగారు వస్తుండేమో కనుక్కుంటాను."

వదిన వెళ్ళిపోయింది. ప్రథమంలో నే వదినపెట్టిన పరీక్షలో నెగ్గాను కాబట్టి పబ్లిక్ పరీక్షలు ప్యాసవటం కష్టం కాదనిపించింది. కొత్త ఉత్సాహం ధైర్యం చేకూర్చింది. నవీనోత్తేజం వీపుతట్టింది. ఇంకొంచెం కష్టపడిచదివితే కనీసం సెకండ్ క్లాసయినా రాకపోదు—అన్న ఆశా ఉదయించింది.

పుస్తకం చేతిలోకి తీసుకుని, మనసుదగ్గఱపెట్టుకుని చదువ నారంభించాను—"ఈచ్ ప్లానెట్ మూవ్స్ ఇన్ యాన్ ఎలిప్స్..."

భారతమ్మ

కూరలో తిరగమూతేసి, 'కృష్ణా, రామా' అనుకుందామని రుద్రాక్షమాలతీశానో లేదో "అత్తయ్యగారూ" అని నోరార పిలుస్తూ కమల వంటగదిలోకి వచ్చింది. నిజం చెప్పొద్దూ—నాకు చాలా ఆశ్చర్యమేసింది. ఎన్నడయినా చేయిపీలుకొనప్పుడుందిమాశాయా—కొత్తకూర తఱిగిపెట్టమనిగానీ, అలమరలో ఉన్న పెలుసు గిన్నె కొంచెం ఇటీయమనిగాని పిలుస్తానా,...పిలిచిన గంటకిగాని పలకదు. అలాంటిది ఈరోజు తనంత తాను వంటింట్లోకి వచ్చిందంటే విచిత్రంగానే ఉంది నామటుకు నాకు.

అక్కడితో అవలేదు. వచ్చిపీటవాల్చుకు కూర్చుంది. ఇది మరీ సోద్యంగా కన్పించింది నాకు. పనుండి పిలిస్తే ముళ్ళమీద నిల్చున్నట్లు నిల్చుని ఆ పని సగంమాత్రమే చేసి 'అంతఃపురం'లోకి తుర్రుమని పారిపోయే మనిషి—వంటగదిలోని పొగనూ, ఖోరునూ లెక్కచేయకుండా పీటవాల్చుకు కూర్చుందంటే నాకేకాదు ఎవరికైనా వింతగా వుండదూ?

ఇంకోరోజు ఇంకోరోజయితే వంట చేసే సమయంలో ఇలా కూర్చుని పిచ్చా-పాటీ మాట్లాడుతూంటే సంతోషించేదాన్నేమో గాని ఈనాడు-మహాశివరాత్రి పర్వదినాన క్షణం వృథాచేయటం నాకు సుతరామూ ఇష్టంలేదు ఈరోజు నేనెటూ ఉపవాసమే కాబట్టి పొద్దున అననే అన్నాను కమలతో—'రాధ చదువుకోవాలంటున్నది. నువ్వు ఈ పూట వంటచేయవే నేను కాస్త జపమైనా చేసుకుంటానూ—' అని కాని వింటేగా! అలాంటిది మరిప్పుడెందుకు వచ్చింది? చల్లకువచ్చి ముంత దాచుకుంటుం దెందుకు?

"ఏమిటే?" అని ప్రశ్నించాను సూటిగా.

"ఏం లేదండి. మీ అబ్బాయిగారు మిమ్మల్నడగమన్నారు."

"ఏమడగమన్నారు?"

"అన్నం తిన్నతర్వాత పన్నెండున్నరకు సినిమాకు పోదామని..."

"దానికి నన్నడిగేదేముంది? ప్రతిసారీ పోయేటప్పుడు నన్నడిగే పోతున్నారా?"

"వారికి తీరికలేదుట. రాధ చదువుకుంటున్నది. మీరువస్తే పోదామని..."

"నాకు చెడ్డకోపం వచ్చింది శివరాత్రినాడు సినిమా ఏమొచ్చె నాకు! నన్నలేక పోతే సరి. పైగా అడుగుతున్నది మాపెండి ఇందుకా ఇంత నక్క వినయాలు.

అరవయ్యో పడిలో కూడా పడాను. ఇంకా సినిమాలుకూడా చూడాలి—తగునమ్మా అని. యాభై సంవత్సరాలు ఇప్పటికే వృథా అయిపోయినయ్—అని వ్యథ చెందుతున్నాను. సంసారపు మమకారంలో పడి ఇప్పటిదాకా భగవంతుణ్ని తలంచనే లేదు. ఇహ బంధాల్లో కట్టుబడిపోయాను. మొన్న చేయి చూపించుకున్నప్పటి నుంచీ మరీ దిగు

లుగా ఉంది. ఇంకా పదేళ్ళు బ్రతుకుతానుట. ఓపిక చచ్చిపోయింది. చూపుపోయింది. ఒంట్లో బలం హరించుకు పోతున్నది రోజురోజుకూ. పదేళ్ళు బ్రతికినా గొప్పే! ఈలోగానే పోతానేమోనని భయంగా వుంది. మానవజన్మ లభించటం మహోన్నత మంటారు. ఆ భగవద్దత్తవరాన్ని నేనెంతవరకు ఉపయోగించుకున్నానూ అని ఆలోచిస్తే అణుమాత్రమయినా వినియోగించుకోలేదని తెలుస్తున్నది. ఇప్పటికయినా మేల్కొంటే కొంతవరకయినా చిత్రగుప్తుడిముందు చెప్పుకోవచ్చు. ఈ సినిమాలకు, నాటకాలకు పోతే ఏమొస్తుంది!

"ఏమంటారు అత్తయ్యగారూ?"

నేనేమీ మాట్లాడకపోయేసరికి కమల తిరిగి ప్రశ్నించింది.

"సాయంత్రం శివాలయానికి పోదామనుకుంటున్నాను. ఇవ్వాళ శివరాత్రికదూ!.."

అంతకుముందు ఎంతో ఘోర పాపం చేసినా, యీ ఒక్కనాడు ఏ కొద్ది పుణ్యం చేసినా, తిండి దొరక్క ఉపవాసంచేసినా, జారచోరులై జాగరణచేసినా—ఒక్కసారి మనసారా "శివాయనమః" అని గొంతెత్తి అరిచినా... అవ్యాజానురాగంతో, అపార కరుణాసముద్రుడై అపాంగదృష్టి బరపి తన సాన్నిధ్యం ప్రసాదించే మహాదేవుడు కళ్లకు గట్టటంతో ఒళ్ళు జలదరించింది.

కమల మొహం చిన్నబుచ్చుకుని వెళ్ళిపోయింది. ఉన్నమాట అన్నాను అది తర్వాత ఏమయినా అనుకోనీ. దానికి నేనేం చేస్తాను? నా బాధ్యతేముంది గనుక?

నే చెప్పింది అర్థం చేసుకుంటుందా జీవితంమీద సరైన దృక్పథం ఏర్పరుచుకుని బాగుపడుతుంది. అపార్థం చేసుకుని "అత్తగారయినందుకు అధికారం చూపించింది" అని అనుకుని ఎందుకూ పనికిరాని ఆ చెత్త నవలలు చదువుతూ, శుక్కదండగమారి సినిమాలూ చూస్తూ కూర్చుందా నాలాగానే వృద్ధాప్యంలోగాని జీవితసత్యం అవగాహన చేసుకోలేదు.

"కలౌ స్మరణాన్ముక్తిః" అన్నారు కాబట్టి నామస్మరణ చేయ ప్రారంభించాను కమల విషయం కమలకు వదిలేసి—

"హరేరామ హరేరామ రామరామ హరే హరే..."

కమల

ఏ క్షణాన నేను సినిమాకు పోదామని అనుకున్నానో గాని, ఆ ముహూర్తం అతి బలవత్తరమైనది. నా జీవిత గమనాన్నే మలుపు తిప్పే మహత్తరానుభూతి ప్రసాదించిన శుభఘడియ అది.

సంసార రథాన్ని నడపటానికే హరించుకుపోతున్న తన కాలంలో వీలు చూసుకుని వారానికోసారి వచ్చే ఆదివారం శాశ్వత కీర్తిని తెచ్చిపెట్టే సత్కార్యకై సద్వినియోగం చేసుకొంటున్నారు శ్రీవారు.

ఎనిమిది నెలలనుంచీ పుస్తకం ఎలా ఉంటుందో చూడని రాధ—క్లాసుపరీక్షలకూ, కాలేజీ పరీక్షలకూ ఎగగొట్టినా—నెలరోజులుండనగా కళ్ళు తెరిచి పబ్లిక్ పరీక్షలకోసం రాత్రింబవళ్ళూ చదవబోతున్నది.

సంసారపు ఊబిలో దిగబడిపోయి దైవచింతనలేని అత్తగారు మరణం దగ్గరపడుతున్నదని తెల్సుకుని ఈలోగానే తనశక్తి కొలది భగవధ్యానం చేస్తున్నది.

రాధనూ, అత్తగారినీ చూస్తే—నాకు జీవితంమీద ఒకవిధమైన అభి[illegible]ం కలుగుతున్నది; జీవితానికీ, చదువు సామ్యం కన్పిస్తున్నది.

క్లాసు పరీక్షలనూ, కాలేజీలనూ లెక్కచేయని రాధకు యూనివర్సిటీ పరీక్ష అంటే ఎక్కడలేని భయమూ వచ్చిపడింది; ఎన్నడూలేని శ్రద్ధ చదువుమీద ఏర్పడింది. అత్తగారి విషయంలోనూ అంతే; ఆమె తెల్సుకున్నది తన పబ్లిక్ పరీక్షా ఇంకా ఎన్నో రోజులులేదని. ఆమెకు పరీక్ష మరణమే! జీతం కట్టిన వారందరికీ హాల్ టిక్కెట్టు వచ్చినట్లుగా, జన్మించిన ప్రతిప్రాణికీ మరణం తథ్యం. కాని ఎటొచ్చీ రాధ హాల్ టిక్కెట్టు వచ్చినా ఇంకో సంవత్సరానికి పరీక్ష వాయిదా వేసుకోవచ్చు; అత్తగారికి మాత్రం అలాంటి అవకాశంలేదు. అంతేగాక రాధ చదువుకు విలువకట్టేవాడు యీ లోకం మనిషి అయితే, అత్తగారి జీవితంలోని మంచి-చెడులను విమర్శించేవాడు మరోలోకపు వాడు.

ఇంకా లోతుగా ఆలోచిస్తే వాటివాటి లక్ష్యాలలో కూడ సామ్యం కన్పిస్తున్నది.

చదువుకు—ఒకరోజు కానీ, రెండు రోజులు కానీ, ఏటికేడాది కానీ—లక్ష్యం పరీక్షనాడు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు వ్రాయటం. జీవితంలోనూ అంతే! ఒకసారి అనుకోనీ, వందసార్లు అనుకోనీ—నామస్మరణలక్ష్యం తుదిఘడియల్లో భగవన్నామం ఉచ్చరించగల్గటం.

మరి అందరూ చరమాంకంలో శ్రమించకూడదూ?—చాలామందికి ఆమనో దారుఢ్యమూ లేదు; ఆత్మవిశ్వాసమూ అత్యల్పం. ఆ దారుఢ్యమూ, విశ్వాసమూ ఉంటే విద్యార్థులు సంవత్సరం పొడుగునా ఆటపాటల్లో, నాటకాల్లో, నాట్యాల్లో, అన్ని ఎక్స్ట్రాకరిక్యులర్ యాక్టివిటీస్ లోనూ ఆనందం పంచుకుంటారు; అటు పరీక్షల్లోనూ విజయం అందుకుంటారు. అలాగే జీవితంలోనూ అన్ని ఇహసుఖాలూ అనుభవిస్తారు, ఆలోకంలోనూ అగ్రగాములౌతారు.

శ్రీవారూ, రాధా, అత్తగారూ-ముగ్గురు ఏదో విలువను సాధించే దృఢ సంకల్పులై ఆ ప్రయత్నంలో ఉన్నారు. కాని—నేనో డిటెక్టివ్ నవలలూ, రైల్వే సాహిత్యమూ, చదువుకుంటూ కాలం వృధా చేసుకుంటున్నాను; చౌకబారు సినిమాలు చూస్తూ డబ్బు అనవసరంగా ఖర్చు పెడుతున్నాను.

'చదువు' అధ్యాయం నా జీవిత కావ్యంలో ముగిసి దాదాపు ఏడాది అయింది. అత్తగారి ప్రకరణంలో ప్రవేశించటానికి ఇంకా పాతిక సంవత్సరాల కాలం ఉంది. బాగా ఆలోచిస్తే బాధ్యతలు కుదిరి భావిజీవితం సుఖంగా సాఫీగా గడిచిపోయేలా మలుచుకోవాల్సిన సువర్ణ సమయమిది.

గృహాన్ని స్వర్గసీమగా మార్చటమే గృహిణినయిన నాకర్తవ్యం. ఆ కర్తవ్య సాధనకు మార్గం ఉండనే ఉంది. అత్తగారి చేతిలోని వంటపని తీసుకుని ఆమెకొంత విశ్రాంతిలభింపచేయాలి; పైపనులు చూస్తున్న రాధకు ఇక ఆ బెడద లేకుండా చేసి ఇరవై నాలుగు గంటలు ఆ అమ్మాయి స్వవిషయాలకే వినియోగించుకునేలా చూడాలి; ఆదాయాన్ని మించుతున్న వ్యయాన్ని ఎదుర్కొనటానికిగాను శ్రీవారు చేస్తూన్న అదనపుపని మాన్పించి ఆకాలాన్ని తన ఆదర్శమూ, విలువలూ సాధించేందుకు వదిలిపెట్టి నేనింట్లో పొదుపుచేసి ఒకకానీ అయినా ఆదాయమే ఎక్కువయేలా ప్రయత్నించాలి—ఇది నాపథకం.

స్వకర్మ నిర్వహణ ప్రారంభించాను; కథ వ్రాసుకుంటూన్న శ్రీవారికి కాఫీఏమయినా కావాలేమో కనుక్కుందామని వారి గదిలోకి అడుగు పెట్టాను.

రావు

చాలా రోజులతర్వాత వ్రాస్తున్నందుకు కథ నవీనపంథాన, అందంగా, సాఫీగా నడచింది కాని—పాత్రలు ఆత్మవిమర్శ చేసుకుని ఆదర్శప్రాయంగా రూపొందటంతో కథ మరీ ప్రబోధాత్మకంగా తయారయి సాంఘిక ప్రయోజనం బొమ్మకటిస్తున్నది. నేనెలాంటి రచన ప్రచురించినా తప్పకుండా చదివే సంధ్య సుతరామూ ఇలాంటి పద్ధతికి ఒప్పుకోదు. ఈరకం కథలు ఇరవయ్యోశతాబ్దపు ఉత్తరభాగంలో ఘోషను కొందంటుంది.

"పాత్రల బలహీనత చిత్రిస్తేచాలు—లోపాలు దిద్దుకోబడుతయ్. ధైర్యం నరనరాన జీర్ణించుకు పోతుంది; సంఘం సంస్కరించ బడుతుంది. ఒక్కమాటలో చెప్పాలంటే సాంఘిక ప్రయోజనం సాధించ బడుతుంది"—అని సంధ్య తన ఉద్దేశం నాకు ఎప్పుడూ చెప్తూ ఉంటుంది. ఈసారి సంధ్య అభిప్రాయం బలపరుస్తాను.

(46-వ పేజీ చూడండి)



గోవిందరాజు శ్రీనివాసమూర్తి

మయూరుకు ఒక చిన్న సందేహం వేసింది.

"నేను డిటెక్టివ్‌ని కదా-హంతకుణ్ని ఆరా తియ్యటమే నా వృత్తి కదా-అటువంటిది ఇంత జగ్రుగ జారటం నాకు తగినపనేనా-చిన్న దాని వలపునకు గురికావడం ఆరోగ్యకరమేనా," అనుకున్నాడు.

"అయినా మన కది మంచిదికాదు. డిటెక్టివ్‌లకూ ప్రేమకూ చాలదూరం ఉన్నది. పనిలేనివాడు ఏదో చేసినట్టు నాకు ఇదే మిటి...పనిలేకపోతే బుర్ర పాము పెలికలు తిరుగుతుంది. త్వరగా ఏదో పని నెత్తిన పెట్టుకోవాలి-ఏంపనీ?"

తనవృత్తి వినా తనకేం కనబళ్ళేదు. ఒక్క నిమేష కాలం బుర్ర అల్లకల్లోలం అయింది డిటెక్టివ్ మయూరుకు.

"హత్యలు చేసేవారు అరుదైపోయారు," అనుకున్నాడు. వెంటనే చిరునవ్వు పెదవుల మీదకు తియ్యుకుని వచ్చింది.

"కాకపోతే, మూడునెలలుగా ఒక్క హత్యకూడ తను వినకపోవడం శోచనీయంగా ఉంది. మయూరుకు ఇవాళో రేపో, ఎల్లుండో ఇక్కడో ఎక్కడో ఏదో ఒక హత్య జరిగితీరాలి, అలాకాని పక్షంలో తనకు ఉపద్రవం కలుగవచ్చు. అంటే తను చిన్నదానివలలో పడిపోవచ్చు. అంతటితో తనవృత్తికి స్వస్తి కలగవచ్చు—

డిటెక్టివ్ మయూరుకు భయం వేసింది. సిగరెట్ చప్పగా ఉందేమో విసిరి పారేశాడు. వళ్లు భగున మండుతున్నది.

"ఏమిటిది ఏమయింది తనకు" ఇదే ఆలోచన మయూరుది.

తలు పెవరో తట్టారు. మయూరు ఇంటి తలుపు పరాయివారు తట్టి చాలకాలం అయింది. ఆత్రుతతో వరుగత్తి తలుపు తీశాడు. వర్షంకోసం తపనపడే కర్షకుడిమీద మేఘుడు కరుణించి నట్టయింది-ఎదురుగా ఇన్‌స్పెక్టర్ పాషా నిలబడి ఉన్నాడు. పాషా తనకోసం వచ్చి చాలా నెలలయింది.

విపరీతానందంతో వళ్లు గగుర్పొడిచి వెంటనే చల్లారింది మయూరుకు.

చిరునవ్వు నవ్వాడు.

పాషా, నవ్వలేదు. ముఖంలో ఆందోళన వ్యక్తపరుస్తున్నాడు. లోపలకు ప్రవేశించాడు. ఆందోళన తగ్గలేదు.

"ఏమయింది?"

మయూరు ఆత్రుత ఎక్కువయింది.

ఏమయింది? పాషా మాట్లాడడేం—పాషా ఏదో హత్యనుగురించి తనతో చెప్పడేం. తనకు పని తగలాలి—చిన్నదాని వలలోనుంచి తప్పుకోవాలి. కాని పాషా మాట్లాడడేం.

కాని పాషా మాట్లాడాడు.

"మైలాపూర్‌లో అనంతనాయక్ స్ట్రీట్‌లో ఒక ఇంట్లో ఒకావిడ కుర్చీలో కూలబడిపోయింది." అన్నాడు.

"హత్యా, ఆత్మహత్యా?" అనడిగాడు మయూరు.

సిగరెట్ వెలిగించాడు. ఈమాటు సిగరెట్ కమ్మగా ఉంది.

పాషా తల పైకెత్తాడు.

"ఆత్మహత్య" అన్నాడు.

కాలు జారి నట్లయింది మయూరుకు. అపురూపమయిన పాషా తనకు దర్శనమిచ్చి ఒక ఆత్మహత్య కేసునుగురించి తనకు చెప్పబోవడం ఏమీ బాగాలేదు మయూరుకు.

"ఆత్మహత్యే—కుర్చీలో కూర్చుని ఉన్నది వనిత. చేతిలో పిస్టలు ఉన్నది. నుదుటిమీద రక్తంకారి ఎండిపోయింది. కనుక ఆత్మహత్య చేసుకుని ఐదారు గంటలై ఉండవచ్చు. పిస్టలును నుదుటిమీద పేల్చుకుంది."

"పేల్చుకుందని నీకెలా తెలుసు?" అన్నాడు మయూరు.

"అంతకన్నా మరొకటి జరిగేందుకు వీలులే"దన్నాడు పాషా.

"ఆరాతీశావా?" అన్నాడు మయూరు.

"తెల్లకాగితంమీద రాసినట్టు తెలుస్తున్నది—ఆత్మహత్యేనని. ఇక ఆరాలతో నిమిత్తం లేదు, ఒక వేళ ఉన్నా అది మీపని."

మయూరుకు ఆసక్తి హెచ్చయింది.

"అది ఆత్మహత్య కాకపోతే..."

* * *

అనంతనాయక్ స్ట్రీట్‌లో ఉన్న ఇంటికేసి బయలుదేరారిద్దరూ.

మెట్లెక్కి మేడమీది కెళ్లారు. మేడమీద ఒకటేగది. కొత్తగా సున్నం వేయించినట్టు ఉన్నది. హాండిల్ తిప్పి తలుపుతీశాడు. హాండిల్ పరిశీలించాడు మయూరు. బయట నుంచి కూడ తాళంచెవితో తీయవచ్చు ఆ తలుపు. పాషా ముందు ప్రవేశించాడు గదిలోకి. మయూరు ప్రవేశించడంతోటే భయంకరదృశ్యం కనబడిందతడికి. ఎదురుకుర్చీలో ఓ స్త్రీ కూచునిఉన్నది. కళ్లు మూతబడి ఉన్నవి. తల వ్రేలాడుతున్నది. నుదుటిమీద నుంచి వచ్చిన రక్తం కన్నులమీద నుంచి ముక్కుమీదకు పెదవులమీదకు ప్రవహించి ఎండిచారలు కట్టింది. చేతులు బిగుసుకున్నవి కాబోలు—చేతిలోని పిసలు అట్లాగే ఉన్నది. మయూరు భరించలేకపోయాడు.

"ఈమె ఇంత ఘోరానికి ఎందుకు ఒడిగట్టాలి?" ఇదే సమస్య పదేపదే ప్రశ్నిస్తున్నది మయూరును.

పాషా మాట్లాడలేదు. ఓ మూల నిలబడి ఉన్నాడు.

"ఇలా ఎందుకు చేసింది" అనడిగాడు మయూరు.

"ఆత్మహత్యేనని విపులంగా తెలుసున్నది" అన్న పాషా మాటలను మయూరు వినిపించుకున్నట్టు లేదు. గది అంతా పరిశీలిస్తున్నాడు-జాగ్రత్తగా పరిశీలిస్తున్నాడు. తనకొక్కవలసింది ఏ మూలా లేదు. అసలు తనకు ఏంకావాలో తనకే తెలియదు. అందుకే పరిశీలిస్తున్నాడు. గబుక్కున ఒక్క అనుమానం వేసింది మయూరుకు.

"ఈమె ఎవరు?"

ఈమె ఎవరో తన కింతవరకు తెలియదు. అలాంటేది తను ఆ గదిని పరీక్షించడంలో అర్థంలేదు. ముందు ఈమె ఎవరో తెలుసుకోవాలి. కధను కొంత వెనక్కులాగాలి. పాషా కేసి తిరిగాడు.

"ఈమె ఎవరు?" అన్నాడు.

ఇంతసేపూ మయూరు కేసి వింతగా చూస్తూన్న పాషా/ఉలిక్కిపడ్డాడు-ఒక్కమాటు మయూరు కళ్లకేసి చూడలేదు పాషా.



కొంత భయంకలిగి స్తయ్ ఆ కళ్లు.

"నిస్సందేహంగా స్త్రీయే" అన్నాడు పాషా. తను వేసిన జోక్‌కి తనకే నవ్వొచ్చింది. పెద్దగా నవ్వాడు.

కాని తనవంకే తదేకదీక్షతో చూస్తూన్న మయూరు కళ్ళు తన నవ్వును అంతర్ధానం చేసినై.

"ఈమె ఎవరు?" అన్నాడు మయూరు గట్టిగా, ఈ మాటు మయూరు కళ్ళలో మునుపటి చిలిపితనం లేదు. పరిశీలనా దృష్టిలోనే ఉన్నయ్ ఇంకా అతడికళ్ళు.

—తక్కువ మయూరు కళ్ళు చల్లబడిపోయింది — నోటిమాట రావటం లేదు.

నిశ్శబ్దంగా ఉన్నది గది అంతా. పాషా నిశ్శబ్దాన్ని చీల్చాడు.

"పాపం ఆత్మహత్య చేసుకున్నది." జాలితో నిండిపోయింది అతడి హృదయం. మయూరు పాషాకేసి తిరిగాడు. కాని మాట్లాడలేదు. పాషా కెందుకో భయం వేసింది. గబగబ మాట్లాడాడు.

"ఈమె అప్పుడప్పుడు డ్రామాలు వేస్తుంది. సినిమాల్లోకూడా చిన్న చిన్న వేషాలు వేస్తుంది—ఆత్మహత్య చేసుకున్నది. అందుకు ఆధారం ఆమెచెయ్యి. పిస్టలును స్వయంగా నుదుటిమీద పేల్చుకున్నది. పిస్తోలును పేల్చుకున్నప్పుడు వెనక్కువచ్చే తెల్లటి మసి ఆమెచేతిన ఉన్నది. నే నిందాక పరీక్షించాను. కనుక..."

తను చెప్పవలసిందేమిటో గబగబ చెప్పేశాడు పాషా.


కాని మయూరు వినిపించుకున్నట్టు లేదు.

"ఆమూల గోడలో తెల్లగ నిగనిగమెరిసే పదార్థం ఏమిటో చూడు," అని మాత్రం అనగలిగాడు.

చెప్పడమే మయూరు వంతుగాని చెప్పిం తర్వాత దాని అంతు తేల్చడం పాషావంతు-నిగనిగమెరిసే పదార్థం అంతు తేల్చాడు— అది బుల్లెట్. బుల్లెట్ గోడలో ఎందుకు ఉన్నదో అతడికి అర్థంకాలేదు. మయూరుకు అంతకన్నా అర్థంకాలేదు.

గదిఅంతా వెతుకుతున్నాడు డిటెక్టివ్ మయూరు. పురుషు లెవ్వరూ నివసిస్తున్నట్టు లేదు ఆగదిలో — చిన్నగది — సన్నటి మంచం — ఓ మూలసాంతు నిండా చీరలూ, జాకెట్లూ — కిటికీలో ఓమూల ఇస్త్రీపెట్టె, దానిపక్క నే ఎత్తైనచక్కపెట్టె, పెట్టెమీద ఉతికి మడిచిపెట్టిన లంగాలూ, బాడీలూ, మరోపక్క నిలువుటద్దం, అద్దంముందు చిన్న రౌండు టేబిలు, దానిమీద పౌడరు, లిప్‌స్టిక్ మొదలైన సామానులు...మరోమూల లేసు అల్లిన టేబిల్ క్లాత్ ఆరేసిఉన్నది. స్త్రీనివాసయోగ్యంగా తప్పితే మరోలా లేదుగది. పురుషులెవ్వరూ ఉన్నట్లుఎంతమాత్రం లేదు. గోడకిమధ్యగా పెద్దడ్రాయరు ఉన్నది.

డ్రాయరులాగాడు మయూరు. అందులో కొన్ని ఇస్త్రీచీరలు ఉన్నయ్. ఇంకా కొంచెం లాగాడు డ్రాయర్ని — స్తంభించిపోయాడు—చేతులు వణుకుతున్నట్టు ఉన్నయ్. గీరలగుడ్డ ఒకటి బయటకులాగాడు. ముడత



"ఏటికెదురు"

—చిత్రకారుడు : శీలా వీర్రాజు.

★ రెండంకాల హత్య ★

విప్పాడు. అది పురుషులు రాత్రి పూట తొడుక్కునే గీరల పైజామా. అటువంటివే ఇంకా రెండున్నయ్—వేర్వేరు రంగులలో. పైజామాలను పరీక్షించాడు. చాకలి మార్కు మూడింటి మీదా ఒక్కటే "A. J" అని ఉన్నది.

"పాషా" అని పెద్దగా కేకేశాడు మయూరారు. దగ్గరలోనే ఉన్న పాషాకు మయూరారే ఇంత పెద్ద కేక ఎందుకు వేశాడా అన్న సందేహం వేసింది.

"ఈమెను గురించి నీకేమైనా తెలుసా" అనడిగిన మయూరారు ప్రశ్నకు, "కొంత తెలుసు. కాని ఈ ఇంటి యజమానికి మిగతాది తెలిసుండవచ్చు" అన్నాడు పాషా.

మయూరారు ఇక ఆగలేదు.

గబుక్కున తలుపు తీశాడు. తలుపు దగ్గరే చెవిపెట్టి వింటున్న ఇంటియజమాని ఉలిక్కిపడ్డాడు. "ఊరికే... ఊరికే..." అని తడబడుతున్నాడు.

మయూరారు యజమాని భుజం మీద చేయి వేశాడు.

"మీ పేరు?"

"భు....భుగంజ....భుజంగరావు" అన్నాడు వణుకుతూ.

"భుజంగరావు గారూ, మీతో కొంత మాట్లాడాలి" అన్నాడు మయూరారు.

భుజంగరావు పలక లేదు.

"ఈ చనిపోయిన స్త్రీ—ఈమె పేరేమిటన్నారూ?"

"మీ నాకుమారి, మీనఅంటారు అందరూ. ఈ రోజే ఎవరో వచ్చారల్లే ఉన్నది. రాత్రి ఎనిమిది తొమ్మిది గంటలప్పుడు తలుపు తట్టిన చప్పుడయింది నాకు నా గదిలోకి వినబడింది తలుపు చప్పుడు" అన్నాడు భుజంగరావు.

"పాషా" అని మళ్లీ కేకేశాడు మయూరారు. దగ్గర్లోనే ఉన్న పాషాకు ఈ కేకల అంతరార్థం బోధపళ్లేదు.

"మీరు పెద్దగా అరుస్తున్నారు. నేను మీకు అంటుకునే ఉన్నాను" అన్నాడు.

మయూరారు సన్నగా నవ్వాడు.

"పాషా, భుజంగరావుగారు నీతో మాట్లాడాలిట. నాకు సెలవు ఇప్పించు," అన్నాడు.

పాషాకు సంగతి అర్థం అయింది. తను మీనాకుమారి విషయం భుజంగరావుద్వారా ఆరాతీసి అంతు తేల్చాలి.

మర్రోజు పాషా వద్దనుంచి ఏ వర్తమానం లేదు. శవాన్ని మాత్రం హాస్పిటల్‌కు తీసుకుని వెళ్లారు శవ పరీక్షకు. ముళ్ళమీద ఉన్నట్టు ఉన్నది మయూరారుకు.

"ఏమౌతుంది? హత్యా? ఆత్మహత్యా" ఇదే ఆలోచన అతడిది.

రాత్రి ఎనిమిది గంటలకు ఇంటితలుపు చప్పుడయింది. ఆతృతతో పరుగెత్తాడు మయూరారు.

తలుపవతల పాషా నిలబడి ఉన్నాడు.

"వెయ్యేళ్ళు. లోపలకురా," అన్నాడు మయూరారు.

"లోపల కొచ్చేందుకు టైము లేదు. మీరు అర్జంటుగా నాతో రావాలి. వివరాలు వెడుతూ చెబుతాను." అన్నాడు పాషా, మరీ అర్జంటుగా.

మయూరారు ఆలస్యం చేయలేదు. రెండో నిముషంలో తయారయినాడు.

కారువచ్చి పోలీస్ స్టేషన్ ముందు ఆగింది. ఇద్దరూ దిగి లోపలకు నడిచారు.

లోపల ప్రవేశించగానే ముగ్గురువ్యక్తులు కనుపించారు. పాషా ముగ్గురు వ్యక్తుల్నీ మయూరారుకు పరిచయం చేశాడు.

"ఈయన లాయరు. పేరు జోగారావు. వారిపేరు సత్యానందంగారు. ఈ కుర్రవాడి పేరు మోహనరావు.

మయూరారు మాటాడలేదు. మరో గదిలోకి ప్రవేశించాడు. జోగారావుగారికి కబురంపాడు.

జోగారావు బిక్కు బిక్కుమంటూ గదిలోకి వచ్చాడు.

"మీ ఇంటిపేరు." అన్నాడు మయూరారు గబుక్కున.

"అన్నెకంటి" అన్నాడు జోగారావు.

"మీకు ఎంతకాలం నుంచి మీనాకుమారితో పరిచయం ఉన్నది?"

ఈ ప్రశ్నకు త్రుళ్ళిపడ్డాడు. జోగారావు.

"మీరడుగుతున్నది నాకు బోధపడటం లేదు. అయినా అది నా వ్యక్తిగత విషయం. ఇంతకీ, మీరు నన్నెందుకు పిలిపించారో సెలవిస్తారా?" అన్నాడు. కొంత కోపం కనుపిస్తున్నది అతిడి కళ్లలో.

"మీనాకుమారి నిన్నరాత్రి ఆత్మహత్య చేసుకున్నది." అన్నాడు మయూరారు.

జోగారావు చలించాడు. భయం కనబడుతున్నది ముఖంలో. మాట్లాడలేదు జోగారావు.

"నిన్న రాత్రి ఆమె ఇంటికి మీరు ఎన్ని గంటలకు వెళ్ళారు?

"ఎనిమిది గంటలకు" అన్నాడు జోగారావు.

"తేలిపోయింది," అన్నాడు మయూరు జోగారావుకేసి తిరగకుండా.

జోగారావుకి మండిపోయింది.

"మీరు చెప్పింది — నేను మీనాకుమారిని హత్యచేశానంటారు - అంతేగా - కాని ఆధారం ఏమిటి?"

"మీ పైజామాలు" అన్నాడు మయూరు వెంటనే, "వాటిమీద "ఎ. జె." అన్న మార్కు వున్నది అన్నీకంటె జోగారావన్న మాట."

జోగారావుకి చెమటలు పోసుకున్నై. కర్చీఫ్‌తో తుడుచుకుంటున్నాడు.

"నాకేమీ అర్థం కావటంలేదు అనవసరంగా నిందమోపడం మీకు భావ్యంకాదు. కోరుకు లాగుతాను మిమ్మల్ని."

మయూర్ నవ్వాడు. "ఇకమీరు వెళ్ళవచ్చు" అన్నాడు.

* * *

సత్యానందం లోపల ప్రవేశించాడు.

"మీ రడగబోతున్నది నాకు తెలుసు. మీనాకుమారి విషయం — అంతేనా? ఆమె నాకు ఎంతవరకు తెలుసో నేనే చెబుతాను నాకో చిన్న బిజినెస్ ఉన్నది. దానో ఆమెకు నాలుగు షేర్లు ఉన్నవి నాలుగు వేల రూపాయలు. అప్పుడప్పుడు బిజినెస్ గురించి మాట్లాడుకోటం మాకు పరిపాటి నిన్న రాత్రి ఆమె ఇంటికి నేను వెళ్ళలేదు. ఆమెను నేను చూసి వారం రోజులయింది. అంతకన్నా నాకు తెలియదు. ఇహ నేను వెళ్ళవచ్చా?" అన్నాడు సత్యానందం.

"వెళ్ళవచ్చు" అన్నాడు మయూరు.

సత్యానందం హత్యలుచేసే ఆసామీలా కనిపించలేదు మయూరుకు. చిలిపికళ్ళు - పెదవులమీద చిరునవ్వు సత్యానందం ప్రత్యేకత వలపైపిల్లపైబడ్డా గూడా.

* * *

మోహనరావు ప్రవేశించాడు గదిలోకి. మయూరు అతడికేసి దీక్షగా చూశాడు. అమ్మాయిలు మామూలుగా ఒక మాటుగాక మరోమాటు తిరిగి చూసే అందం మోహనరావుది. పాతికేళ్ళ పొడుగాటి విగ్రహం. కాని అంత విగ్రహం వణుకుతున్నది.

"మీనాకుమారి మీ కెలా తెలుసు." అన్న మయూరు ప్రశ్నకు ప్రాణం లేచి పోయింది మోహనరావుకి.

"తె... తెలీదు... తెలుసు. ఆమె నాకు తెలుసు. జోగారావుగారు మా మేనమామ. ఆయనద్వారా తెలుసు."

"మీరు ఉండేది ఎక్కడ?" అన్నాడు మయూర్.

"మా మేనమామ ఇంట్లోనే."

"మీరేం చేస్తున్నారు?"

కాస్త సర్దుకున్నాడు మోహనరావు.

"నేను అసలు ఢిల్లీలో పుట్టాను. మా తల్లిదండ్రులు ఢిల్లీలోనే ఉన్నారు. నేను మద్రాసు వచ్చి సరిగా ఆరురోజు లయింది. అంతకుముందెప్పుడూ రాలేదు. మా మేనమామద్వారా మీనాకుమారి పరిచయం అయింది. ఆరురోజులక్రితం నేను మద్రాసు చూడలేదు. మీనాకుమారిని అంతకన్నా చూడలేదు. మూడు రోజుల్లో నాకు మద్రాసంతా ఆమె చూపించింది. లెట్‌హౌస్ ఎక్కాం. నిన్న రాత్రి రెండో ఆటకు సినిమాకు వెడదాం అన్నది ఎనిమిదిన్నరకు ఆమె ఇంటికి వెళ్లాను. ఒంట్లో బాగాలేదనీ ఇవాళ సినిమాకు వెడదామనీ అన్నది. ఇవాళ ఈ దారుణవార్త విన్నాను. అంతకన్నా నాకేమీ తెలియదు," అన్నాడు. మోహనరావు.

తను చెప్పదలుచుకున్నదేమిటో చెప్పాడు మోహనరావు. కాని ఇంకా భయంగానే ఉన్నాడు.

"ఒంట్లో బాగాలేదని చెప్పింది అన్నారు కదా, కారణం ఏమన్నా చెప్పిందా," అన్నాడు మయూరు.

"తల నొప్పి అన్నది," అన్నాడు మోహనరావు

* * *

ముగురు వ్యక్తులూ వెళ్ళిన తర్వాత పాషా మెల్లిగా లోపలకు ప్రవేశించాడు. సిగిరెట్ వెలిగిస్తున్న మయూర్‌ని చూస్తూ "ఏమంటారు?" అన్నాడు.

"అనేందుకేమున్నది. ఇది హత్య."

"ఒకవేళ హత్య అయితే హంతకుడు జోగారావు."

"ఎలా చెప్పగలవు?"

"చాల తేలిక విషయం. ఈ ముగ్గురిలో ఒక్క జోగారావుగారికే ఆమెతో సంబంధం ఉన్నదని రుజువయింది. పైగా అతి డొక్కుతో తరచు ఆమె ఇంటికి వెడతాడు. పైజామాలు ఆమె ఇంట్లో ఉన్నవి," అన్నాడు పాషా.

మయూరు నవ్వాడు.

"సరే, ఇంకొంత పరిశీలించవలసిన అవసరం ఉన్నది. రేపు మరికొంత గ్రంథం నడుపుదాం. నువ్వు మాత్రం ఈ ముగురిమీద కన్నేసి ఉంచాలి." అన్నాడు మయూర్.

ఇద్దరూ గదిలోంచి బయటకు వచ్చారు.

పాషావద్ద నుంచి శలవుతీసుకున్న మయూరుకు పరిపరివిధాల పోతున్నది మనస్సు. ఆఖరుకు ఒక నిర్ణయానికి వచ్చాడు. నేరుగా జోగారావు గారింటికి దోవతీశాడు.

* * *

మర్రోజు రాత్రి పదిగంటలకు పాషా ఆయాసపడుతూ మయూర్ ఇంటితలుపు తట్టాడు. తలుపు తీయబడింతర్వాత లోన ప్రవేశించినా అతడి ఆయాసం తగ్గలేదు.

"మీరు అర్జంటుగా రావాలి. కొంప మునిగింది — అనుకోకుండా పర్వతం పగిలింది. జోగారావుగారు ఆత్మహత్య చేసుకున్నారు." అన్నాడు పాషా మరీ ఆయాసపడుతూ.

మయూరు అదిరి పడ్డాడు. వళ్లు విరుచుకుని పోయింది.

ఒక్కక్షణం తర్వాత ఇద్దరూ బయలుదేరారు.


జోగారావుగారిల్లు నిశ్శబ్దంగా ఉన్నది. మోహనరావు తలుపుతీశాడు అతడి కళ్లంట నీళ్లు కారుతున్నై. "ఏమయింది?" అన్నాడు మయూరు. జవాబు కోసి ఎదురుచూడకుండా జోగారావుగారి గదిలోకి ప్రవేశించాడు.

తను చూసిన దృశ్యం మయూరును స్తంభింపచేసింది. కుర్చీలో కూచునివున్నాడు జోగారావు. మెడ వేళ్లాడుతున్నది. నుదుటి మించికారిన రక్తం ముక్కు పెదవుల మించి తెల్లటి చొక్కామీదకు ప్రవహించి భయంకరరూపం దాల్చింది. చేతిలో పిస్తలు ఉన్నది. గబుక్కున ముందుకు వంగి పిస్తలు ఉన్న చేతిని పరిశీలించాడు మయూరు. చేతినిండా తెల్లటిమసి ఉన్నది. సాక్షాత్తూ మీనా కుమారి చనిపోయిన సన్నివేశంలానే ఉన్నది జోగారావు పరిస్థితి.

మయూరు ఇహ ఆగలేదు. గబగబ గది అంతా దీక్షగా పరిశీలించాడు. తను అనుకున్నట్టుగానే ద్వారబంధంలో ఓ మూల ఏదో పదార్థం తెల్లగా మెరుస్తున్నది. బయటకు లాగాడు అది ఒక బుల్లెట్.

"నేను చాల ఆలస్యంచేశాను. లేకుంటే ఈ హత్య తప్పించగలిగే వాణ్ణి" అంటున్న మయూరుకేసి విస్మయాశ్చర్యాలతో చూస్తున్నాడు పాషా. అతడికేం బోధపడలేదు.

(34-వ పేజీ చూడండి)



[ఉద్యోగపర్వంనుండి]

క. యమమహిషఘంటికానా, దము వినఁ గౌతూహలంబు దళుకొత్తెడు చి
త్తములుగల కౌరవుల కిష్టము లగునే సంధికార్య శాంతవచనముల్.

క. మొదల విధినియతియును నట్టిద యందురు పెద్ద లది ఘటింపక పోదే
మదిఁ జూచి చెప్పినను ద, ప్పదు మేరువు దిరిగెనేనిఁ బాంచాలసుతా.

తే. పూని పలికెద వినుము రిపుక్షయంబుఁ, జేసి యుజ్జ్వలపుణ్యలక్ష్మీసమేతు
లైన పాండుకుమారుల యధికవిభవ, మీవు సూచెదు తడవు లే దిది నిజంబు.

క. అని యూఱడిలఁగఁ బలికిన, విని యంకిలి దేఱుచిత్తవృత్తిఁ గలుగునం
గన యేడ్పుడిగెం దగ ఫ, ల్గునుఁ డిట్లని పలికె నపుడు గోవిందునితోన్.

తే. పాండవులు ధార్తరాష్ట్రులుఁ బుండరీక, నేత్ర చుట్టరికంబున నీకు నొక్క
రూపకావునఁ గోరి యేహూపునందు, నుభయపక్షంబులకుఁ జేయు ముచితహితము.

క. ధర్మార్థసంగతంబుగ, ధర్మతనయు చెప్పినట్ల తగఁ బల్కఁగ నా
దుర్మతులు కౌరవులు స, త్కర్మమునకుఁ జొరక యున్న దైవమ యెఱుఁగున్.

క. అన విని కౌరవులకు మీ, కును హితముఁ బ్రియంబుఁ జేయఁ గోరియ కుంతీ
తనయాగ్రజుపని ధృతరా, ష్ట్రునికడకుం బోయెదను గడుం బ్రీతిమెయిన్.

క. అని పలికిన హరి ధర్మవ, చనముల తెఱఁగున కజాతశత్రుఁడు చిత్తం
బునఁ బొంగి యట్ల చేయుము, మన నిశ్చయ మిదియ దీని మఱవకు మనఘా.

వ. అని కార్యంబు నిశ్చయించి దినశుద్ధి నిరూపించి నారాయణుం జూచి నీ నక్షత్రంబు రోహిణిగదా యెల్లి రేవతి నీకుఁ జంద్రతారాబలంబులు గలవు గమనంబునకు రేపకడయ మేలు పయనం బగుట లెస్స యని చెప్పిన నప్పులుకుల కతండు సగౌరవంబుగా నియ్యకొనినం బాండవాగ్రజుండు గొలువుం గలయం గనుంగొని యెల్లవారును విన నది యట్ల కాక యని పలికి తదనంతరంబ తానునుం దమ్ములు బాంచాలియుఁ బరివారంబును నుచితప్రకారంబున నిజనివాసంబులకుం జనిరి. మఱునాఁ డరుణోదయంబునఁ గృష్ణుండు గాలోచితకృత్యంబులు నిర్వర్తించి సూర్యోపాస్తి సేసి యగ్నిసమారాధనం బాచరించి ధరణీసురులం బ్రణామ పూర్వకంబుగాఁ బ్రయాణదాన ప్రముఖపూజా విశేషంబులఁ బ్రీతులం గావించి వారల యిచ్చు నాశీర్వాదంబులును సమంత్రాక్షత దూర్వాంకురాదులునుం గైకొని యుచితప్రదేశంబుననుండి సాత్యకి రావించి.

క. మన ప్రజలోఁ గరిపురికిం, జనుదేరఁగ వలయు వారి సవరణతో రం
డని యేర్పడ నియమింపు ప, యనమై రా తెమ్ము నీవు నని తగ మఱియున్.

వ. దుర్యోధనుండు దుష్టాత్మకుం డతండు మన్నించు మానుసులునుం గుటిలబుద్ధులు గావునఁ జక్రగదాద్యాయుధంబులు రథంబునం బెట్టింపవలయు నని చెప్పి పనిబి సమయజ్ఞతం బొడసూపి నిలుచున్నదారుకుం జూచి తేరు పూన్ప నియోగించిన నతండును మణిగణప్రభాపటలజటిలం బగు నరదంబు వన్ని శైబ్యసుగ్రీవ మేఘపుష్పవలాహకంబు లనం బరఁగు తురంగంబులం బూన్చి గరుడధ్వజం బెత్తి తెచ్చినం దానునుం బయనంపుఁజందంబునఁ గట్టాయితం బై జనంబుల చూడ్కులకుం బండు వగుచుఁ బుండరీకాక్షుండు మంగళతూర్యంబులు సెలఁగఁ జామరంబు లల్లసిల్ల రథం బెక్కిన యవసరంబున నౌదవ సపరివారంబుగా నరుగుదెంచిన సాత్యకిం దనరథం బెక్కించుకొని యాంగి

కంబు లైన శుభసూచకంబులు గైకొనుచుఁ బూర్ణకలశవృషభాదిభద్రపదార్థంబుల నవలోకించుచుఁ బుణ్యాంగనలు పేస లొలుకఁ జిత్తంబు ప్రసన్నతం బొంద వెడలునప్పుడు.

సీ. పాండవ యాదవ పాంచాల కేకయ పాండ్య మాత్స్యాదులు భద్రదంతి
హయరథంబులతోడ నతికుతూహలమున వచ్చినఁ గనుఁగొని వారి నెల్ల
సంభావనంబుల సంభాషణంబుల నాదరించుచుఁ దగ నల్ల నల్ల
విభవంబు మెఱయంగ విడిదలపటి పెల్లఁగడచినయత్తఱిఁ గరము శుభము

ఆ. లైన శకునములకు నందఱుఁ బ్రియ మంద, నరుగు చున్న యట్టి యవసరమున
రథము రథముఁ గదియరా నిచ్చి ధర్మనందనుఁడు నెమ్మి నిట్టు లనియె హరికి.

ఉ. వచ్చె జనార్దనుం డనినవార్తకుఁ బ్రాణము మేని కంతకున్
వచ్చిన నేద దేఱుఁ గురువంశపవిత్రచరిత్ర గొంతి నీ
వచ్చటి కేఁగి పాండవుల యందఱ మా అని చెప్పి మ్రొక్కుచున్
గ్రుచ్చియ కౌఁగిలించుకొని కుందినచిత్తము నొప్పిదీర్పుమీ.

చ. అడవికి నేఁగునాఁడు మము నంపఁగ నెంతయు దవ్వు వచ్చిన
ప్పుడు దన మోహము దైన్యమునఁ బొందెడునశ్రులుఁ జూచి చూచి య
ట్లొడఁబడి డించి పోవలసె నుమ్మలికమ్మునఁ గొంతి యింతకున్
బడు గయి పాలలోఁ బడినబల్లివిధంబున నుండకుండునే.

క. లక్కయిలు గాలినది మొద, లక్కట మాతల్లి మాకు నై నెవ్వగతోఁ
బెక్కుడుమలఁ బడుచున్నది, ది క్కెవ్వరు లేనియట్లు దీనత్వమునన్.

క. ఏ ననుట గాఁగ దుఃఖము, లైనవి దెగునమయ మయ్యె నని చెప్పుము మీ
మేనత్త నూఱడింపుము, దా నెప్పుడు నీవు గలవు తన కను చుండున్.

వ. అని చెప్పి వెండియు.

ఆ. గురుఁడు బాహ్లికాదికురువృద్ధులును సుహృ, ద్బాంధవులు నశేషధరణిపతులుఁ
బ్రీతిఁ బొంద నెవ్వరికి నేది దగుఁ బ్రణా, మాదివిధుల నడపు నాదుపలుకు.

క. పరమప్రియమున నాకై, పరిరంభణ సేసి గాఢబాంధవసాంద్రా
దరమున సంభావింపు విదురుతో మధ్యస్థుఁ డగు హితుం డతఁ డనఘా.

వ అనియెఁ దదనంతరంబ యర్జునుండు.

చ. జనులు వినంగ రాజ్యమున సాము గొనం గలవార మన్న యీ
జనపతికార్యనిశ్చయము సమ్మతి గైకొని చేసినన్ సుయో
ధనుఁడును దమ్ములున్ సఖులు దానికి నేమును నియ్యకొందు మొం
డనిన సపుత్రమిత్త్రముగ నద్దెస నందఱ ద్రొచ్చి పాఁతుదున్.

మ. అనినన్ మెచ్చి వృకోదరుం డితఁడు కార్యం బింత దెల్లంబుగాఁ
బొనరం బల్కెనె యంచుఁ బేరెలుఁగు సొంపుం బొంద వక్త్రంబు పొ
ల్చున దర్పం బొలయంగ సంగములకుం బొంగారు నుద్బృంహిత
ధ్వనిమై పొల్చుమహోగ్రసింధురముచందం బొంది యొప్పెం గడున్.

క. నకులసహదేవులును దానికి సంతస మంది యిట్లు నెయ్యము కయ్యం
బొక తెఱఁగు సేసికొని తడయక రమ్మని పలికి రప్పు డచ్యుతుతోడన్.

శ్రీకృష్ణుఁడు నారదాదిమహామునులం గని సంభావించుట

వ. ఇవ్విధంబునం బాండునందను లందఱును గోవిందునకు వలయుమాటలు సెప్పి యతనిఁ గౌఁగిలించికొని యథోచిత ప్రకారంబున వీడుకొని వలగొని మగిడిరి తక్కినవారలు సర్వంబు లగు తెఱంగుల నామంత్రితులై మరలిరి మాధవుండును ప్రయాణసర్వసంభార నిర్వాహకులఁ గలయం గనుంగొని తగిన సల్లాపంబులు సేసి కరినగరంబు పెండె

రువు గైకొని దారుకుని చతురత్వంబునఁ దురంగంబుల పటుత్వంబున నత్యంత సమీచీనం బైన యానంబున మనం బలరం జనిచని యొక్క యెడ నారద జమదగ్ని కణ్వాదు లగు మహామునులం గొందఱం గని రథంబు డిగ్గి నమస్కరించి సద్భక్తి తాత్పర్యంబునఁ గుశలం బడిగి మీ రిక్కడకు విజయం చేయుటకుఁ గతంబేమి సేయం గల పని యెయ్యది నా కానతీం డనిన నారాయణునకు నారదుం డిట్లనియె

సీ. అనఘ పుణ్యాత్ముండ వగు నిన్నుఁ గనుఁగొనఁ గౌరవసభ నీవు గారవమునఁ
బలికెడిపలుకులభంగు లాకర్ణింప విదురభీష్మాదులు విను తెఱంగు
నుత్తరం బిచ్చు కార్యోక్తులు నెఱుఁగంగ వేడుక వచ్చిరి వీర లెల్ల
నని చెప్ప విని లెస్స యట్ల చేయుదురుగా కని హరి వల్కిన నమ్మునీంద్రు

తే. లతని దీవించి నీవు పొ మ్మచటి కేము, నరుగుదెంచెద మని ప్రీతి ననుప నరిగి
యొక్క పుణ్యాశ్రమంబుల యొద్ది యేట, విడిసి దివసప్రవర్తనవిధులు నడిపి.

వ. కమలనాభుండు గదలిపోయి సూర్యాస్తమయసమయంబునఁ గుశస్థలంబు సేరం జనునప్పు డందలి విప్రు లెదురు వచ్చి కాంచి నిజనివాసంబులకుం జనుదెండని పిలిచినం బ్రసన్నవదనుం డగుచు సమ్మర్దంబు వలవ దని పలికి విశాలరమణీయంబైన బహిరంగణంబునం బటకుటీర ప్రకరం బెత్తించి విడిసి తగువారును దానును వారల గృహంబుల కరిగి యభ్యాగతపూజలు గైకొని వారిని సంభావించి విడిదలకుం జని సమయసముచితవృత్తిం బ్రవర్తిల్లుచుండె నంత నక్కడ.

తే. వార్త విని యాక్షణమ కౌరవక్షితీశ్వ, రుండు గాంగేయగురువిదురులను బుత్రు
సంజయునిఁ గర్ణ సైంధవు శకునిఁ బిలువఁ, బనిచి తా నిట్టు లనియె నందనునితోడ.

వ. కృష్ణుండు పాండవకార్యార్థంబుగా మనయొద్దకు వచ్చుచున్నవాఁడు నేఁడు కుశస్థలంబున విడిసె రే పిందు వచ్చునని వింటి మిట్టియాశ్చర్యంబునుం గలదే సర్వలోకాభిగమ్యుం డగు నమ్మహానుభావునకు మన మభిగమ్యుల మైతిమి మన కింతకంటెను బెం పెయ్యది యతఁ డెవ్వరివలన సంతుష్టుం డయ్యె వారికి శుభంబును నెవ్వరిదెస ననాదరంబు సేసె వారికి నశుభంబు నగుట దప్ప దతనికి వలయుపూజ లాచరించుటకు సంవిధానంబు సేయుము గృహాలంకరణాది మంగళప్రకారంబు లనుష్ఠింప నియమింపు మతని చిత్తంబునకు నీవిభవంబును దనమీఁది ప్రియంబునుం దోఁచునట్టి తెఱంగున సమస్తంబును సమకట్టుము.

క. అనిన ధృతరాష్ట్రుపలుకులు, గొని యాడిరి సంతసిల్లి గురుఁడును భీష్మం
డును నౌఁగా కని దుర్యో, ధనుఁడుం బరిచారక ప్రతతిఁ బిలిపించెన్.

వ. ఇట్లుచితపరివారంబు రావించి యతఁడు,

క. అలుకుఁడు మృగమదమున ము, గ్గులు వెట్టుఁడు కప్పురమునఁ గుంకుమమున గో
డలు పూయుఁడు మణిదామక, ములు గట్టుఁడు పెద్దకూటమున సొంపారన్.

వ. మఱియు నగ ళ్లెల్లను శోభిల్ల నలంకారంబు సేయుండు.

క. పెనుపుం జతురత మెఱయఁగ, మనయింటను దుస్ససేనుమందిరమున శో
భనశిల్పము లొనరింపుఁడు, చనుఁడు వృకస్థలమునందుఁ జప్పరము లిడన్.

వ. అది విడుఁబట్టు గాఁదగియెడుప ట్టని పలికి వాసుదేవుండు రేపకడయ వచ్చునంతకు మున్న యింతయుం గావింప వలయు నని పనిచి పురంబున నుత్సవంబు సాటుం డని నియోగించి వివిధగంధమహితమాల్యంబులు సంపాదింపను మణిభూషణ చిత్రాంబరంబులు సమకట్టను సరసాన్నస్వాదుపానద్రవ్యంబు లొడఁగూర్పను నేర్పరు లగుతజ్ఞుల నియమించె నట్టియెడ నాంబికేయుండు విదురున కిట్లనియె.

ధృతరాష్ట్రుఁడు విదురుతో శ్రీ కృష్ణుని రాక సెప్పి సంతోషించుట

క. వివిధమణిమయరథంబులు, జవనాశ్వంబులును భద్రసామజములు ర
త్నవిభూషణములు దాసీ, నివహంబులుఁ జాలఁ గృష్ణునికి నే నిత్తున్.

క. మనయింట సుయోధనుగృహ, మున దుశ్శాసనునికేతమున నెయ్యది యా
తనిచూడ్కి కించు నది యె, ల్లను గౌరవ మొప్ప నీ వలయు మన కనఘా.

చ. అన విని యాతఁ డిట్లనియె నంబుజనాభునిఁ బ్రీతుఁ జేయు కం
టెను హిత మైనకృత్య మొకటిం గలదే యది మేలు పాండునం

దనులకు నైదుయూళ్లు లుచితస్థితి నిచ్చుట కోప మన్న యు
న్కిన యిటు లోపుకల్మి ధరణీవర యేమిట వచ్చెఁ జెప్పుమా.

ఉ. నీతలఁ బేను గంటి నొక నేర్పున శౌరికి లంచ మిచ్చి సం
ప్రీతునిఁ జేసి కార్యగతి భేదము సేయఁగఁ జూచె దింత బే
లైతిగదే సుమేరుసదృశార్థముఁ జూచియుఁ బార్థుఁ బాయు నే
యాతఁడు క్రీడిభక్తియును నచ్యుతు పెంపును నీ వెఱుంగవే.

తే. అర్జునుఁడు ప్రాణతుల్యుండు వారికి నట్లు, గాన జలపూర్ణమంగళకలశమునకుఁ
బాద్యమునకును గుశలసంప్రశ్నమునకు, మిగుల నొందు జనార్దను మెచ్చుగాదు.

క. మనకడకు నేమి కార్యం, బునకై యాతండు వచ్చెఁ బూనికిమెయి నా
పని వంచింపక చేయుట, విను మతనికిఁ బ్రియము దక్క వేయును నేలా.

వ. అనిన విని దుర్యోధనుండు దండ్రి కిట్లనియె.

క. అది విదురు చెప్పినట్టిద, తుదిఁ గృష్ణుఁడు పాండుసుతులతో వే అగు నే
పదనే యాగికి నిచ్చిన, బెదరి రనరె యొచ్చెమైనఁ బిమ్మట నగరే.

ఆ. అతఁడు పూజనీయుఁ డగు నే నెఱుంగుదు, నైన ధనము లీగిన నదతనకు
వచ్చుఁ బెచ్చువెరిఁగి వైరులు గర్వింతు, రేల పగ యడంగు నిట్టు లైన.

క. అనవుడు భీష్ముఁడు ధృతరా, ష్ట్రున కిట్లను నీవునుం గొడుకు నే మే ని
చ్చిన నొకటి యాగి లేకు, న్నను వే ఒక్కటి దలంచునా కేశవుఁడున్.

క. విను మతఁడు సేయఁ బూనిన, పని దప్పింపంగ రాదు పాండవులం దే
ర్పను గృష్ణుఁడు వెరవుగఁ జొ, చ్చిన మే లాపురుషునుపు సేయుము పుత్రా.

క. నారాయణుండు ధర్మా, ర్థారూఢము గాఁగఁ బలుకు నది నీవును నీ
వారును గైకొని యెంతయు, గారవమునఁ జేయ నెల్ల కార్యంబు నగున్.

క. అనుటయు సుయోధనుఁడు భీ, ష్మున కిట్లనుఁ బాండురాజసుతులకు నిమ్మే
దిని వారి నగఁ బాలీఁ దగు, ననుఁ బో యే నీను గాని యది య ట్లుండెన్.

వ. వే తొక కార్యంబు సేయం దలచితి నది వినుము పాండవులకు నేడుగడయు జనార్దనుం డతనిం బట్టి బంధించిన తెక్కలు విఱిగిన పులుఁగులుంబోలె వారు నాకు విధేయు లగుదురు పాంచాలయాదవాదు లైన తదీయబంధుమిత్త్రులు నా వశంబున వర్తిల్లుదురు సమస్తదేశంబులు నేన యేలుదు దీనికిం దగిన యుపాయ సహాయంబు లనువు సేసెద నీ వింక నేమి సెప్పెదవు చెప్పు మనిన విని యతి ఘోరం బగు నవ్విచారంబునకు నమాత్యసహితంబుగా సంతప్త చిత్తుండై వైచిత్రవీర్యుండు గొడుకున కి ట్లనియె.

క. ఓహో యి ట్లనుట జగ, ద్ద్రోహం బిమ్మాట మఱవు దూతత్వంబుం
మాహాత్మ్యంబును ధర్మా, త్మాహంబును విను మబాధ్యతకుఁ గారణముల్.

క. ఈ కారణములు గల వను, నాకొలఁదియె వాసుదేవుఁ డది గాకయుఁ గీ
డే కురువంశమున కతని, రాక యతం డేమి సేసె రా పాపాత్మా.

వ. అని యదల్చె నప్పుడు గాంగేయుం డంబికేయున కి ట్లను నీకొడుకు ప్రాణగొడ్డం బైన కార్యంబు సేయం దలంచె దామోదరు నిట్లు సేయం జూచెనేనిం దానును బ్రధానులును వినాశంబుఁ బొందు నింతియ యిది సేసి రేమి సేయ రై రేమి యమ్మహాత్మునెడ నీయపకారంబు విచారించిన దుష్టాత్ములు నష్టాత్ముల కాక యని పలికి యే నిట్టిదాని వినంజాల ననుచు మొగంబు గంటువెట్టుకొని దిగ్గన లేచిపోయె ధృతరాష్ట్రుండును దుర్యోధనునితో నిటువంటి కొఱగాములు మనంబున దలంచినప్పుడు సేయంగలవాఁడవు గావున దీనం జెటు వచ్చు నుడుగుమయ్య యని చెప్పి యతనిం దక్కినవారినిం బోవం బనిచి తగిన వర్తనంబున నుండె మఱునాఁడు. ★

స్వతంత్ర వివాహము

‘స్వతంత్రం, స్వతంత్రం అంటూ చెప్తారే కాని వారి వారి స్వతంత్రాలను వారికి వదలిపెట్టాలని ఎవరికీ లేదు’ అనుకుంటూ విసుగ్గా కుర్చీలో కూర్చున్నాడు శేఖర్. ఎదురుగా టేబుల్ మీదవున్న దీపాన్ని చూస్తూ అల్లాగే కూర్చుండిపోయాడు. తన మనస్సు వనజపరమయిపోయింది. అతను ఆమెతో కలసి కాలేజీలో చదివిన రోజులు, ఆ కళ్ళు, ఆ నడక, ఆ వయ్యారము-తల్చుకొంటే కళ్ళుజలదరించిపోతోంది శేఖర్‌కు. వెంటనే ఆమె కొక ప్రేమలేఖరాయాలనిపించింది. అల్లా అనుకొని ప్రారంభించేలోగా విచారగ్రస్తురాలైన తన తల్లి, కోపంతో వున్న తండ్రి జ్ఞాపకమొచ్చారు. తండ్రి ధ్యాస వచ్చినపుడల్లా, అన్నీ మర్చిపోయి ఒళ్లంతా మండిపోయినట్లయిపోతుంది తనకి-ఈ విధంగా ఆలోచనలతో భోజనముచేయటముకూడా మర్చిపోయాడు.

ఇంకా శేఖర్ భోజనముచేయలేదని వెతుక్కుంటూ శేఖర్ గదిలోకి వచ్చింది తన తల్లి. శేఖర్ దేనినిగురించి అంత తీవ్రంగా ఆలోచిస్తున్నాడో ఆమెకు తెలుసు. అయినప్పటికి ఆ విషయం కెలకదల్చుకోలేదు.

‘పదిగంటలు దాటిపోయింది. ఇంకా భోజనము చేయలేదా!’ అంది, తన తల్లి తన గదిలోకి రావటమే చూడని శేఖర్ తల్లి గొంతుక విన్నవెంటనే—

‘అమ్మా! ఇది అసంభవము. ఇది జరగదు. ఎవరు చెప్పినా నేను వినదల్చుకోలేదు. ఇది నా యిష్టానికి సంబంధించినది.’ అంటూ దగ్గిరికి వచ్చాడు శేఖర్.

‘ఏది నీ యిష్టానికి సంబంధించినది? ఎవరు నీ యిష్టములో కలగచేసుకొన్నారు?’ అంది సౌమ్యంగా.

‘నా వివాహ విషయము నా యిష్టం. అందులో నువ్వు, నాన్నగారు కలగచేసుకోవటము ఏమి బాగాలేదు.’

‘వివాహ విషయము ఒక్కటే నా నీయిష్టం? నిన్నుకని, పెంచి, పెద్దచేసి, చదివించిన దంతా నీ యిష్టంలో చేరలేదా?’

‘దానికీ దీనికీ ఏమిటమ్మా సంబంధము? నాకు యిష్టమైన అమ్మాయిని నేను పెళ్ళి చేసుకోవటము, నాకు యిష్టములేని అమ్మాయిని నేను పెళ్ళిచేసుకోక పోవటము— నాకు సంబంధించినది కాదా?’

‘అవును. నీకు సంబంధించినదే. అయితే నీ యిష్టం ఒక్కటే చూసుకొంటే చాలు ననుకొంటున్నావా? నువ్వు ఇష్టమంటూ చేసేపని మంచిదా, కాదా అనిచూసి సరియైన దారి చూపవలసిన బాధ్యత మాది కాదా?’

‘నేను యిపుడు ఏం తప్పు చేశాను’— విసుగ్గా అన్నాడు శేఖర్.

‘నువ్వు మీ నాన్నగారు చెప్పినట్లు వినక పోవటమే చాలా పెద్ద తప్పు. ఆయన, సుబ్బులిన్ని నీ కిచ్చి తప్పకుండా పెళ్ళి చేస్తానని సుశీలమ్మగారికి ప్రమాణము చేశారు. ఆయన మాటను దాటి పోవటము నీకు న్యాయమా?’

‘ఆయన చేసిన ప్రమాణానికి బాధ్యుడను నేనన్నమాట. ఇదేనా తండ్రి కొడుక్కి యిచ్చే స్వతంత్రము!...అమ్మా! ఆఖరు సారిగా చెప్తున్నాను. ఈ వివాహము జరగనే జరగదు... పేరు చూడు...సుబ్బులు... ఆ పేరు వింటేనే చాలు నాకు......’

‘పేరులో ఏముంది నాయనా! దానికి వున్న అందచందాలు ఎవరికి వున్నాయి! చేతికి వచ్చినట్లు పౌడర్లు, స్నోలు యింకా ఏమేమో రాసుకొని ‘టిప్‌టాప్’గా వస్తే నిజంగా అందంగా వున్నారనుకొంటున్నావా? అది నీ మేనమామ కూతురని మర్చిపోయావా?’ అని వీలైనంతవరకు చెప్పి చూసింది శేఖర్ తల్లి.

‘అమ్మా’ మామయ్యకూతురనో లేక ఇంకెవరి కూతురనో చేసుకునే రోజులు పోయాయి. ఇటువంటి మాటలన్నింటిని మూటకట్టి ఫుల్లలబండిలో వేసి కాశీయాత్రకు పంపేరోజులు వచ్చాయి.’ అనేశాడు శేఖర్ ధైర్యంచేసి.

ఈమాటలు వింటూనే శేఖర్ తండ్రి ప్రకాశరావు ఆయనచెల్లెలు భర్త రఘుపతి అక్కడికి వచ్చారు. తల్లిదగ్గర వాదించినట్లు తండ్రిదగ్గర వాదించగల ధైర్యంలేదు శేఖర్‌కు. ఆవిధంగా ఏప్పుడూ జరగలేదు. తండ్రి రావటముతోనే శేఖర్ నోరు మూతబడింది. తలవంచుకొని నిల్చున్న శేఖర్‌నుచూసి—

‘శేఖర్’ పిడుగులాగ వినిపించింది తండ్రి గొంతుక.

‘చదివి డిగ్రీ సంపాదించినవాడివి. నువ్వు యీవిధంగా మారతావని మేము కలలో కూడా అనుకోలేదు. ఏదో స్వతంత్రం, స్వతంత్రం అంటూ తెగ వాగుతున్నావే, నీకు ఎదిలోనే అదిపట్టుకు వేళ్లాడటమేనా స్వతంత్రం? నిజమైన స్వతంత్రానికి నీతికి మంచి, చెడ్డ, కట్టుబాటులున్నాయి. నీలాంటి మూర్ఖుడు ఏనాడుకూడా నిజమైన స్వతంత్రాన్ని పొందలేడు. ఇన్నాళ్ళ నుంచి మేనరికం చేసుకోవడానికి యిష్టపడిన నువ్వు ‘అకస్మాత్తుగా ఏం స్వతంత్రాన్ని కనుక్కున్నావు?’ అంటూ ఘాటుగా అంటించాడు శేఖర్ తండ్రి.

"దాన్ని పెళ్లిచేసుకోవటానికి నాకు యిష్టము వుండవద్దా?"

"ఇప్పుడు నీకు యిష్టము ఎలావుంటుంది. నా మీద, నిన్ను కని పెంచినదానిమీద యిష్టమున్నంతకాలము సుబ్బులును చేసుకోనేందుకు యిష్టపడ్డావు...మామీద నీకున్న గౌరవమంతా గంగలో కలిసింది. ఆఖరుసారిగా చెపున్నాను. నా చెల్లెలు చనిపోయే ముందు సుబ్బులును నీకే యిచ్చి చేసుకొంటానని వాగ్దానము చేశాను. అందుకు నువ్వు కూడా యిష్టమున్నవాడివిగా యింతవరకు నడచుకొంటూ వచ్చావు. వివాహము తొందరలో చేయాలనే ఆశతో మీ మేనమామకూడ వచ్చాడు. నువ్వు నేచెప్పినట్లు వింటావా చాలా సంతోషము. లేదూ నీ స్వతంత్రమే నా మాటకన్నా గొప్పదైతే ఏదో ఒకటి తేల్చి చెప్పు' అన్నాడు తండ్రి.

శేఖర్ ఏమి బదులు పలక్కుండా తల వంచుకొని నిల్చున్నాడు. ఇంతవరకు ఏమి మాట్లాడకుండా వున్న శేఖర్ మేనమామ, శేఖర్ తండ్రితో 'సుబ్బులు వీడిమీద పంచప్రాణాలు పెటుకొని వుంది. దాన్ని మోసం చేయటం న్యాయంకాదు. వీడు సుబ్బులుని చేసుకోడని అనుమానంతో కాబోలు చాలా మంది సంబంధంకోసం వస్తున్నారు. ఎం. ఏ. ప్యాసయి, ఒక ఆఫీసరు హోదాలో వున్న రాజారావు అనే అతను అమ్మాయిని చేసుకోవాలని చాలాపట్టుదలతో వున్నాడు. నాకుమాత్రము సుబ్బులును వీడికి తప్ప యింకొకరికి యివ్వటము యిష్టమూ లేదు, అన్నాడు.

'విన్నావా శేఖర్ జాగ్రత్తగా ఆలోచించుకో,' అన్నాడు శేఖర్ తండ్రి.

శేఖర్ జవాబు చెప్పలేదు. ఆలోచిస్తున్నట్లుగా తోచింది వారందరికి. వారిలో 'ఆశారేఖ' తొంగిమాసింది.

'బాగా ఆలోచించుకొని రేపు చెప్పు నీ సమాధానము. ఇపుడేమి తొందరలేదు' అని మళ్ళీ అన్నాడు శేఖర్ తండ్రి. ఆనాటికి



★ స్వతంత్ర వివాహము ★

సంభాషణ ముగిసింది.

2

శేఖర్ తండ్రి ప్రకాశరావు మద్రాసులో ఒక గొప్పవ్యాపారి. లక్షాధిపతి. ప్రకాశరావు పుట్టిన మరుసటి సంవత్సరమే పుట్టింది అతని ఒక్కగానొక్క చెల్లెలు సుశీల. పేరుకు తగినట్లుగా చాలా గుణవంతురాలు. చిన్నతనంలోనే అన్నిపనులు నేర్చుకుంది తల్లి సహాయంతో. సుశీల ఆడపిల్లల బడిలోను ప్రకాశరావు మగపిల్లలబడిలోను చదువు ఆరంభించారు. అతి అన్యోన్య భావంతో మెలిగేవారా సోదరీసోదరులు. సుశీల యస్. యస్. యల్. సి. పరీక్షకు వెళ్లిన సంవత్సరమే వారి తండ్రి పోయారు. అంతటితో వారి చదువు ఆగిపోయింది.

సుశీల అందము, గుణగణాలు చూసి ఆమెను వివాహము చేసుకొనేటందుకు చాలామంది ముందుకు వచ్చారు. వారిలో కొందరు కోటీశ్వరులు కూడా వున్నారు. కాని ప్రకాశరావు డబ్బుకు ఆశపడక తన దూరబంధువైన రఘుపతికి ఇచ్చి చేయాలనుకున్నాడు. సుశీలా రఘుపతులు ఒకరినొకరు ప్రేమించుకొన్నవారు కారు. కనీసము ఒకరినొకరు ఎప్పుడూ చూడలేదు. రఘుపతి అందగాడే. చదువుకొన్నవాడే. డబ్బుని నమ్మి సుశీలను ఒక కోటీశ్వరునికి యివ్వటంకన్నా, రఘుపతి వంటి యోగ్యుడు, గుణవంతుడు అయిన ఒక సామాన్య కుటుంబీకునికి యిచ్చి వివాహము చేయటము ఉత్తమమని ఎంచి ముహూర్తము నిశ్చయించాడు ప్రకాశరావు.

సుశీలా రఘుపతుల వివాహము అతి వైభవంగా మద్రాసులో జరిగింది. అప్పటినుంచి రఘుపతి, ప్రకాశరావుకు వ్యాపారంలో 'చేదోడువాదోడు'గావుండి చాలా సహాయం చేశాడు. తత్ఫలితం లాభం లెక్కలకు దాటిపోయింది. ప్రకాశరావు తండ్రి మలయా, సింగపూరు ప్రాంతాలలో ప్రబల వ్యాపారిగా చెలామణీ అయినవాడు. ఆయనఅక్కడ సంపాదించిన డబ్బుతో ఒక పెద్ద రబ్బరు తోట కొన్నాడు. అక్కడ పనులను చూసేందుకు తగిన మనుష్యులను నియమించి ఆయన జాగ్రత్తగా చూసుకొంటూ వుండేవారు. ఆయన పోయిన తరువాత అక్కడి మేనేజరు వచ్చిన లాభమంతా దుర్వినియోగము చేసి తప్పుడు లెక్కలుపంపటము మొదలుపెట్టాడు. అందుచేత ఒక కొత్త మేనేజరును నియమింపవలసిన పరిస్థితి ఏర్పడింది ప్రకాశరావుకి. ప్రకాశరావు దృష్టిలో రఘుపతికన్న నమ్మకస్తుడు, సమర్థుడు యింకెవ్వరూ పడలేదు. అందుచేత రఘుపతిని సింగపూరు కార్యాలయానికి పంపించాడు. సింగపూరు వెళ్ళిన రఘుపతి చెడిపోయిన పరిస్థితి నంతటిని సరిచేసి, సమర్థులయిన పనివారిని నియమించాడు. తనకు సింగపూరు చాలా బాగున్నదని తన కాపరాన్ని సింగపూరులోనే పెట్టుకుంటానని చెప్పి, ప్రకాశరావు యిష్టముమీద సుశీలను కూడా తీసుకొని వెళ్ళి అక్కడే స్థిరనివాస మేర్పరచుకొన్నాడు.

ఆ తరువాత ఒక సంవత్సరానికి ప్రకాశరావుకు వివాహము జరిగింది. రఘుపతి చల్లని చేయి పడటముతోనే రబ్బరు తోటలమీద ప్రతి సంవత్సరము వచ్చే లాభంకన్నా మూడింతలు లాభము వచ్చింది ఆ సంవత్సరము. ప్రకాశరావు సంతోషము వర్ణనాతీతము. ఆ వివాహానికి సుశీలా రఘుపతులు వచ్చివెళ్లారు. ఆ తరువాత సంవత్సరము ప్రకాశరావుకు శేఖర్ పుట్టాడు. ఆ తరువాత మూడు సంవత్సరములకు సుశీల గర్భవతి అయింది. పురిటికి సుశీలను మద్రాసు తీసుకొని రావాలనుకొన్నాడు ప్రకాశరావు. కాని సుశీల గర్భవతి అయినప్పటినుంచి ఆమె ఆరోగ్యము క్షీణించసాగింది. అందుచేత సుశీలను సింగపూరులోనే వుంచేశాడు రఘుపతి. అక్కడే పుట్టింది సుబ్బులు. రఘుపతి ఇష్టదైవము 'సుబ్బారాయుడు' కావటంచేత 'సుబ్బులు' అని నామకరణం చేశాడు.

సుబ్బులు పుట్టినప్పటినుంచి సుశీల ఆరోగ్యము ఇంకా హీనదశకు వచ్చింది. ఏరోజు కారోజు ఆఖరురోజులా కనిపిస్తూ, ఆరు సంవత్సరాలు కాలప్రవాహములో దొర్లిపోయాయి. తరువాత ఆమెను మద్రాసు తీసుకొనివచ్చారు. తను బ్రతకదని తెలుసుకొన్న సుశీల తన అన్నగారి చేతులు పట్టుకొని 'అన్నయ్యా! యీ మందులు యీ డాక్టర్లు యింక దండుగ. నేను యింక ఎంతో కాలం బ్రతకను. నువ్వు నాకు ఒకమాట యివ్వాలి. నన్ను ఏవిధంగా యింతకాలము చూచుకొన్నావో అలాగే మావారిని, అమ్మాయిని కూడ చూచుకో. సుబ్బులును శేఖరుకు ఇచ్చి చేసుకొంటానని మాట ఇవ్వగలవా అన్నయ్యా' అని అతి హీనస్వరంతో అడిగింది.

ప్రకాశరావుకు అంతులేని దుఃఖం పొంగిపొర్లింది. "అలాగేనమ్మా, సుబ్బులును శేఖరుకు యిచ్చి తప్పకుండా చేసుకొంటాను. ఇది సత్యము' అంటూ ఆమెచేతిలో చేయివేసి ప్రమాణము చేశాడు ప్రకాశరావు. ఆ మాటలు విన్న కొన్ని క్షణాల తర్వాత ఆమె ఆత్మ వారినుంచి తప్పుకుంది. కన్నీళ్ళతో ఆమెను ముంచివేశారు రఘుపతి, ప్రకాశరావులు. భార్యపోయిన తరువాత రఘుపతి తన కూతురును తీసుకొని సింగపూరు వెళ్ళిపోయాడు. ఆ తరువాత ప్రకాశరావు రఘుపతిని రమ్మని ఎన్నిసార్లు కబుర్లు పంపినా రఘుపతి మద్రాసు రాలేదు. శేఖర్ కు యీ గాథ అంతా తెలుసు.

తన మేనమామ కూతురు పెద్దదౌతోందనీ, దానిని తనకిచ్చి పెండ్లి చేస్తానని శేఖర్ తండ్రి చెప్పటము అనేకసార్లు తను విన్నాడు శేఖర్ బి. యే. ప్యాసు అయేవరకు వివాహ విషయము సరదాగా మాట్లాడుకొన్నట్లు జరిగిపోయింది. ఆ సమయంలోనే యౌవనంతో ఒళ్ళెరగక సుబ్బులుకు ఒక 'ప్రేమలేఖ' రాశాడు. శేఖర్ బి. యే. ప్యాసు అవటముతోనే అంతవరకు వేడుకగా మాట్లాడుకొన్న విషయాలన్నీ నిజరూపం దాల్చాయి. ఆ సమయంలో సుబ్బులు సింగపూరులో ఒక ఇంగ్లీషు మిషను స్కూల్లో స్కూలుఫైనలు చదువుతోంది. సుబ్బులు కూడా శేఖరుకు జవాబు రాద్దామనుకొంది. కాని తనువుంటున్న హాస్టలు అధికారిణికి భయపడి జవాబు వ్రాయలేదు.

శేఖర్ బి. య్యే చదువుతుండగా 'వనజ' అనే అమ్మాయికూడా అతని క్లాసులో వుండేది. ఆమె ఒక బార్-ఎట్-లా కూతురు. నవనాగరిక సౌందర్య శిఖామణి. ఆమె టెన్నిస్‌లో చాలా అందెవేసిన చెయ్యి. శేఖర్ కూడా టెన్నిస్‌లో చాలా పెద్ద ఆటగాడు. కాలేజీ క్లబ్బులో యిద్దరుకూడా మెంబర్లు. ఒకసారి అఖిలభారత టెన్నిస్ పందాలలో పోటీచేసి, వనజా శేఖర్లు చాలా అద్భుతంగా ఆడి గెలిచారు. చూసిన వారంతా వేయి విధాలుగా పొగిడారు వారిద్దర్నీ. పత్రికలన్నీ వారి ఆటగురించి, వారిగురించి చాలా గొప్పగా వ్రాశాయి. అప్పటినుంచి శేఖర్ వనజకు యింకా కొంచెము దగ్గరయి తనవలను విసిరాడు ఆచేపను పట్టటానికి! తనతో యిదివరకు కన్న ఎక్కువగా చనువుగా ప్రవర్తిస్తున్న వనజను చూసి, తనను మనస్ఫూర్తిగా ప్రేమిస్తోందని ఊహాలోకంలో ఊగిసలాడుతూ గాలిమేడలు నిర్మించాడు మిస్టర్ శేఖర్. ఇదివరలో ఆమెతో ఎక్కడపడితే అక్కడ మాట్లాడేందుకు బెదిరేవాడు. కాని ఇప్పుడు కాలేజీలో, రోడ్డుమీద, హోటలులో,

క్లబ్బులో—ఎక్కడకెళితే అక్కడ నిర్భయంగా మాటాడుతూండటమువలన 'మాసిన దిలా ప్రేమించు' అనే సామెతను జ్ఞాపకం చేస్తున్నాడు యితరులకు. పరిస్థితులు యీ విధంగా వుండటమువలన 'వనజ మితిమీరిన చనువును శేఖరుకు యివ్వటమువల్ల శేఖర్ వనజను ప్రేమించటము తప్పా?' అన్నారు మరికొందరు.

తను వనజను ప్రేమిస్తున్నాడు. కాని యీ విషయాన్ని ఆమెకు తెలియపరచ లేకుండా వున్నాడు. వనజ తనవిషయంలో ప్రవర్తిస్తున్నట్లు యింకెవరి విషయంలోను ప్రవర్తించకపోవటమువలన, వనజ కూడా తనను ప్రేమిస్తోందని, తను కూడా తన ప్రేమను ఏవిధంగా తెలియపర్చాలో తెలియాక తికమకపడుతోందని అపోహపడ్డాడు మిస్టర్ శేఖర్.

సుబ్బులు విషయంలో జరిగిన సంభాషణ తర్వాత, శేఖర్ తప్పకుండా సుబ్బులును చేసికొంటాడని ఆశించారు శేఖర్ తల్లి తండ్రులు. కాని ఆమర్నాడు ప్రొద్దున్న శేఖర్ తన తండ్రికి "సుబ్బులును తను వివాహము చేసుకోవటము అసంభవ"మని ఒక కాగితము వ్రాసి తన బల్లమీద పెట్టి ఎక్కడికో వెళ్ళిపోయాడు. తండ్రికి చెప్పలేని కోపము వచ్చింది. తల్లి మూర్ఛపోయింది. రఘుపతి శేఖర్ తల్లితండ్రులతో మాట్లాడి సుబ్బులును రాజారావుకు యిచ్చి చేసేందుకు వారి అంగీకారము తీసుకొని సింగపూరు వెళ్ళిపోయాడు

ఇల్లు విడచి వెళ్ళిపోయిన శేఖర్ ఒక స్నేహితునితో ఉంటూవచ్చాడు అదే వూరిలో. తనను ప్రేమిస్తున్నట్లు, తననే వివాహము చేసుకోవాలని తీర్మానించుకొన్నట్లు వనజతో చెప్పాలని తహతహలాడిపోతున్నాడు శేఖర్. కాని అందుకు తగిన సమయం సందర్భం కలిసి రావటములేదు.

3

హేమావతి అనే ఒక లక్షాధిపతికూతురు సిటీక్లబ్బులో చేరింది. ఆమెనుగురించి అందరూ పరిపరివిధాలుగా మాట్లాడుకొంటున్నారు. "భూలోకసుందరి" అని ఒకరు, "అప్సరస" అని మరొకరు "గానమోహిని" అని యింకొకరు-యీ విధంగా ప్రశంసించటము మొదలుపెటారు. ఒకరోజున ఆ క్లబ్బులో ఆమె కోసము ప్రత్యేకంగా ఒక టీ పార్టీ ఏర్పాటు చేయబడింది. ఆ రోజున మంచి ఆటగాళ్ళంతా టెన్నిస్ ఆడేందుకు కూడా ఏర్పాటు చేయబడింది. అఖిల భారత టెన్నిస్ పందెములలో గెలుపొందిన వనజా శేఖరులకుకూడా ఆహ్వానాలు పంపబడ్డాయి. టీ పార్టీ కొద్దిసేపట్లో ఆరంభమవుతుందనగా హేమావతి ఒక అందమైన కొత్త కారులో వచ్చింది. అంతకుముందుగానే వనజా, శేఖరులు అక్కడకు చేరుకొన్నారు. హేమావతి క్లబ్బు సెక్రటరీతోకలసి అతివయ్యారంగా నడుస్తూవచ్చిన అతిథు లందరికీ తన అభివందనాలు తెలిపింది. ముఖ్యంగా చెప్పుకోదగిన వారు వనజా శేఖర్లు. వారి పేర్లు విన్నవెంటనే "ఓ! అఖిల భారత టెన్నిస్ పందెములలో విజయఢంకా మ్రోగించిన ఘటికులు," అంటూ వారికి ప్రత్యేకాభివందనములు తెలిపింది హేమావతి. ఆమె మాటలతో పరవశుడయ్యాడు శేఖర్ :

టీ పార్టీ తర్వాత టెన్నిస్ పందెములు ఆరంభించారు. వనజా శేఖర్లు అతిచాతుర్యంగాను, అద్భుతంగాను ఆడి అవతలివాళ్ళకు "నిల్ గేమ్" చేశారు. కరతాళధ్వనులు ఆకాశాన్నంటాయి. టెన్నిస్ పందెములు పూర్తి అవటముతోనే, తన బంధుమిత్రులతో కలసి వనజ వెళ్లిపోయింది.

శేఖర్ బయులుదేరటానికి కాళ్ళు కదలటములేదు. హేమావతి తన చూపులతో—కాదు తన సమ్మోహనాస్త్రములతో తనని కదలకుండా కట్టేసింది. హేమావతే మాట్లాడించింది.

"నాకు టెన్నిస్ ఆటంటే చాలా యిష్టము. మీ ఆట చాలా గొప్ప స్టైలు".

"మీరు టెన్నిస్ కూడా ఆడతారా?" అన్నాడు శేఖర్.

"ఏదో కొంచెము. కాని మీ ఆటలాగ-అటువంటి స్టైలు ఎల్లా వస్తుంది"

"ఎందుకురాదు. నాకంటేమీరు బాగా ఆడవచ్చు. సరిగా నేర్చుకొంటే రాకుండా పోతుందా?"

"మీలాంటి ఆటను నేను ఎక్కడా చూడలేదు. నాకు నేర్పుతారా!"

ఏదో కలలో మాట్లాడుతున్నట్లనిపించింది శేఖర్‌కు.

"దానికేమంత భాగ్యము? ప్రొద్దున్న ప్పుడు జనం యిక్కడ అంతేమంది వుండరు. మీరు పొద్దున్నప్పుడు రాగలిగితే నేర్పటానికి నాకేమి అభ్యంతరము లేదు."


"పొద్దున్నప్పుడు రావటానికి నాకేమి అభ్యంతరము లేదు. తప్పకుండా వస్తాను. శెలవు," అంటూ వెళ్ళిపోయింది హేమావతి.

మర్నాడు పొద్దున్న ఆరుగంటలకు అతి విలువైన టెన్నిస్ డ్రెస్‌తో క్లబ్బుకు వచ్చాడు శేఖర్. చెప్పినటుగానే హేమావతికూడ వచ్చింది. రెండు సెట్లు ఆడారు. హేమావతి ఆట చాలా సాధారణమయినది.

ప్రతిరోజూ హేమావతి పొద్దున్నే క్లబ్బుకు రావటము, శేఖరూ తనూకలసి కొంచెము సేపు ఆడి వెళ్ళటము—యీ విధంగా ఓ పదిహేనురోజులు కాలప్రవాహంలో దొర్లిపోయాయి. హేమావతి చనువును ఆధారంగా తీసుకొని ఆమె బంగళాకు కూడా దారితీశాడు శేఖర్.

ఒక రోజున హేమావతి శేఖర్లుమామూలుగానే మాట్లాడుకొంటున్నారు మేడమీద. ఆ సమయంలోనే తమాషాగాను, కొంటెగాను "మీకు పెళ్ళయిందా?"అంది హేమా

(47-వ పేజీ చూడండి]



23

రోజురోజూ పుల్లయ్య చిక్కిపోతున్నాడు. ఎన్నడూ తనకుఅంటని విచారం నీడలా తన వెంటనే వుంటోంది. ఊర్లో పనిపాట్లు లేవు. కష్టపడి కర్రలు అమ్ముతున్నా జరుగుబాటు కావటంలేదు. తనతోపాటు పిల్లలిద్దరూ చిక్కిపోతున్నారు. ముందుకేం గతి అన్న ఆలోచన తననింకా పీడిస్తోంది.

నీలి మాత్రం మనసులో యెప్పుడైనా తప్పిజారి యిలాంటి ఆలోచన వచ్చినా వెంటనే సర్దుకుంటోంది. ఒకక్షణం వూరక పోకుండా రాట్నం త్రిప్పటం, ఇంటి పనులు చేసుకోవటం సాగిస్తోంది.

సమయానికి వూర్లో అప్పు పుట్టకుండా వుంది. ఇదివరకు వీళ్ళ దగ్గర అప్పుతీసికెళ్లిన వాళ్ళుకూడా "తీర్చడానికి యేం వుందని అప్పియిస్తామని" పైకి అనకపోయినా, లోన అనుకొని లేదంటున్నారు. కోమటి పేరయ్యను ఒక పూట రెండడ్డలు బియ్యం అరువీయమంటే ఇంటినుంచి బయటకు గబగబ వచ్చి "ఇంట్లో వుండి లేదంటే మాలాడిని" అన్నాడు. ఈఅంతరార్థం గ్రహించిన పుల్లయ్య చప్పున ఒళ్ళు మండి "నివ్వు లంక మాలాడివే"అన్నాడు. దానికి పేరయ్యవూర్లో నలుగురి పెద్దలతో చెప్పి నానాహంగామా చేసాడు. ముఖ్యంగా మల్లు చిక్కిపోతుండటం చూడలేక పోతున్నాడు. ఒక్కొపూట తిండిదగ్గర మల్లు అల్లరచూసి అయ్యో! వాకొడుకు యేపుగా యెదిగేటప్పటికే ఇలా వచ్చింది కదా! అని మనసు పరిపరి విధాల పోయేది.

ఊర్లో తనకు ఇదివరకున్న గౌరవంలో, నూరోవంతైనా లేదు. వయసులో చిన్నవాడైనా యిదివరకు తను యే సంబరాలైనా గరిడీలైనా తనే నడిపించాలి. తనకు యిదివరకు మిగిలిన ధాన్యం అంతా యిలా ఊర్లో వినోదాలకు సంబరాల కింద ఖర్చుపెట్టడం వలన పెళ్ళికి అప్పు చెయ్య వలసి వచ్చింది. తను యిప్పుడు ఒక కూలివాడు. నలుగురి వ్యవసాయపు పనులు వాళ్ళు చెప్పినట్లు చేసి సాయంత్రం బుట్టపట్టుకొని కూలి ధాన్యం కొలిపించుకోడానికి వెళ్ళాలి! తనే యీ పరిస్థితికొస్తే తన కొడుకూ కూలివాడే అవుతాడు గానీ వూరికి ఘనం తెచ్చే పెద్ద యెలా ఔతాడు? ఈ తలపులన్నీ కలిసి తనను రాత్రులు కూడా బాధపెట్టేవి. ఏం చేస్తే తన కొడుకు యేపుగా పసందుగా పెరుగుతాడు? దొంగతనం చెయ్యగలడు–కానీ ఆ డబ్బు యెంతకాలం? ఆకలితో చచ్చిపోతాడుగాని అలాంటి పాడుపని చేయనని భీష్మించుకున్నాడు.

అప్పుడప్పుడూ మనసు చిరాకుతో కుమిలిపోయేది. నలుగురు పెద్దలనీ దుయ్యబట్టేవాడు. తన పొలంమీద యింకేం రాదన్న రాజిగాడి మీదకు వురకపోయాడు. చిన్నవాళ్ళు సహాయం చేయలేరు. పెద్దవాళ్ళు ఈ కేకలవల్ల సహాయం చెయ్యకపోవటమే కాకుండా యెలా విడిచేత చిప్ప పెడ్దామని చూస్తున్నారు.

ఒకనాడు పీస యింటి దగ్గర వాదోపవాదాలయ్యాయి. గుడ్డి వెంకన్న "ఊరంతా పోగయితే గానీ రోజులు మారవ"న్నాడు. నాలుగు ఖూనీలైతే గానీ పేదోళ్ళ కడుపులు నిండవన్నాడు. దానికి పుల్లయ్య కాదన లేదు.

పీస నవ్వుతూ "ఎవడో వచ్చి మన పిల్లా జెల్లని యెత్తుకొని పోలేదు. మనం తిలాంచడానికి, ఊర్లో పదుగురికీ ఆశ ఆకాశానికి అంటించాలని తాపత్రయం! నాయనా ఆకాశానికి అంటుతుందా? ఆశ దబ్బున ఒక్కసారి కూలిపోయి ముక్కలు చెక్కలై పోదా? ఓర్పండి నాయినా ఓర్పండి— ఓరిస్తే కోడిగుడు, పీక మాంసం పట్ట వుండదా? ఓరిస్తేనే మనిషి! అలాగ ఓరుపుమీద వచ్చిన ఫలసాయం సాలాకాలం వుంటాది."

ఇదేమీ నచ్చలేదిద్దరికీ. ఊరు బాగుపడా

ఆలశ్యాలంతో సగానికి సగం ధరలు తగించాలి. మంచి మాటలతో చేస్తారా? చెయ్యరని వీరివాదన.

వెంకన్న ఇంటింటికీ వెళ్ళి చెపుంటే "అలవాటికి గంజి పొయ్యమని యొల్లకపోతే నీకు జరగదు. కళ్ళు లేవు నీకెందుకురా ఒకమూల పడుండక" అని సమాధానాలు వసున్నాయ్. వెంకన్న లోలోన "గొడ్డెలు! వీళ్ళల్లో వుడుకురక్తం లేదు" అనుకున్నాడు.

పుల్లయ్య యింటికి వెళ్ళాడు ఆ పూట పొయిలో అగి వేయలేదు. అది తెలుసుకొని కొడుకుయెదట రాజిగాడిమీద, గ్రామపెద్దల మీద విరుచుకపడుతుంటే ముసలమ్మ అందుకుంది. "ఎందుకునాయనా నోరు జారేసుకుంటావు? కొడుకు యెదరగా యిలా అని ఆ చిన్ని మనసును పాడుచేయక అలకి నీకు తెలిసినంత తెలీదుగావాల- తెలిసే లేనోలకి సెయ్యిదులిపేవోరు. అయ్యో! నా అన్నలూ తిమ్ములూ ఏం తీసుకపోతామనే మాటలేదే అని వాళ్లిమీద కనికారం చూపించు. నీ కడుపులో బుక్కెడుగంజి లేకపోయినా నిండినంత సుకంగా వుంటాది."

పుల్లయ్య చిరుమన్నాడు. "ఒకమూల కూర్చోక నీకిదంతా యెందుకే!" అన్నాడు.

ముసలమ్మ శాంతంగా "నాయనా! మనసు వెఱ్ఱియిపోకూడదురా. మనసు వెఱ్ఱియిపోతే మనిషి లేడు. జరగవలసింది ఆ పేదానికి నివ్వేవడవు? ఒకరు ఈ సెణం సేసిందాని, మంచీ సెడ్డా మరికొన్ని సెణాలకి కనిపించిపోతాది. అలాంటప్పుడు యిలా నివ్వు అయిపోతే పాసెయ్యిందెవరు? మనిషికి అభిమానంకన్నా దొడ్డదింకేమీ లేదురా"

పుల్లయ్య యీ మాటలు వినిపించుకోనే లేదు. కడుపు ఒకమూల మండిపోవటం మూలాన "నీకేం? ఆ పూటకి గంజో గడుగో మా కడుపులు మాడ్చయినా పోస్తోందికదా యెన్నిమాటలైనా అంటావులే! నా పీకకి యిదొకటి సుటుకున్నాది" అంటూ బయటకు వెళ్ళిపోయాడు.

నిల్చున్న నీలి నిశ్చేష్టురాలైంది. ఏదో ప్రళయం వుందనుకుంది. ముసలమ్మవేపు చూసేసరికి ఆమె బోసిపళ్ళనవ్వు మెల్లమెల్లగా వలగబోస్తోంది. కానీ నీలికి తెలుసు ఆ ముసలిగుండెకెంత నూటిగా ఆ మాటలు తగిలాయో? నిజానికి రెండు నెలలుపైగా సరిగా భోజనమే లేదు. రెండేసి రోజులకి జ్వరం వస్తుంటే పచ్చి మంచినీళ్ళయినా నోటిలో పోయటంలేదు. అలాంటప్పుడు భర్త అన్న మాటల్లో యెంత అబద్ధంవుందో ఆమెకు తెలుసు. ఆమె ఆ ముదుసలిని మొగుడుబదులుగా క్షమాపణ వేడుకోవాలని దగ్గరగావచ్చి ప్రక్కన కూర్చుంది. మెల్లగా అతిమెల్లగా దీనంగా భయంగా మామ్మతో "ఎందుకో కోపంతో అనేసాడు...మనసులో పెట్టుకోక మామ్మా!" అంది.

మామ్మ మెల్లగా తలత్రిప్పేసరికి నునుమరాలు కళ్ళల్లో నీరు గిర్రునతిరిగినాయ్. ఆ నీరుచూసి మామ్మకళ్లు తడిసిపోయాయి. మనుమరాలి తల నిమురుతూ మెల్లమెల్లగా ఆగి ఆగి మాటలు జారవిడుస్తోంది. నాలుగిరవైల జీవితంసారం అంతా ఆ గుండెనుంచి వెళ్ళగక్కుతున్నట్టుంది. "అమ్మా!...నాకు యెనుబోలమీద సెడ్డగా సెప్పుకోడానికి... సాలా వుండేది. మీ తాతమీదన్నీ-అయినా ఆ సెడ్డోలందరిమీదా మంచే సెప్పుకున్నాను-నాలికనుంచి కాదమ్మా గుండెనుంచే! అలాగ సెప్పుకొని కష్టపడ్డానని పైవోళ్ళు అనుకోనీ-కానీ తల్లీ! అలాగ అనుకోవడం సెప్పుకోవడంవల నాకిప్పుడున్నంత సంతోషం సుఖం యెవరికున్నాదే? లోకం అంతా కోడైకూసాది నాయంతకష్టం యెవరూ పడనేదని-కానీ నాఅంత సుఖమైన ఆడది లోకాన వున్నదా? మట్టికుండనుంచి యీ చర్మంకుండలో పడేసుకొని యిన్నాళ్లు బతికాను! ఇంకా కుండ పగిలిపోక యెంతకాలం వుండిపోతాది?" నీలికి ప్రతీమాటా హృదయానికి హత్తుకుంది. ఏ మాటా ఆడకండా ముసలమ్మను గట్టిగా హత్తుకొని ఆమె ఒడిలోనికి జారి ముఖం దాచుకుంది.

కొంతసేపయ్యాక, పుల్లయ్య చోడిపిండి పట్టుకొని వచ్చాడు. నీలి వంటప్రయత్నంలో వుంది. పుల్లయ్యనిచూసి ముసలమ్మ నవ్వుతూ "నాయనా" అని పలుకరించి అన్నది "నివ్వెంత మంచోడివికాకపోతే నా మనవరాల్ని అన్ని ఖర్చులూ పెట్టుకొని పెళ్ళాడినావు. నన్నూ సేరదీసి పెంచినావు. పచ్చి మనవరాలికడుపులో మొగాడై పుట్టుకకివచ్చి నీఋణం తీర్చుకోనా?" పుల్లయ్యకు సిగువేసి గదిబయటకు వచ్చేసాడు.

చీకటిపడ్డాక కర్రలు అమ్మి పుల్లయ్య అప్పుడేవచ్చాడు. పిసమంచిచెడ్డా మాటాడుతున్నాడు. ఇంట్లోవున్న హీనమైన పరిస్థితులు చెప్పుకొచ్చాడేగానీ బుక్కెడు గంజి పొయ్యమ్మాఅని నాలిక చివరకు వచ్చినా అడగలేకపోయాడు. వీళ్ళయింటిలో పరిస్థితీ అంత బాగుండలేదని తెలుసు. వెళ్ళిపోయే ముందు "అయ్యో పుల్లిగా ఒక రేతిరిమీద నా యిల్లు తగలబడిపోయినా బాగున్ను! అక్కడే భూదేవి గజగజలాడి బద్దలయినా యింటంతా అలోమని ఒక్కసారి పచ్చిపోదును!"

ఈమాటలు నీలి విన్నది. వెళిపోతున్న వాడ్ని పిలిచి "ఈ పావలాసోళ్ళుకొని అంబలైనా యీరాతిరికి తాగండయ్యా" అనియిస్తుంటే పుల్లయ్య కొఱకొఱా చూస్తున్నాడు. ముఖం చేటంతచేసుకుని పిసపరుగున వెళ్లిపోయాడు. నీలి పిస వెళ్లాక "నాను సెప్పాను-యిటికిల వున్నంకి యిద్దరిపిల్లలనీ రెండిళ్లలో కంచారితనానికి పెటమని. కడుపు మాడుతుంటే యింటిరాగటానూ స్తే యెలాగ? కషపడకండా ఆలూరక నే యిస్తారా! ముందుకు పిల్లలుండగా సుఖపడదా?"

★ దగా పడిన తమ్ముడు ★

భార్యమాటల్లో అభిమానం పుటిపడగా పుల్లయ్య మాటాడలేదు. మిగిలిన డబ్బుతో పేరయ్యకొట్టుకి నీలి వెళ్ళింది. ఆ మరుచటి రోజు వుదయమే ముసలమ్మ లేచి దేముడి మీదకీర్తనలు "రామ రాఘవా-రక్షించుము దేవా...రామరాఘవా!" అని పాడుతుంటోంది. మనుమడు దగరకూర్చొని వెనకపాట పాడుతున్నాడు. మూడురోజులు పోయాక ఒకనాడు పొద్దుమీదికి లేవకముందే నడ్డి వంచుకొని యింటియింటికి వెళ్ళింది-నలుగురి దగ్గర శెలవు తీసుకుంటోంది. మళ్ళీ మిమ్మలినందరినీ నా మనవరాలి కడుపులో పుటి చూడనా అని చెప్పింది. రాజిగాడి యింటికివెళ్ళి కూర్చుంటే మొగుడూ పెళ్లాం చాలా అభిమానంగా చూసారు. రాజిగాడు అన్నాడు "చూడే మామ్మా! పుల్లిగాడు మాటాడితే నామీద ఇరుసుకపడ్డాడు. నాఅయ్య ఆ కుడ్డోడుట-నాకు కురువుమర్యాద లేదట! నేనేం ఆడికి అపకారంచేసాను. ఆడికి కొదులో పెట్టితే ఆదుకోలేనా! ఆడికి కడుపు మాడతంటే బియ్యం కొలలేదా? నాకైనా యేంవుంది! ఈ నలుగురిపిల్లలకి వంతులేస్తే ఒక్కొక్కడికీ యేం వస్తాది? అపాలం మైనరుకొడుకున్నాడని యెవురూ చూడకపోతే నానే తెగించి రాసుకున్నానా? మంచిగా వచ్చి అడిగితే రావలసినదేదో యిచ్చీనా?"

ముసలమ్మ "నాయనా ఎవరు మంచీచెడ్డా ఆలదగ్గిరే వుంటాదిరా! ఒకడి కడుపు మనం కొట్టిసేస్తే మన కడుపాకడు కొట్టిసేస్తాడు మనం యీ సంసారంలో కుడితికుండలో పడ్డ యెలకలా కొట్టుకుంటాం! పెమిదలో వత్తికి సరిపడ్డనూనె పోయాలా? ఆనూనె డబ్బు కొదురా-అభిమానంరా! నాకంటికి నివ్వూ పుల్లయ్యా యిద్దరూ ఒకటే ఇద్దరూ మంచోళే."

వెళ్లిపోయేటప్పుడు అంత దూరం సాగనంపగా ముసలమ్మ "నాయనా యింకెన్నాళ్ళుండిపోతాను? నివ్వు ఒకకొమ్మ పట్టవా?" అంటే రాజిగాడు ముసలమ్మ భుజం మీద చెయ్యివేసి "అంతా నాదే నే మామ్మా" అన్నాడు. బోసిపలునవ్వు వొలగబడింది.

ఆమరుచటిరోజు నీలమ్మ గుడి బయట ద్వారంమీద తల ఆన్చి మొక్కింది. నదివేపు వంతెనవేపు, కంటికి కనబడ్డ ఆవూర్లోవున్న అన్నిటివేపు చూసింది. ఇంటిదగ్గర వసారాలో కూర్చొని వీధిలో వెళ్ళుతున్న అందరిని పిలిచేది. చెప్పవలసిన నాలుగు మంచి మాటలు చెప్పేది చిన్నా పెద్దలనీ తాకి దీవించేది-ముద్దులాడేది. అభిమానం కట్టలు తెంచుకుని యిలా వారంరోజులు గడిచింది. రాత్రుళ్ళు చాలసేపటివరకూ, వేకువజామున లేచి వచ్చిన భక్తికీర్తనలు పాడుకొనేది. "నానుపుటిన్నాడూ వున్నావు-పెరిగిన్నాడూ వున్నావు-సచ్చిన్నాడువుంటావు లోకంలో మనిషెపుట్టి నే చెయవలసినపని నివు చెప్పినట్లు చేసాను తండ్రీ" అని సూర్యదేముడ్ని మొక్కింది!

ఆ వేళ ఆకాసంఅంతా మబ్బులుకమ్మాయి! సాయంత్రం వరకూ అప్పుడప్పుడు చినుకులు పడుతున్నాయ్. ఆరాత్రి దూరాన్న మెరుపులు అగుపించాయి. ముసలమ్మ జ్వరంతో ఒకమూల మూలుగుతూ పడుకున్నదల్లా చప్పున నడిరాత్రప్పుడు లేచింది. అంతా నిశ్శబ్దంగావుంది. అంతా పడుకొని వున్నారు. లేచి తలుపుతీసి బయటకు వచ్చింది. దూరాన ఆకాశాన చుక్కలు మెరుస్తున్నయ్. అక్కడక్కడా చిన్న మబ్బుతునకలు యిటూ అటూ కదులుతున్నయ్. ఆ చుక్కలు చూడగలిగేదృష్టి ఆమెకుంది. ఆ నిశ్శబ్దంలో...ఒంటిగా... వీధిగోడకు చారపడి కాళ్ళు చాపింది... ఆ కొద్దినిముషాల్లోనే మాగన్ను నిద్దరపట్టినట్లయింది...ఏవోకలలు...ఎవరో పెద్దలంతా అగుపిస్తున్నారు...ఎవరో వచ్చి వెళ్ళిపోతున్నారు ... ఆమె మొగుడు... పోయిన సంతానాలు...వీళ్లూ వాళ్ళూ... తననూ పిలుస్తున్నారు ... ఏవేవో పూలరథాలు.. గుర్రాలూ...ఆకాసంమీద అగుపిస్తున్నాయ్.. ఇవన్నీ తనకోసమే... అన్నట్లు వాళ్ళు చూపి పిలుస్తున్నారు...

మళీ తెలివివచ్చింది...తెలివి వచ్చేసరికి దీపం...ఆ వెలుగులో నలుగురూ గుమిగూడి వున్నారు...మనుమరాలు యేడుస్తోంది... మునిమనుమడు మలు గోలపెట్టున్నాడు— మామ్మ అనిపిలుస్తూ 'కయ్'మంటున్నాడు. కళ్ళు తెరవగానే మనుమరాలు మరీదగరగా వచ్చి తలపట్టుకుంది. ఆముఖం యింకా నలబడి పోలేదని ఆ బోసినోటి నవ్వే చెపొంది. "అమ్మా... తల్లీ... నా నీలమ్మ..." ఒకసారి మనుమరాలి తల నిమిరింది. ఆ శుష్కించిన చేయి అభిమానంతో నిండిపోయి మనుమరాలిఒళ్ళంతా తాకుతూ, ఆ మూసుకపోతున్న కళ్ళల్లో చివరికి మిగిలిననీరు ఆనందబాష్పాలై రాలసాగాయ్. "నా అమ్మా!" "ఆగి మెల్లగా... అతి మెల్లగా...ఆగి మరీఆగి..."సెయ్యి కాలితే..,కుండరయితేస్తాడు...ఓర్పనేడమ్మా...పుల్లయ్య! ఆకుండ...పడిపోకుండా...కాయితల్లీ!...ఇంకేం యిసాను?" ఈ మాటలు చెపూచెపూనే చివరిసారి కళ్ళు తేరి మనుమరాలివేపు, పులయ్య, మల్లువేపు చుటూచేరిన నలుగురివేపు చూసింది. అందులో రాజిగాడు వున్నాడు. చిన్ననవ్వుతో అలా చూస్తూ చూస్తూనే దేహాన్ని చాలించింది.

24

వరిచేలు పోరం పట్టున్నాయ్. మబ్బులు క్రమ్మి అప్పుడప్పుడూ వర్షాలు కురుస్తున్నాయ్. చలికాలం యింకా ప్రవేశించలేదుగానీ, వుండీ వుడిగీ కొద్దిగా రాత్రుళ్ళు చలివేస్తుంది

ఒకనాటి రాత్రి! నడిరేయి చీకటి దట్టంగా ఉంది. ఆకాసం మబ్బులతో నిండి


వుంది. సంజీవి ఇంటిపెరట ఒక్కసారి గోల వినపడింది. దొంగవాడి జుత్తు పట్టుకొని ఆ చీకటిలోనే సంజీవి నాలుగు తగిలించినా, దొంగ మాటాడకండా ముఖం క్రిందికి దించివేసాడు. పెళ్ళాం బుడ్డీదీపం వెలిగించబోతే గాలికి ఆరిపోయింది. చుటూ మనుష్యులు మూగిపోయారు. పుల్లయ్యమల్లు కూడా పరుగెత్తారు.

మూగినవాళ్ళలో వ్యాఖ్యానాలువిసుర్లూ వరసగా వస్తున్నయ్. ఎవడో ఆ దొంగ యెవడు—తన్నండి అని మనిషో చెయ్యి వేసారు. "మొన్న కట్టెలో పెసలు వీడిపనే!"—"మా కోడిపెటలు వీడిపనే—!" "దొంగయెధవా! జరగకపోతే ముష్టి యెత్తుకోకూడదూ?"—అంటున్నారు.

ఈ వ్యాఖ్యానాలు ఆడవాళ్ళ నోటి వెంబడికూడా వస్తున్నయ్. ఆ దొంగ మూడు రోజులబట్టి ఆకలితో అటమటించి పోతున్నాడు. తనేకాదు భార్యాపిల్లలుకూడా! ఇవన్నీ చూడలేక భరించలేక ఆకలి పిచ్చితో అర్థరాత్రిమీద దొంగతనానికి బయలుదేరాడు! సంజీవి పెరటి వంటయింటిలో దూరటం సులభం! చద్దిఅన్నం కుండలో గంజిత్రాగి కుండ యింటికి మోసుకవెళ్తే పిల్లలు మరి రెండు పూటలైనా యీ భూమిమీద బ్రతుకుతారు!

కాని దొంగ దొరికిపోయాడు! ఇన్ని మాటలు ఈ దెబ్బలూ తనకు తగల్లేదు. అంతా కలలావుంది. హోరంలేని నరాలు చుట్టుకపోతున్నాయ్. అలా కూలబడిపోయాడు. కూలబడిపోతూ "ఆకలి ఆకలి." అని ఆయాసంతో అన్నాడు. సంజీవి దొంగ ఆకలి తీర్చడానికి మరి రెండు తగిలిస్తూ "వేసాలు వేసాలు—ఇలా కూలబడితే వదిలేస్తామనుకున్నావురా దొంగనాయాలా" అంటూ రెట్టించి కాళ్ళతో తన్నాడు. దొంగ "అమ్మో" అని కెవ్వుమన్నాడు. పొరుగునే వున్న రాజిగాడి యింటినుంచి హరికేన్ లాంతరు వచ్చింది. ఆ వెలుగులో పీసముఖం చూసి ఓ క్షణం అంతా నిశ్శబ్దం అయిపోయింది. యుద్ధంలో బాణం దెబ్బతిని నేల కూలిన యోధునిలా వున్నాడు! నిజంగా యీ పోరాటంలో ఆకలి జయించి నిర్దాక్షిణ్యంగా యీ పీసని నలుగురిలో యిలా కూల్చివేసింది—అయినా ఆ ఆకలిమంటలు మండుక పోవుటచేత చెయ్యి సైగచేస్తూ ఆయాసంగా "ఆకలి...ఆకలమ్మో" అన్నాడు.

సంజీవి పెళ్ళాం గిన్నెలో అన్నంవేసి గంజిపోసి తెచ్చింది. ఉప్పు వెయ్యటం మరచిపోయింది తొందరలో. పీస గడగడ త్రాగివేసాడు. ఉన్న మెతుకులు నమిలాక "అమ్మయ్యా" అంటూ ఒక్క నిట్టూర్పు విడిచాడు. విడిచాక ఒక్కసారి తలెత్తి



ఇటీవల థియేటర్ సెంటర్, విజయవాడ వారు ఏర్పాటుచేసిన చారిత్రాత్మక నాటక పోటీలో "మహోగ్రదీయం" అనే వీరి నాటకానికి ప్రథమ బహుమతు పొందిన శ్రీ "కన్నస్వామి" గారు.

చుట్టూవున్న వాళ్ళవేపు చూసాడు. దగ్గరగా మల్లు కూర్చున్నాడు. పుల్లయ్య, సంజీవి, రాజిగాడు...ఊరంతా...! ఘొల్లుమని యేడవడానికి మొదలుపెట్టాడు. అక్కడ తను చేసినపని జ్ఞాపకంవచ్చి దొర్లి దొర్లి యేడవాలనిపించింది. ఇంతలో తుప్పలావున్న తల పెట్టుకొని మాసిన చింకి బట్టలతో గోల పెట్టుకుంటూ వచ్చిన పెళ్ళాం వేపు చూసాడు.

చూడగానే పిల్లలు జ్ఞాపకం వచ్చారు. తిన్నదంతా వాంతి చేసుకోవాలనిపించింది. ఇదంతా తనే చేసాడా అనే తలపుతో లేవబోయాడు. ఒంట్లోశక్తి కొద్దిగా కూడుకున్నా యీ తలపులు తనకు జాగిస్తున్నాయ్. పండు ముసలిదానికన్నా అధ్వానంగా తయారయ్యేడు. చుట్టూ చేరివున్న వాళ్ళవేపు చూసాడు. తనుదొంగ! దొంగను వదిలివేయడం మంచిపనికాదు! దొంగకు శిక్ష పడకపోతే న్యాయం గంగలో కలిసిపోతుందని అనుకున్నాడు.

"ఓరయ్యా సంజీవి!" అన్నాడు.

బాధతో కుమిలిపోతూ కళ్లంట నీరు కారుస్తూన్న పీసవేపు చూస్తున్నారు. కళ్లు తుడుచుకుంటూ "పంచాయితీ పెటించు! దొంగకు సిచ్చపడాలిరా!"

"ఎల్లిపోరా యేం సిచ్చ!" అన్నాడు సంజీవి.

"వద్దయ్యా! ఇప్పుడు సిచ్చపడకపోతే—యముడు ఇనపకౌకులసేత పొడిపిస్తాడు."

అక్కడవాళ్ళెవరూ ఒప్పుకోలేదు. దగ్గరగావున్న ఆవుకట్టు పీసవిప్పివేసి ఆకన్నె సంజీవి చేతికిచ్చాడు. ఆవుకట్టు దగరనుంచి కదలకండా యీమనిషివేపు చూస్తోంది. వీపు సంజీవివేపు త్రిప్పుతూ "అయ్యా! ఆకన్నెతో గట్టిగా నాలుగు వీపుమీద వేసి నాకువా!"

సంజీవి కన్నె ప్రక్కన పడవేయబోతుంటే "వేస్తావా లేదా" అని అరిచాడు... ఇక లాభంలేదని మెల్లగా రెండు వేసాడో లేదో మల్లు పరుగెత్తి సంజీవి కుడికాలు పట్టుకొని తొడదగర కరువగానే దద్దరిల్లాడు. పీస ఆకన్నెతీసుకొని తనంతతనే గట్టిగా కొట్టుకున్నాడు. వీపు, కడుపు తట్లుతేరిపోయాయి. అప్పుడు ఆకన్నెతో మళ్ళీ ఆవునుకట్టి దండంపెట్టి మెల్లగా యింటివేపు నడిచాడు.

తెల్లవారిపోయింది. పుల్లయ్యకు ఆరోజంతా మనసు మనసులా లేదు. కర్రలకు వెళ్దామంటే అక్కడా ఆశలేకపోయింది. ముందుగా డబ్బుచెల్లించి మొదళ్ళు తవ్వుకొమన్నాడు తోటకలవాడు. ఏమంటే ఎవడో డబ్బుయివ్వకండా మాయమయ్యాడు. నష్టం

(42-వ పేజీ చూడండి)


ముక్కు పచ్చ

జీవితం ముక్క

ఒక ...
ఆత్మ ...

~~~~~~~~~~~దామర్ల

భర్తృవియోగం స్త్రీకి ఎంత ద...
కార్పరాస్మిత్ వ్రాసిన వ్యాసాన్ని ప్రకట...
పచిత్ర వారపత్రిక పాఠకులు తమ...
వ్యాసాలు పంపారు. వాటిలో ఒకదాన్ని
కూడా క్రమంగా ప్రకటిస్తాము.



"సోదేయమ్మ సోది"

చిత్రకారుడు :—ఆర్. యస్. శర్మ (పెదబల్లె)


పదిహేడు సంవత్సరాల క్రితం నా భర్త మరణించాడు. అప్పుడు నా వయస్సు షుమారు పన్నెండు, పదమూడేళ్ళు వుంటాయనుకుంటా. ఆయన మృతకళేబరం మీద పడి నేను వింతగా విలవిలా తన్నుకుని యేడ్చానట. నాకా విషయం గుర్తులేదు. ఇప్పటికీ మా అమ్మ అప్పుడప్పుడు యెవరితో ఒకరితో అనడం వింటూంటే నాకేమిటోగా వుంటుంది. నా స్మృతి పథంలో లేని సంఘటనకు అంత విలువుంది కాబోలని యిప్పుడు నాకనిపిస్తూంటుంది. కాని నాకు ఒక సంఘటన యిప్పటికీ మరుపురానిదిగా నా హృదయంలో నాటుకుపోయింది.

నేను యేడ్చి యేడ్చి కన్నీటి సముద్రంలో మునిగి తేలుతుంటే మా అన్నయ్య పైనున్న కండువాలో ముఖం దాటుచేసుకుని భోరున ఏడవడం మరచిపోదామన్నా మరుపురాదు.

నా కారోజులు ఎలా గడిచాయో యేమిటో స్పష్టంగా చెప్పలేను. అప్పుడు నాకు ముమ్మరంగా విషజ్వరం కాసిందిట. రెండు నెలలు నాకు ప్రపంచంతోనే సంబంధం లేదట. మంచంలో వుండి 'అమ్మా! నా...!' అనే పలవరింతలుతప్ప మరోమాట అని యెరగనట. అన్నయ్యమాత్రం యేదో మందు అందిస్తూ జాలిగా నావైపు చూస్తూ వుండడం మాత్రం గుర్తుంది.

కొంతకాలం గడిచేసరికి నేనేమౌతానో అనుకున్న మా వాళ్ళందరూ ఎండిపోయిన చెట్టు చిగిర్చినట్లుగా సంతోషపడడం మొదలుపెట్టారు. కొంచెం కొంచెంగా తిరగ నారంభించానట.

ఓ రోజున నేను ఎందుకో తలవని తలంపుగా గదిలో కూర్చున్న దాన్నల్లా చెంగున



దొంగ సన్నాసి, ...
~~~~~~~~~~~

ారక మునుపే

చెక్కు లైపోయిన

అనాథ ఘోష

ఎన్నమ్మ

[...ర్భరమైనదో వివరిస్తూ అమెరికన్ మహిళ ...ంచినతర్వాత, గత మూడు వారాలలోనూ ...మ అభిప్రాయాలను వ్యక్తీకరిస్తూ అనేక ... ఇక్కడ ప్రచురిస్తున్నాము. మిగతా వాటిని ...
—సం.]



భారతవాణి
చిత్రకారుడు-ఏ. బాలకృష్ణ [పూళ్ళ]

బయటకు వచ్చేను. అన్నయ్య సిల్కు పొక్కా వేసుకున్నాడు. జరీపేట ఖద్దరు కండువా భుజాన వ్రేళ్ళాడుతుంది. చేతిలో సంచీవుంది. 'సరే వెళ్ళొస్తానా న్నా' అంటూ కాళ్ళకు జోళ్లు వేసుకోబోతు న్నాడు. నన్ను చూసీ చూడ్డంతోటే చెప్పులు విడిచి కండువా విసిరేసి చటుక్కున అరుగుమీద కూర్చున్నాడు. అప్పుడు అమ్మ 'నువ్వెందుకే అటొచ్చావు? యిట్రా!' అంటూ విసురుగా నా రెక్క పట్టుకుని లోపలికి లాక్కెళ్ళింది.

మానవ ధర్మాలు మారితే మారవచ్చుగాని ప్రకృతి ధర్మం మారదుగదా! నేను ఒక రోజు అన్నం, బెల్లం, నెయ్యిమాత్రమే తిన వలెనని ఆజ్ఞాపించారు. విడ్డూరాలలో యిదేమి విడ్డూరమో అనుకున్నాను. అప్పుడు నా చనిపోయిన భర్త తల్లి ఎంత మంది తాకవద్దని వారించినా వినకుండా నన్ను తన కౌగిల్లో బంధించి నా ముఖమంతా తన కన్నీటితో తడిపి వేసింది.

అప్పటి మాయిల్లు శోకసముద్రం లాగా నే వుందిగాని మరోవిధంగా లేదు. ఆ సంఘటనను తలుచుకుంటే ప్రాణం గాలిలో తేలిన ట్లనిపిస్తుంది.

కాలప్రవాహంలో ఒకటి రెండు సంవత్సరాలు గడిచిం తర్వాత మా అన్నయ్య నాకో వార్త చెప్పాడు. నాకు మళ్లీ పెళ్ళి జరిపిస్తానన్నదే ఆ వార్త. అప్పుడు నాకానందం కలిగిందో కలగలేదో చెప్పలేను గాని, మా అక్కయ్యమాత్రం 'నాకే గనక మళ్ళీ పెళ్లి జరిగిందంటే నేను భావిలోపడి చావడం ఖాయమేన'ని చేసిన శపథం, మా బంధువులు చేసిన చోద్యం చూస్తే నా మనస్సు మనస్సులో లేకుండా పోయింది.

'ఏమిటమ్మా విడ్డూరం మొగుడు చచ్చిందానికి మళ్ళీ పెళ్ళా!'

'ఎవరన్నా వింటే యేమనుకుంటారు? ఒక్కసారి మనవంశం యెటువంటిదో చూసుకోండి' అంటూ ఒకటే విస గుసలు.

అన్నయ్య ఒక్కడు యేం చెయ్యగలడు?



పారాబుడ్డి! —చిత్రకారుడు: ఏ. సూర్యారావు.

★ ఒక అనాథ ఆత్మ ఘోష ★

ఎంతో పోరాడాడు. పనేమిరా వల్ల కాద న్నారు. అప్పుడు 'నువ్వేమంటావమ్మాయి' అని నన్నడిగారు. నేనుమాత్రం యేంచెప్ప గలిగేది? 'నాకొద్దులే' అనేశాను. అందరూ సంతోషించారు, ఒక్క అన్నయ్యతప్ప.

చాలాకాలం తర్వాత నా చెల్లికి వివాహం చేశారు. చెల్లి అమ్మకు కడసారి కూతురవటంవల్ల, అప్పట్లో ఆర్థికంగా మా కుటుంబానికి యెంతో ఆదాయం వుండడంవల్ల వివాహం చాలా గొప్పగా జరిగింది. నేను దుఃఖపడతానో యేమోనని అన్నయ్య నన్ను యెప్పుడూ తన కనుసన్నలలోనే త్రిప్పుకుంటూ పెత్తనంలో తనంతటి భాగస్వామ్యం కూడా యిచ్చాడు. ఆ వివాహ వైభవమంతా అన్నయ్యతో నేనూ సరిసమానంగా పాలుపంచుకుని మరీ జరిపించాను. వివాహమైన తర్వాత ఓ రోజు ఉదయం పెరట్లో బాదంచెట్టు క్రింద చెల్లి పళ్లుతోముకుంటున్నది. అప్పుడు ఆమె నలిగిన చీర, చెదరిన జుత్తు, బరువుతో వాలిపోయే కనురెప్పలు చూసేసరికి దానిలో ఏదో ఒక కొత్త వింత కన్పించి నన్ను స్తబ్ధురాల్ని చేసింది. అప్పటికప్పుడే తెలీకుండా మూర్ఖురాలనయ్యాను. అన్నయ్య పడ్డ వేదన యింతా అంతా కాదు. అమ్మను నాన్నను యింకెవరి నెవరినో తిట్టిన తిట్లు యిన్నీ అన్నీ కావు. అప్పటినుంచి యిటువంటి సంఘటనలు సహజంగా జరుగుతూనే వుండేవి కాని రాను రాను చీకటి తెరలు తొలగినట్లు తొలగిపోయి అబాధకూడా ఉపశమనం కావడం సాధ్యమేనని తోచింది.

క్రమేణా నాకు ఒంటరి జీవితం అలవాటయి పోయింది. రంగురంగుల పూలను ముడుచుకోవాలనే వాంఛ అణగారింది. బంగారపు ఆభరణాలు పెట్టుకొని మురిసి పోవాలనే కోరిక నశించింది. ఏ బట్టకడితే ఎటువంటి అందంవస్తుందనేది నాకు తెలియని సంగతైపోయింది. నన్నంటుకొని యెప్పుడూ తెల్లనిచీర, తెల్లని జాకెట్టు మినహా మరో అందంనాకు తెలియదు. అవే నా ఆభరణాలు; అవే నా ఆనందాలు అయిపోయాయి.

మాయింట్లోకి కొత్తకొత్త పేపర్లు వింత వింత బట్టలు కాలప్రవాహంలో కలిసి వచ్చాయనుకుంటా. వాట్ని చూస్తుంటే ఓ కొత్త ప్రపంచం కళ్లముందు కనిపించి నట్లయింది. స్వతంత్రం వచ్చిందట. 'మనదే రాజ్యంట. ఇలా యిలా యెన్నో సంగతులు తెలుసుకోవలసి వచ్చింది.

ఓ రోజున మా అన్నయ్య 'మీటింగుకు నీవుకూడా వదినతో పోవమ్మా' అన్నాడు. నాకేమిటో అంతా అయోమయంగావుంది. ఆ మీటింగులో యేమిటేమిటో చెప్పారు. యెవరికి తోచినవిధంగా వారు వోటుచేసుకో వచ్చునట. స్త్రీకి పురుషునికి సమాన హక్కులేనట. కనుక ఆలోచించి ఎవరికి వారు నడుచుకోవాలని ఉద్బోధించారు.

నాకవన్నీ అర్థంకాలేదు. ఇలా అనేక పర్యాయాలు మీటింగులకు వెళ్ళడాన్ని. మా అన్నయ్య, అన్నయ్య మిత్రులు యేవేమిటో పుస్తకాలు యిచ్చేవారు. నా చిన్నతనంలో కొద్దిగా చదివివుండటం వల్ల అవన్నీ ఎలాగైతేనేం చదివావని అనే దాన్నే కాని, వాటిలో కొన్ని అర్థమయ్యేవి కావు; కొన్నిమాత్రమే అర్థమయ్యేవి.

కాలం గడిచినకొద్ది నేను బహిరంగంగా చదివే పుస్తకాలు కొన్నీ, అంతరంగికంగా చదువుకొనేవి కొన్నీ. అంతరంగికంగా చదివేపుస్తకాలవల్ల ఆత్మోద్రేకం కలిగి ఆచరణలో చాలాచాలా బాధలు పడాలనే అభిప్రాయం కలిగేది. చదువుకోవడం మాత్రం బాగా అలవాటైపోయింది.

ఒకరోజున ఒక ప్రాణస్నేహితురాలు "అక్కా యిదుగో యీ గులాబి చీర కట్టుకోవే బాగుంటావు" అంటూ బలవంతాన కట్టిపోయింది. అప్పుడు నావరకు నాకు యేమీ అనిపించలేదు కాని నా వెనకాలే యేవో గుసగుసలు మాత్రం కొంచెం స్పష్టంగానే వినిపించాయి. ఎప్పుడూ నా ముందు సంతోషంగా కనిపించే అన్నయ్యముఖం కూడా అదోలా వుండి పోయింది. అప్పుడు బ్రతుకుమీద నా విశ్వాసం కొంత సడలినట్లయింది. ఆరాత్రి నిద్రలేదు. అప్పట్లో పదిలంఖనాలు చేయక తప్పిందికాదు.

ఇటువంటి ప్రమాదాలు నా జీవితంలో అనేకం తెరమీద బొమ్మల్లా వచ్చి పోయాయి. జీవితపోరాటాన్ని అతిధైర్యంగానే యెదుర్కొ-గలిగాననే చెప్పవలసి వస్తుంది. కాని సమస్యలను సమస్యలుగా చూసుకుంటే అన్నీ అట్లాగే వుండిపోయాయనిపిస్తుంది.

స్త్రీకి వివాహమనేది ఒక గొప్పవరం.

ఆ వరం నిష్ప్రయోజనమైతే ఎంతటి హృదయవిదారకమో విజ్ఞులందరికి తెలిసిన విషయమే.

సంఘంలో కట్టుబాట్లు యెప్పుడూ యేదో రూపంలో వుండనే వున్నవనిపిస్తుంది. ఆకట్టుబాట్లను మానవజీవిత సౌఖ్యానికి ఉపయోగించుకున్నట్లయితే ఎంత బాగుండేది. కాని వచ్చిన చిక్కేమిటంటే ఆకట్టుబాట్లు స్త్రీ జీవితాలకు జీవితాలనే ధ్వంసం చేసే విలాగుంటే ఆబలిదానంలో ఎంత మంది ఆహుతి కావడం చూసి సహించగలదిలోకం?

మన హైందవ జాతిని మేల్కొల్పడానికి రాజరామమోహనరాయ్, వీరేశలింగం మొదలైనవారు ఎంతో కృషిచేశారు. వారి బోధలనే ఆదర్శంగా పెట్టుకుని పయనించే ప్రతి స్త్రీకి తగినంత ఆదరణే వుంటే యీ సంఘంలోని అవాస్తవికత ఎంతో కాలం నిలవదేమో!

ఈనాడు ప్రచారం గొప్ప సాధనమైంది. ఈసంఘాన్ని అటునించి యిటు మళ్లించాలంటే అదొక్కటే సహాయమని అనిపిస్తుంది. నేటి సోదర యువతీ యువకులు నిద్రావస్థలో వుండడం ఏమంత హర్షించవలసినసంగతి కాదనుకుంటా. తమకుచేతనైనంత వరకు సనాతన ఛాందసుల శిథిలాలయాలను పూర్తిగా పడగొట్టి నూతన ఆశలు చిగిరింపజేసే నవసమాజాన్ని సృష్టిచేసుకోవాలి. అప్పుడు సోదర సోదరీమణులకు భవిష్యత్తు నావున్నంత శూన్యంగా వుండదనుకుంటా.

ప్రస్తుత సంధియుగంలో నాలాంటి సోదరీమణులు ఎంత మంది పల్లారుస్తున్నారో అనుభవించేవారికి తెలుసు!

ఈ యదార్థం మన హైందవలోకం ఎంత త్వరగా గమనిస్తే అంత మంచిది. ★

నక్షత్ర ఫలితాలు

(23-4-58 మొదలు 29-4-58 వరకు)

గ్రహ స్థితి

బు	ర కే		
శు కు	24 తేదిని తూర్పున బుధోదయము. 29న శుక్రుడు మీనములో ప్రవేశించును. వృషభ, మిథున, కర్కాటక, సింహములలో చంద్రుడు.		
శ		గు రా	

అశ్విని [చూ, చే, చో, లా]

ఈ వారము అనుకున్నట్లు పనులు నెరవేరక అనవసర ధనవ్యయము జరుగును. మిత్రులనుండి ఆశించిన సహాయము కలుగదు. వారాంతమునకు ప్రయాణములో తడస్తపడిన స్నేహితునివల్ల కార్యసిద్ధిని పొందుతారు. ఉద్యోగస్తులకు పర్వత ప్రదేశములకు గాని, అరణ్య ప్రదేశములకుగాని బదిలీఅయే సూచనలున్నవి. వ్యాపారస్తులకు లాభముతక్కువ, ఖర్చులు ఎక్కువ, దగాపొందుట కలుగును. 25, 26 త్రిప్పట, ధనాభావము, అధిక ఖర్చులు. 27, 28 ప్రయాణము మిత్రసహాయము, కార్యసిద్ధి. నూతనులతో పరిచయము, విచిత్రవస్తు సంపాదన. 28, 29 అనారోగ్యము, ఉద్యోగస్తులకు బదిలీ అయే సూచన. రాజకీయవాదులకు మేలు.

* భరణి [లీ, లూ, లే, లో] *

ఈ వారము ధనలోపమువల్ల అనుకున్న పనులు నెరవేరవు. మిత్రులనుకున్నవారే సమయానికి సహాయము చెయ్యరు కాని మీరు ఎవరిసహాయాన్ని ఆశించలేదో అతనే వస్తుపడి వారాంతమునకు కార్యసిద్ధి కలిగేలాగు చేస్తాడు. వర్తకులకు వారాంతమున లాభిస్తుంది. ఉద్యోగస్తులకు క్రమేణా అధికారుల ఆదరణ కలుగుతుంది. 26, 27 త్రిప్పట, ధనాభావం, ఆటంకములు. 27,28 ప్రయాణము, మిత్ర సహాయము, కార్యసిద్ది, విదేశీయులతో పరిచయము. 28, 29 ఇంట్లోవారి ఆరోగ్యముగురించి చింత.

* కృత్తిక [ఆ, ఈ, ఊ, ఏ] *

ఈ వారము కార్యాచరణలో ఆటంకాలు జరుగును. మీకు దైవబలముపై నమ్మకము కలుగుటచేత అన్ని అడ్డంకులు తీరి తుదకు కార్యలాభమును పొందుతారు మీ ప్రయత్నము లేకుండానే ధనలాభము కలుగుతుంది. పుణ్యతీర్థయాత్రలు చేయాలనే కోరిక కలుగుతుంది. ఆత్మీయుల అనారోగ్యముచే కలవరపాటు కలుగుతుంది. ఉద్యోగసులకు స్తిమితము తక్కువ. వ్యాపారస్తులకు నష్టము కలుగుతుందేమో నని ఆందోళన. 23, 24 నిలకడలేని స్థితి. 25, 26 ఆటంకములు. 27 దైవచింత, ధనలాభము, కార్యసిద్ధి, 28, 29 ఆత్మీయుల అనారోగ్యము. ఉత్తరదిశ ప్రయాణము

* రోహిణి [ఓ, వా, వీ, వూ] *

ఈ వారము అనుకున్నట్లుగా డబ్బు రాకపోగా ఖర్చులు ఎక్కువగుటచే ఆందోళన

బి. నరసింగరావు

కలుగుతుంది. మీ పనులు కాకపోవడమే కాకుండా పరోపకారమునకు తలపెట్టి అనుకున్నట్లు జరుగక పోవడంవల్ల నిందలచే మనోవ్యధ కలుగుతుంది. కోరు వ్యవహారములు కొంత అనుకూలిస్తవి. ఉద్యోగస్తులకు కొత్త సమస్యలు. కార్యభారము ఎక్కువ. వర్తకులకు వ్యవహారము పట్ల పేచీలు. భార్యకు ఆరోగ్యము భంగపడే సూచనలు. 23, 24 ఏమీ చేయలేనిస్థితి 25, 26 కార్యభారము, త్రిప్పట. 27 కార్యలాభము 28, 29 వివాదాలు, ఆరోగ్యచింత

* మృగశిర [వే, వో, కా, కీ] *

ఈ వారము యత్నకార్యములకు ఆటంకములు. డబ్బుకు ఇబ్బంది పడవలసి వస్తుంది. ఆప్తుల సహాయానికి పూనుకొని జరగక మాటపడి మనోవ్యధ చెందుతారు. యంత్రముల వల్లగాని, అగ్నివల్లగాని కలిగే ప్రమాదము జాగ్రత్తవల్ల నివారణ కావచ్చును. భూస్వాములకు, యంత్రములునడుపు నిపుణులకు, రసాయన శాస్త్రజ్ఞులకు, గనుల యజమానులకు లాభం. 23, 24 కార్యాలోచన. 25, 26 ఆటంకములు, నిందలు, 27 కార్యలాభం 28, 29 ప్రమాదసూచన. ఉద్యోగస్తులకు బదిలీ అయే సూచన.

* ఆరుద్ర [కూ, ఖ, జ, ఛ] *

ఈ వారము మీకు యోగప్రదము. గతవారము అనుకుండా నిలిచిపోయిన కార్యములు ఈ వారము అధికారుల సహాయము, మీ పలుకుబడి, బుద్ధిబలము ఉపయోగించి కార్యసిద్ధిని పొందుతారు. బంధుసహాయము కూడా కలుగుతుంది. ఆర్థికస్థితి బాగుంటుంది. 23, 24 తొందరలు తగ్గి కార్యక్రమము ఏర్పాటు చేసుకుంటారు. 25, 26 ఏమిచేసిందికి తోచదు. 27 మిత్రలాభం, ధనాదాయము, కార్యానుకూలత 28, 29 వినోదములకు ఖర్చులు. జ్యోతిష విద్యా ప్రసంగము. కవులకు, కళాకారులకు, నటీనటులకు యోగకాలము.

* పునర్వసు [కే, కో, హా, హీ] *

ఈ వారము మీకు పండితులతో పరిచయమువల్ల విజ్ఞానాభివృద్ధి కలుగుతుంది. ప్రభుత్వ సన్మానమువల్ల ధనలాభము కలుగుతుంది. పిల్లల యోగక్షేమములచే ఆనందము పొందుతారు. పుత్రసంతానప్రాప్తి కలుగుతుంది. కోర్టు వ్యవహారములు సుముఖమవుతాయి. నూతన ప్రయత్నములు చేస్తారు. ఉద్యోగస్తులకు హోదా పెరిగే సూచనలున్నవి. ఉపాధ్యాయులకు, పండితులకు, న్యాయవాదులకు మేలుకాలము. 23, 24 వైద్య జ్యోతిష విద్యా ప్రసంగము. విజ్ఞాన వృది, ధనలాభం. 25, 26, మందముగావుండి ఏపని చేయలేరు. 27 నూతన ప్రయత్నము, ప్రభుసన్మానలాభము. 28, 29 విద్యా వ్యాసంగముకొరకు ధన వ్యయము. పుత్రప్రాప్తి.

పుష్యమి [హూ, హే, హో, డా]

ఈ వారము మీరు తలపెట్టిన కార్యములు జయప్రదముగా ముగుస్తాయి. కోర్టు వ్యవహారములు మీ పరముగా తీర్పు అవుతాయి. నూతన వస్త్రములు కొంటారు. ఉద్యోగస్తులకు అనుకూలము. బియ్యము, బెల్లము, పంచదార, బట్టలు, ద్రవపదార్థ వస్తు వ్యాపారస్తులకు లాభము. కవులకు, గాయకులకు, నటీనటులకు యోగకాలము. 23, 24 ప్రయాణము, శుభకార్యాలోచన, వినోదము, విందు 25, 26 తెమలని కార్యక్రమము. 27 ధనలాభము, కార్యసిద్ధి. 28, 29 ఆందోళన.

* ఆశ్రేష [డీ, డూ, డే, డో] *

ఈ వారము మీకు శుభయోగము. బంధుమిత్రులను కలుసుకుంటారు. ఇష్టవస్తు లాభమును పొందుతారు. వాహనయోగము కలుగు

★ నక్షత్ర ఫలితాలు ★

తుంది. బట్టలు, నూలు, బంగారము వ్యాపారస్తులకు క్రయవిక్రయాలలో లాభము కలుగుతుంది. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు యోగకాలము. 23, 24 ఇష్టవస్తులాభము, భాగ్యవృద్ధి. 25, 26 ప్రయాణము. 27 శుభ కార్యాలలో చవ, విందు, వినోదము. 28, 29 కార్యాచరణలో ఖర్చులు. నూతన బాంధవ్యము. కవితాగోష్ఠి.

* మఖ [మా, మీ, మూ, మే] *

ఈ వారము వింత వార్తలను వినుట, పరాక్రమమువల్ల ఘనత, ఉద్యోగ ప్రయత్నము, అధికారులతో పరిచయమువంటి యోగములు కలుగుతాయి. కార్యభారము ఎక్కువచే అకాలభోజనమువల్ల శరీరములో వేడి ఎక్కువై, ఆరోగ్యము చెడే సూచనలు కనబడగానే శ్రద్ధ వహించండి. కోర్టు వ్యవహారములు వాయిదా పడుతాయి. 23, 24 ఉద్యోగ ప్రయత్నము, అధికారులతో పరిచయము, ధనలాభము. 25, 26 ప్రయాణము 27 రాజానుగ్రహము, కార్యసిద్ధి, 28, 29 శరీరములో వేడి, నేత్రపీడ, ఔషధసేవ.

* పూర్వఫల్గుణి (పుబ్బ) *
[మో, టా, టీ, టూ]

ఈ వారము అంతయోగప్రదము కాదు. అనవసర ప్రసంగములవల్ల మీరు తలపెట్టిన కార్యములకు ఆటంకములు కలుగుతాయి. మిత్రులనుకొని నమ్మినవారు దగాచేస్తారు. కాని వారాంతమునకు కొంత అనుకూలముగా వుంటుంది. ఉద్యోగస్తులకు శిక్షకొరకు వన పర్వత ప్రదేశములకు బదిలీఅవుతుంది. వ్యాపారస్తులకు ఖర్చులు ఎక్కువ, లాభముతక్కువ. 23,24 కార్య ప్రయత్నములు 25. 26 ఆటంకములు, దగా, విచారము 27 విదేశీయులతో మైత్రి, కార్యలాభము 28, 29 బదిలీ దుష్టవార్తా శ్రవణము.

* ఉత్తరఫల్గుణి (ఉత్తర) *
[టే, టో, పా, పీ]

ఈవారం ఆర్థికముగా ఇబ్బంది బంధువుల రాకపోకలవల్ల ఖర్చులు ఎక్కువ. యత్న కార్యములకు ఆటంకములు. కోర్టు వ్యవహారములు మీ పరముగా తీర్పు అవుతవి. ధన లోపమువల్ల కలిగిన కుటుంబకలతలు ఆధ్యాత్మిక చింతవల్ల మరిచి శాంతిని పొందుతారు. ఈశ్వరానుగ్రమువల్ల కార్యలాభము పొందుతారు. ఉ తరదిశ ప్రయాణము చేయవలసి వస్తుంది. 23,24 తేదిలలో ప్రయత్నములు 25,26 ఆటంకములు. ఎక్కువఖర్చులు 27 న కార్యలాభము. 28,29 శరీర పీడ, స్త్రీలతో విరోధము.

* హస్త [పూ, ష, ణా, ఠ] *

ఈవారము తలపెటిన పనులు ఫలించక కార్యభారముతో పాటు ఖర్చులు కూడా ఎక్కువవుతాయి. వ్యర్థముగా తిరుగుట, సజ్జనులతో విరోధము కలుగుతాయి. కోర్టు వ్యవహారములు లాభిస్తాయి. ఉద్యోగస్తులు బదిలీ అవుటగాని శెలవు పెట్టుటగాని జరుగును. అపరదినుసులు, నూనెదినుసులు వ్యాపారస్తులకు లాభము. 23, 24 కార్యప్రయత్నము 25, 26 వృధాశ్రమ, విరోధము 27 కార్య లాభము 28,29 బదిలీలేక శెలవు పెటుట కుటుంబమందుండు స్త్రీల ఆరోగ్య చింత.

చిత్త [పే, పో, రా, రీ]

ఈవారం కార్యాచరణలో ఎన్ని ఆటంకములు వచ్చినా పట్టుదలతో ప్రయత్నించి తుదకు కార్యలాభము పొందుతారు. ధన లోపము తీర్చుకుందికి అప్పుచేస్తారు. చరస్థిరాసినిగురించి ఆలోచిస్తారు. దక్షిణ దిక్కుకు ప్రయాణము చేయవలసివుంటుంది. మీ ప్రయత్నములు ఫలించడంవల్ల అప్పు బాధతీరుతుంది. దావాలలో జయము పొందుతారు. ఎత్తైనస్థలమునుండి పడుటవల్ల దెబ్బలు తగిలే ప్రమాదము జాగ్రత్తవల్ల తప్పవచ్చును. ఎరువు సంబంధమగు వస్తువుల వ్యాపారస్తులకు రసాయన శాస్త్రజ్ఞులకు, పోలీసు, ఇంజినీరింగుశాఖలలో ఉద్యోగులకు గనుల యజమానులకు కష్టముతో కూడిన లాభయోగం. 23; 24 కార్యాచరణకు ప్రయత్నములు, 25, 26 ఆటంకములు అప్పుచేయుట ప్రయాణము 27 కార్యలాభము, ఋణ విమోచనము 28, 29 మనోవ్యథ, ప్రమాద సూచన.

* స్వాతి [రూ, రే, రో, తా] *

గతవారము కలిగిన కష్టములు ఈ వారము తీరుతవి. ఉత్సాహముతో మీ ప్రజ్ఞ పలుకుబడి ఉపయోగించి మంచి ఫలితాలు పొందుతారు. అధికారులు ఆదరిస్తారు. పుత్రకళత్ర సుఖము కలుగుతుంది. ఈశాన్య దిక్కున వున్న ఆత్మీయుల క్షేమము తెలియుటచే ఆరాటం తగుతుంది. కవులు కొత్తరచనలు ప్రారంభిస్తారు. గణితశాస్త్ర జ్యోతిష విద్యాగోష్ఠిలో పాల్గొంటారు. కవులకు చిత్రకారులకు నటీ నటులకు యోగకాలము. 23, 24 తెరిపిలేని కార్యక్రమము. 25, 26 ప్రయాణము, అలసట. 27 న కార్యసిద్ధి, ధనలాభ యోగములు. 28,29 అధిక ఖర్చులు.

విశాఖ [తీ, తూ, తే, తో]

ఈ వారము మీకు ధనయోగము. ఇదివరకు కలిగిన ఇబ్బందులు తీరుతాయి. నష్టం వస్తుందనుకున్న వ్యవహారములో లాభము కలుగుతుంది. పుత్రసంతాన లాభము పొందుతారు. దేహారోగ్యము బాగుపడుతుంది. పుణ్యక్షేత్ర సంచారముచేస్తారు. ఉద్యోగస్తులకు హోదాతోపాటు ఆదాయము పెరుగుతుంది. ఉపాధ్యాయులకూ, పండితులకూ, న్యాయవాదులకు యోగకాలము. 23, 24 ధనలాభము, కార్యసిద్ధి. 25, 26 చెవిపోటు, మనోవ్యాకులత. 27 భాగ్యవృద్ధి, జ్యోతిషగోష్ఠి, 28, 29 ప్రయాణము

అనూరాధ [నా, నీ, నూ, నే]

ఈ వారము మీకు యోగప్రదముగా వుంటుంది. లోగడకలిగిన చిక్కులు చాలావరకూ తీరిపోతవి. ఉద్యోగస్తులకూ అధికారుల ఆదరణ కలుగుతుంది. బంధువులతో కూడి శుభ కార్యాలోచనలు, మృష్టాన్న భోజనము చేస్తారు. దూరవార్తా ప్రసంగ

ధరలు:

నూలు, వస్త్రములు: నిలబాటుగా వుండును.

నూనె దినుసులు: మార్పులేదు.

పంచదార: మార్పులేదు.

బెల్లము, చింతపండు: మార్పులేదు.

ఆహారధాన్యములు: మందముగా వుండును.

పప్పుదినుసులు: నిలబాటుగా వుండును.

వెండి, బంగారము: మార్పులేదు.

ఎండలు ఎక్కువగా యున్ననూ అక్కడక్కడ గాలితోకూడిన వర్షములు పడును.

* * *

జన్మనక్షత్రము బట్టిగాని, జన్మనక్షత్రము తెరుగనివారు నామనక్షత్రము (వారి వారి పేర ననుసరించి పేరు మొదటి యక్షరము)ను బట్టిగాని ఫలితాలు తెలుసుకొనువది. కృష్ణుడను పేరునకు మృగశిరా నక్షత్రమును, హృష్ణుడను పేరునకు స్వాతియు, శ్రీధరుడను పేరునకు చిత్తయును, క్షేత్రపాలకుడనే పేరునకు హస్తయును, భీముడు, భైరవుడు అనే పేర్లకు పూర్వాషాఢయును చూచుకొనునది.

ములు చేస్తారు. ఇంట్లోవారి ఆరోగ్యము బాగుపడుతుంది. బెల్లము, పంచదార, బియ్యము, ప్రత్తి, దూదివంటి దిగుసుల వర్తకులకు యోగము. కవులకు, గాయకులకు, కళాకారులకు మేలుకాలము. 23, 24, ధన లాభము. ప్రయాణము. అధికారుల ఆదరణ. 25, 26 నిలకడలేని స్థితి. 27 బంధుదర్శనము, మృష్టాన్న భోజనము, వినోదము. 28, 29 తిరుగు ప్రయాణము, అలసట.

జ్యేష్ఠ [నో, యా, యీ, యూ]

ఈ వారము ఉద్యోగరీత్యా ప్రమోషను అగుటచే, ఆదాయము పెరుగుతుంది. గత వారము అసంపూర్తిగా ఉండిన పనులు ఈ వారము లాభకరముగా పూర్తిఅవుతవి. కోర్టు వ్యవహారములు మీ పరముగా తీర్పు అవుతాయి సంఘక్షేమమునకు పని చేస్తారు. ఖరీదైన వస్తువుల క్రయ విక్రయములలో వర్తకులకు లాభము. మీకు వాహనయోగము. మీ భార్యకూ అలంకార ప్రాప్తి. కవులకు, గాయకులకు, కళాకారులకు నటీ నటులకు యోగకాలము. 23, 24 ధనలాభము, కార్య సిద్ధి. 25, 26 ప్రయాణము. 27 ప్రమోషను, విందు వినోదము. శయ్యా సుఖం.

* మూల [యే, యో, బా, బీ] *

ఈ వారము డబ్బుకు ఇబ్బందిగా వుంటుంది. రాజకీయ సంబంధమైన పనులలో తిరగవలసి వస్తుంది. తలచిన పనులు వెంటనే నెరవేరవు. అకాల భోజనమువల్ల శరీరములో వేడి ఎక్కువై తలనొప్పి, కళ్ళుమంట వంటి లక్షణములు కనబడగానే అప్పుడే సేవ చేయుట మేలు. పితృవర్గమువల సహాయము కలుగును. గోధుమ వంటి ఆహారధాన్యములు, ఆటవిక వస్తువుల వర్తకులకు లాభము. 23,24 తేమలని కార్యక్రమము. 25,26 ఆటంకములు, కలతలు-27 ధనలాభము, కార్యసిద్ధి, 28,29 అనారోగ్యం.

పూర్వాషాఢ [బూ, ధ, భా, ఢ]

ఈ వారము మొదటి భాగము ఏమి చేసిందికి తోచని అయోమయస్థితి కలుగుతుంది. ఉద్యోగస్థులకు అధికారుల ఒత్తిడి కలుగుటచే సెలవు పెట్టవలసి వస్తుంది. వ్యాపారస్తులకు ఆందోళన. వారాంతమునకు కార్యలాభము. ఇంట్లోవున్న వారి అనారోగ్యము చికాకు కలిగిస్తుంది. 23,24 నిశ్చయములేని కార్యక్రమము, 25,26, బదిలీ అవుటగాని, సెలవు పెట్టుటగాని జరుగును. 27 మిత్రసహాయము, కార్యలాభము. 28,29 ఆరోగ్య చింత.

ఉత్తరాషాఢ [బే, బో, జా, జీ]

గతవారము కలిగిన శుభయోగము ఈ వారము తగ్గుతుంది. ఏపని చేసిందికి మనస్సుకు ఆందోళనగా వుంటుంది. దైవ కృపవల్ల వారాంతమునకు మీ ప్రయత్నములు సుముఖమవుతాయి. ఇంట్లోవారి శరీరపీడవల్ల కలవరపాటు కలుగుతుంది. ఉద్యోగస్తులకు అధికారులవల్ల భయము కలుగుతుంది. వర్తకులకు లాభము తక్కువ. 23, 24 ఎటు పాలుపోని స్థితి. 25,26 త్రిప్పట, ఆటంకములు, ప్రయాణము 27 మిత్రసహాయము, సజ్జనదర్శనము, మాతృచింత. 28.29 ఆరోగ్యచింత, చిత్ర విచిత్ర వస్తువులను చూచుట.

శ్రవణము [జూ, జే, జో, ఘా]

ఈ వారమంతా ఎక్కువ కార్యభారముతో నలిగిపోతారు. మీ పనులు చేసుకొనుటే కష్టముగ చుండినను ఇతరులకు సహాయము చేసిందికి పాటుపడి, ఫలించక మాటపడతారు కోర్టు వ్యవహారములలో జయము పొందుతారు. ఇచ్చి పుచ్చుకొనే పట్ల నీచులతో వివాదములు, మనోవ్యధ, భార్య అనారోగ్యముచే బాధకలుగుతుంది. 23,24 దావాలలో జయము. 25,26 కార్య భారము, త్రిప్పట, ఉద్యోగస్థులకు ఒత్తిడి. 27 ధనాదాయము, కార్యలాభము 28,29 వివాదములు, భార్య అనారోగ్యము.

ధనిష్ఠ [గా, గీ, గూ, గే]

ఈ వారము డబ్బు ఇబ్బంది ఎక్కువ. యత్నకార్యములకు విఘ్నములు కలిగినా పట్టుదల గలవారగుటచే సాహసంతో ప్రయత్నించి తుదకు జయము పొందుతారు. వారాంతమందు గల ప్రమాదసూచన జాగ్రత్తవల్ల తప్పవచ్చును. గనులయజమానులకు, లోహపు సామానుల వర్తకులకు కష్టముతో కూడిన లాభము. ఇంజనీరింగు, పోలీసు శాఖలలో వారికి మేలుకాలము. 23, 24 కార్యక్రమాలోచన. 25, 26 ఆటంకములు. 27 కార్య లాభము. 28, 29 అధిక ఖర్చులు ప్రమాద భయము.

* శతభిషం [గో, సా, సీ, సూ] *

ఈవారము మీకు యోగప్రదము. కొత్తవారితో పరిచయము గలుగుట. శుభవార్త వినుటవంటి మంచి ఫలితాలు కలుగుతాయి. మీ మాటకారితనంవల్లను, అధికారుల ఆదరణ వల్లను తలపెట్టిన కార్యములు నెరవేరుతవి. ధనాదాయము వృద్ధి అవుతుంది. జ్యోతిష విద్యాగోష్ఠి చేసారు. ఆత్మీయుల ఆరోగ్యము బాగుపడుటచే మనశ్శాంతి కలుగుతుంది. కవులు కొత్త రచనలు మొదలు పెడతారు. డాకర్లకు, చిత్రకారులకు, నటీనటులకు యోగకాలము. 23, 24 యత్న కార్య లాభము. 25, 26 అలసట. 27 ధనలాభము, విద్యాగోష్ఠి.

పూర్వాభాద్ర [సే, సో, దా, దీ]

ఈ వారము మీరు అనుకున్నట్టుగా కార్య లాభమును పొందుతారు. ఆరోగ్యం సరి అవుతుంది. ఆర్థికలాభము, భాగ్యాభివృద్ధి, మానసికోత్సాహం కలుగుతవి. పుత్రలాభమువల్ల సంతోషము పొందుతారు. ఉద్యోగస్తులకు ప్రమోషను కలిగే సూచనలున్నవి. వర్తకులకు ప్రయాణమువల్ల లాభం, ఉపాధ్యాయులకు పండితులకు, న్యాయవాదులకు యోగకాలము. 23, 24 కార్యలాభము. 25, 26 ప్రయాణము. 27 కోర్టువ్యవహారములలో లాభము, ధనయోగము. 28, 29 శ్రమ.

* ఉత్తరాభాద్ర [దూ, శం, ఝా, థా] *

గత రెండు వారములకన్న ఈ వారము యోగప్రదముగా ఉంటుంది. అసంపూర్తిగా వుండిపోయిన పనులు లాభదాయకముగా పూర్తి అవుతవి. కవులు, గాయకులు మొదలగు కళాకారులతో వినోదముగా గడుపుతారు. బంధువులతో శుభకార్యాలోచన, మృష్టాన్నభోజనము, వెండి, బియ్యము, బట్టల వర్తకులకు లాభము. దూరస్థులైన ఆత్మీయుల క్షేమము తెలిసి సంతోషము పొందుతారు. కవులకు, గాయకులకు, కళాకారులకూ మేలు కాలము. 23, 24 కార్య నిర్ణయము, వినోదము, విందు. 25, 26 ప్రయాణము. 27 శుభవార్త, కార్యలాభము, 28, 29 అస్థిమితము.

* రేవతి [దే, దో, చా, చీ] *

ఈ వారము మీకు యోగదాయకము. యత్నకార్యములు ఫలిస్తాయి. ధనాదాయం బాగుంటుంది. పరోపకారము, పుణ్యకార్యములలో పాల్గొంటారు, శుభకార్యాలోచనలు చేస్తారు. ఉద్యోగస్తులకు యోగకాలము. బంగారము, వజ్రములవంటి ఖరీదైన సరకుల క్రయవిక్రయములయందువ ర్తకులకు లాభము. 23, 24 సంఘక్షేమ కార్యాచరణ. 25, 26 ప్రయాణము. 27 ధనలాభము, శుభకార్యాలోచన, విందు, వినోద, శయ్యాసుఖము. 28, 29 నిలకడలేని స్థితి. ★

★ రెండంకాల హత్య ★

(15-వ పేజీ తరువాయి)

"జోగారావుగారు ఎందుకు ఆత్మహత్య చేసుకున్నారు? పైగా మీనాకుమారి చనిపోయిన దినంగానే ఉన్నది ఈయన మరణం;" పాషా అంటున్నాడు.

మయూరు ఆలోచిస్తున్నాడు. మాట్లాడలేదు.

పాషా చెప్పుకుపోతున్నాడు. "జోగారావుగారు మీనాకుమారిని అతిగా ప్రేమించి ఉంటారు. ఆమె మరణవార్త దుర్భరంగా ఉండి ఉండాలి ఆయనకు. ఆవిడ లేకుండా జీవితం గడపటం ఎలాగో ఆయనకు తోచి ఉండదు. అదీ కాక ఒకవేళ మీనాకుమారిది హత్య అని నిరూపింపబడితే ఈయనమీదే ఎక్కువ అనుమానం వేసేందుకు తగినన్ని ఆధారాలు ఉన్నవి. ఇక భరింపలేక ఆత్మహత్య చేసుకున్నాడు పాపం!" అన్నాడు పాషా.

మళ్లీ అతడి హృదయం జాలితో నిండిపోయింది.

కాని మయూరు మాట్లాడలేదు. ఉండి ఉండి అతడి ముఖంలో ఆందోళన వ్యక్తమయింది. కనుబొమలు ముడుచుకున్నై. పాషాకేసి తిరిగాడు.

"ముందుగా సత్యానందాన్ని అరెస్టు చెయ్." అన్నాడు.

పాషా నివ్వెరపోయాడు. మయూరు మామూలు ధోరణిలో లేడేమో ననిపించింది.

"సత్యానందాన్నా? ఎందుకు?"

"ముందువెళ్ళి అరెసు చేయ్. తర్వాత కారణాలు చెబుతాను."

"కారణం ఏమని చెప్పను."

"కారణానికేముంది? మీనాకుమారినీ, జోగారావుని హత్యచేసిన కారణానికి," అన్నాడు మయూరు.

పాషాకు ఒళ్ళంతా గగుర్పొడుస్తున్నది. వెంటనే బయలుదేరాడు.

* * *

మర్రోజు ప్రొద్దుట మయూర్‌ను కలుసుకున్నాడు పాషా, సత్యానందాన్ని అరెసు చేశాడన్న మాటేకాని అతడికి సందేహంగానే ఉన్నది. "ఇది హత్యేనా? హత్య అయితే సత్యానందం దోషి ఎట్లా అవుతాడు?"

ఈ సంగతే మయూరును అడిగాడు.

మయూరు చెప్పుకుపోయాడు.

"నేనూ మొదట్లో మీనాకుమారి ఆత్మహత్య చేసుకున్నది అనుకున్నాను. ఆ రోజే ఇద్దరం వెళ్ళి ఆమె ఉన్న పరిస్థితి చూశాము. ఆత్మహత్య చేసుకున్నది అనుకునేందుకు అనుకూలంగా ఉన్నది అక్కడి వాతావరణం. కాని మరొక్కమారు అంతా పరీక్షించాను. గోడలో బుల్లెట్ కనబడింది మనకు. "అదేమిటని" అడిగావు. అప్పటికి నాకే బోధపడలేదు. తర్వాత డ్రాయర్లో పైజామాలు కనబడినవి. దాంతోటి పురుషులు ఇక్కడకు వచ్చే అలవాటుందని వ్యక్తమవుతుంది. ఇక హత్య విషయం—ముందు హంతకుడు ఆమెను పిస్టలుతో నుదుటిమీద పేల్చి హత్యచేశాడు. ఆమె పూరిగా ప్రాణం విడువకమునుపే ఆమె చేతిలో ఆ పిస్టలు పెట్టి రెండవసారి ఊరికే గోడకేసి గురిచూసి పేల్చాడు. అందుకే గోడలో బుల్లెట్ ఉన్నది. ఆమె చేతికి మసిఅయిన కారణం అది. కనుక హత్య అని తేలిపోయింది.

ఇక హంతకుడెవరు? బాగా ఆలోచించాను పైజామాలు గదిలో ఉన్నందువల జోగారావే హంతకుడు కావచ్చు అని ఊహించాను. ముగ్గుర్ని మనం ఆరోజు పోలీస్ స్టేషన్‌లో కలుసుకున్న తర్వాత నేను ఒక్కొక్కర్ని విడిగా కలుసుకున్నాను జోగారావు హంతకుడయ్యేందుకు వీలు లేదని ఆరోజే తెలిసిపోయింది. ఎందుకంటే అతడికి మీనాకుమారితో చాలకాలంగా పరిచయం ఉన్నది. ఆమెహత్య చేయబడ్డరోజు రాత్రి ఎనిమిది తొమ్మిదిగంటల మధ్య ఆమె ఇంటికి ఎవరో వచ్చి తలుపుతట్టారని భుజంగరావు చెప్పాడు. తలుపుతట్టే అవసరం జోగారావుకి లేదు. ఎందుకంటే ఆ తలుపు బయటనుంచి కూడా తీయవచ్చు. నేనారోజే పరిశీలించాను. బయటనుంచి తీసే తాళం చెవి జోగారావు వద్ద ఉన్నది. కనుక ఆయన తలుపుతట్టడు. బయటనుంచే తాళంతీసి లోపలకు పోవడం అలవాటు అతడికి - కనుక అతడు హంతకుడు కాదు.

"తర్వాత మోహనరావు—అతడు ఎంతమాత్రం హత్యచేయలేడు. అతడు మద్రాసు వచ్చి వారం రోజులయింది. అంతకు ముందెప్పుడూ మద్రాసు రాలేదనేందుకు నిదర్శనాలు దొరికినై. హత్య అతడు చేయలేడు. ఎందుకంటే వారంరోజుల్లో ఒక స్త్రీమీద అంత ప్రేమపుట్టి దానిద్వారా ఈర్ష్య జనించి హత్య చేయగలిగేంత తీవ్రతకు రావడం అసంభవం. కనుక అతణ్ణి వదిలేశాను!

ఇంత దాకా చెప్పిన మయూరు ఆపి సిగరెట్ వెలిగించాడు.

"మరి సత్యానందం హత్య చేశాడనటానికి నిదర్శనం ఏమున్నది?" అన్నాడు పాషా.

మయూరు అందుకున్నాడు.

"అదే చెప్పబోతున్నాను. అతడేదో బిజినెస్ చేస్తున్నాడని మీనాకుమారికి అందులో షేర్లు ఉన్నవనికదూ అన్నాడు. మీనాకుమారికి అబిజినెస్‌లో షేర్లు ఉన్నమాట నిజమే. ఆరోజు ఆమెగదిలో డ్రాయర్లో షేర్ సరిఫికేట్లు చూశాను. కాని సత్యానందం ఆ డబ్బంతా సంవత్సరం క్రితమే ఖర్చు చేశాడు. అతడివద్ద ప్రస్తుతం చిల్లిగవ్వ కూడ లేదు. అతడిబ్యాంకిఎకౌంటు నిన్న చూశాను. సంవత్సరం క్రితమే శూన్యమయింది ఆకౌంటు. మీనాకుమారి డబ్బు విషయమై సత్యానందాన్ని పదే పదే అడుగుతూండి ఉండాలి. అతడు ఇదుగో అదుగో అంటూ వచ్చాడు కాని మీనాకుమారి ఇక భరించలేకపోయింది. డబ్బు ఇవ్వకపోతే కేసు పెడతానని బెదిరించింది. తోచక లేదు సత్యానందం. అతడి బుర్రలో మరో రకమైన ఆలోచనలు మొలకెత్తినై ఆరోజుతో అవి బలపడినై. రాత్రి తొమ్మిది గంటలప్పుడు నేరుగా మీనాకుమారి ఇంటికి దారితీశాడు. తలుపుతట్టాడు ఆమెతలుపుతీసింది నవ్వుతూ లోపల ప్రవేశించాడు-ఆమె అలా జరుగుతుందని ఊహించి ఉండదు—పిస్టలుతో ఆమె నుదుటిమీద పేల్చేశాడు సత్యానందం. తర్వాత పిస్టలును ఆమె చేతిలో పెట్టి గోడకు గురిచూసి పేల్చాడు. ఆమె చేతికి మసిఎక్కించడమే అతడి ప్రధానోద్దేశం ఆత్మహత్య చేసుకుందని అనుకోడానికి అనుకూలంగా చేశాడు వాతావరణాన్ని. అంతటితో అతడి పని అయిపోయింది. ఇక డబ్బు విషయమై తనను బాధించలేదు మీనాకుమారి. అది సత్యానందం అభిప్రాయం." అన్నాడు మయూరు.

కొంత గర్వంగా కనుపిస్తున్నది అతడి ముఖం.

"మరి జోగారావు ఎందుకు హత్య చేయబడ్డాడు?" అన్నాడు పాషా. ఇది ఎంతసేపు ఆలోచించినా తెగని సమస్య అయింది అతడికి.

మయూరు మెత్తగా నవ్వాడు.

"తేలిక ప్రశ్న. పైజామాల మూలంగా జోగారావు మీద బలమైన నిదర్శనం ఒకటున్నది. అతడే హంతకుడని తేలిపోయింది. ఇక జోగారావు భరించలేడు. తనను జైలులో వేస్తారు—ఈ బాధతో అతడు ఆత్మహత్య చేసుకున్నాడు" అన్నాడు మయూరు నవ్వుతూ

"మరి హత్య అంటిరి కదా." అన్నాడు పాషా.

"అదే జోగారావు ఆత్మహత్య చేసుకున్నాడని నువ్వూ నేనూ, మిగతా ప్రపంచం అనుకోవాలని సత్యానందం ఊహ. హంతకుడే ఆత్మహత్య చేసుకుంటే మనం హంతకుణ్ణి ఏం చెయ్యగలం. ఇదే సత్యానందానికి వచ్చిన చురుకైన ఊహ.

చిలిపిగా నవ్వాడు మయూరు.

పాషా ఇకమాట్లాడలేదు. అతడు మెల్లిగా నవ్వి తర్వాత పెద్దగానవ్వి

"శలవు" అన్నాడు.

మయూరు మాట్లాడలేదు. వలచిన చిన్నదానిపైకి మళ్ళీ ఆలోచనలు పోయినై. ★



వనితాలోకం

నవ్వు

పి. అనసూయ

'నవ్వలేని వాడిని నమ్మవద్దన్న' సామెత అందరికీ తెలిసిందే. ఎంతగంభీరమైన మనస్తత్వంగల మనిషైనా ఒకసారి కాకపోయినా ఒకసారైనా నవ్వుతాడు. జీవితంలో ఒక్కసారైనా నవ్వనివారు ప్రపంచంలో వుండరనుకుంటాను. అథవా అటువంటివాడు ఎవడైనా వున్నాడంటే వాడు చాలా ప్రమాదకరమైన మనిషన్నమాట. ఏదైనా సంతోషాన్ని కలుగచేసే దృశ్యాన్ని చూచినా, లేదా ఆనందకరమైన వార్తలను విన్నా మనం నవ్వుతాము. ఈ నవ్వటంలో కూడా బోలెడన్ని రకాలు.

నవ్వుల రకాలు

కొందరిముఖాలు ఎప్పుడూ చిరునవ్వుతో వెలిగిపోతుంటాయి. అసలు కోపం అనేది వీళ్ళకు ఎప్పుడూ రాదేమోననిపిస్తుంది వీళ్ళనుచూస్తే. ఉదయం లేవగానే చిరునవ్వుతో ప్రత్యక్షమైన ముఖాన్ని చూస్తే ఆరోజంతా ఆనందంగా వుంటుంది. కావ్యాలలోని నాయికలవలె వీళ్ళు మందస్మిత వదనారవిందంగల వాళ్ళన్నమాట. అందం లేకున్నా సరే చిరునవ్వు నవ్వేవాళ్ళముఖం వింత కాంతితో మెరిసిపోతుంటుంది. ఇది తెచ్చిపెట్టుకుంటే రాదు. అట్లా నవ్వు ముఖంతో వుండాలని మనకై మనం ప్రయత్నిస్తే అది సహజంగావుండదు—సరిగదా చూచేవాళ్ళకు ఎబ్బెట్టుగా కన్పిస్తుంది.

ఇంకొకరకం వాళ్ళుంటారు. వాళ్ళు నవ్వునుకల్గించే సమయాల్లో కిలకిలా నవ్వుతారు. ఇది వినేందుకు చాలాబాగుంటుంది. మంచి పలువరుసగలవారు యిట్లా నవ్వితే చూచేందుకు అనోరు, ఆ పలువరుసే కాకుండా వినేందుకు ఆశబ్దంకూడా యింపుగా వుంటుంది. మాపిన్నిగారి అమ్మాయి ఒకామెవుంది. ఆమె అట్టె అందగత్తె కాకపోయినా ఆమె నవ్విందంటే ఏమిటో సంగీతంలా వుంటుంది. ఆ శబ్దంలోనే ఏమిటో అనిర్వచనీయానందం వుంటుంది. అడిగిఅడిగి నవ్వించుకొందామా అని అనిపిస్తుంది. ముఖ్యంగా ఆడవాళ్ళకంఠాలు బొంగురు లేకుండా వుంటాయి కాబట్టి నవ్వు స్త్రీలకు ప్రత్యేకంగా ఒకఅందాన్ని తెచ్చిపెట్టుంది. అట్లాగని పురుషులలో వికారమైన గొంతులుంటాయనికాదు. మెజారిటీ తీసుకుంటే స్త్రీల కంఠ శబ్దానికి విశిష్టస్థానం వుంది. అలలలలుగా నవ్వేవాళ్ళనుచూస్తే మానవుడికి ఈనవ్వుఅనేది భగవంతునివరం అని సంతోషం కలుగుతుంది.

మొన్న మా యింట్లో వారంతా కలిసి ఒక పిక్చరుకు వెళ్ళాము. మా ప్రక్కనే ఒక అమ్మాయి కూర్చొనివుంది. నవీనంగా అలంకరించుకొనివుంది. పిక్చరులో హాస్యగాడు హాస్యం చేస్తున్నాడు. ఇక చూసుకోండి నవ్వటం మొదలుపెటింది. పెద్దగా—అదీ ముందుసీట్లలో వుండేవాళ్ళందరూ వెనక్కు తిరిగి చూచేంత పెద్దగానవ్వటం ప్రారంభించింది. నవ్వుతారు. తమాషాచూస్తే అందరూ నవ్వుతారు. కానీ ఈమె ఆసీను అయిపోయాక కూడా ఆవిషయాల్ని తలచుకొని కాబోలు ఆపకుండా నవ్వుతోంది. దాన్ని నవ్వు అనడం తప్పు. అది భీకర అట్టహాసంలాగ తోచింది. ఇది అతిశయోక్తికాదు. ఇటువంటి అనుభవం చాలామంది వనితలకు కలిగివుంటుంది. కానీ సభ్యత అనేది ఒకటి అడ్డువుండడం చేత ఆమెను నవ్వకూడదు తప్పు—చిన్నగా నవ్వమని మనం చెప్పలేక, ఆ నవ్వును విని సహించలేక చస్తాము. అహహా అహహా అని నవ్వేవాళ్ళు వున్నారు. వీళ్ళు పొరలు పొరలుగా నవ్వుతూ మధ్యలో ఎక్కిళ్ళు పెడుతుంటే నవ్వుతున్నారా? లేదా ఏడుస్తున్నారా అని సందేహం కలుగుతుంది. పురుషులు పెద్దగానవ్వితే అదోక తరహాగా వుంటుంది. అదే స్త్రీలు మరీ అంతపెద్దగా నవ్వితే చాలా అసహ్యంగా వుంటుంది.

ఈమధ్య మాయింట్లో ఓ చిన్న డిన్నర్ జరిగింది. మా నాన్నగారి ఫ్రెండ్ ఒకాయనవచ్చాడు. అంతా బాతాఖానీలో పడ్డారు. ఆయన ఏదో ఛలోక్తి వేశాడు. అది ఎవ్వరికీ నవ్వు పుట్టించలేదు. తను వేసిన విటు తనకే విపరీతంగా నవ్వుకలిగించిందేమో ఇల్లు దద్దరిల్లిపోయేలాగ నవ్వటం మొదలుపెట్టాడు. ఆయన అంతగా నవ్వుతున్నపుడు ఇవతలవాళ్ళు వూరుకోవడం బాగుండదని పళ్ళు బయటపెట్టి వచ్చీరానినవ్వు నవ్వారు.

వచ్చీరానినవ్వు అంటే మా ఫ్రెండ్ ఒకామె గుర్తుకొస్తుంది. ప్రతిమాటకూ నవ్వుతుంది. ఎందుకు నవ్వుతుందో ఆమెకు తెలియాలి.

"ఈరోజు—(నవ్వు), నాకు—(నవ్వు) మా చెల్లిమీద (నవ్వు) బలేకోపం వచ్చింది ఇకికీ" అంటుంది. ఇలాగే ప్రతివాక్యాన్ని మధ్యమధ్యలో నవ్వుతూ చెపుతుంది. వాళ్ల చెల్లిమీద కోపం వచ్చిందని చెప్పడానికి నవ్వు ఎందుకువస్తోందో తెలియదు. అసందర్భంగా నవ్వేవాళ్ళను చూస్తే చిరాకెత్తుతుంది.

సమయాసమయాలు

కొందరు సమయాసమయాలు తెలియకుండా నవ్వుతారు. వీళ్ళు మనకి ఎంత ప్రాణస్నేహితులైనా, ఎంత మట్టుమర్యాదగలవారైనా నవ్వకూడని సమయాల్లో నవ్వారంటే వాళ్ళను అమాంతంగా ఈ చెంపా ఆ చెంపా వాయించాలనిపిస్తుంది. మా ఫ్రెండ్ అన్న ఒకడు చనిపోయాడు. వాళ్ళది చాలా బీదకుటుంబం. బి. ఏ, చదివేవాడు. మా ఫ్రెండ్ మాతో పాటు ఇంటర్ చదువుతూండేది. హటాత్తుగా ఒకరోజు పాపం ఆయన చనిపోయాడు. క్లాస్ మేట్‌ను పలకరించక పోవడం బాగుండదని మేమందరం వాళ్లింటికి వెళ్ళాము. ఇంటి నిండా జనం క్రిక్కిరిసి పోయివున్నారు. చనిపోయిన అతని క్లాస్ మెట్స్ అందరూ వచ్చివున్నారు. మమ్మల్ని చూడంగానే మా ఫ్రెండ్ ఆమెతల్లి పెద్దపెట్టున ఏడ్వడం ప్రారంభించారు. ఇంట్లోవున్న ఆ ఒక్క

"నవ్వు"

మగప్రాణి చనిపోతే ఎవరికుండెలు దుఃఖంతో పగిలిపోవు చెప్పండి? అటువంటి సమయంలో మా అందరికీ కూడా తెలియకుండానే కళ్లనీళ్ళు వచ్చాయి.

కానీ మాలో ఒకామెకు వాళ్ళ ఏడ్పు ఏమిటో ఒక రకంగా విన్పించిందట! ఆమె మధ్యలో మాట్లాడుతూ ఏడ్చిందట! అందుకని ఫక్కున నవ్వేసింది. హృదయ విదారంగా వాళ్ళు ఏడుస్తుంటే ఈ అమ్మాయి నవ్వడం చాలా అసహ్యంగా వుండింది. అందరం చీవాట్లు పెట్టామనుకోండి. ఇట్లా సందర్భరహితంగా నవ్వడం చాలా తప్పు.

"నవ్వు నాలుగందాల చేటు"

నవ్వు ఒక అలంకారమని ఇరవై నాలుగు గంటలూ నవ్వుతుంటే అది చాలా ముప్పుకు దారితీస్తుంది. సీరియస్‌గా క్లాస్ జరిగేటప్పుడు నవ్వటం ఒకటి. లెక్చరరుకు తన్ను చూసి నవ్వుతున్నారనీ, విద్యార్థులకు తమ్ము గురించి మాట్లాడుకొని నవ్వుతున్నారనీ యిట్లా పలురకాల ఆలోచనలు కలుగుతాయి. రాముడి పట్టాభిషేకంలో లక్ష్మణుడు నవ్వాడని సభలోని వారందరూ తలో రకంగా ఆలోచించారు. కానీ లక్ష్మణుడు ఎందుకు నవ్వాడో అతను విప్పి చెప్పేదాకా ఎవ్వరికీ తెలిసింది కాదు. ఎదుటి వాళ్ళను మనం గమనించకుండానే మనం ఏదో చెప్పుకొని నవ్వుకున్నా వాళ్ళు భుజాలు తడుముకుంటారు. తర్వాత మనం మనస్సు నొచ్చుకోవాల్సి వుంటుంది. అందువలననే నవ్వు నాలుగు విధాల చేటు అని అన్నారు.

హరికథలకు వెళ్ళినప్పుడు హరిదాసు పిలక చూచి నవ్వటం, గుళ్లకు వెళ్ళినప్పుడు భక్తి పారవశ్యంతో మైమరచి చేతులెత్తి నమస్కరించే భక్తులను చూచి నవ్వటం ఎదుటి వాళ్ళు దుఃఖిస్తుంటే వాళ్ళ ఏడ్పు కాంభోజి రాగంలో లేదనో, వాళ్ళ ఏడ్పు మధ్యలో మాటలు వున్నాయనో నవ్వటం, ఎదుటివాళ్ళు చీపురు పుల్లలాగ వున్నారనో లేదు స్థూలంగా వున్నారనో నవ్వడం చాలా అసహ్యం. ఇది మన నైజాన్ని చూపిస్తుంది. అంతేగానీ మనం నవ్వినందున వాళ్ళకు వచ్చేనష్టం ఏమీ లేదు; మనకు లాభమూ రాదు.

"వెక్కిరింపు"

వెక్కిరింపుగా నవ్వుతారు కొందరు. దీనిని నవ్వటం అనేకంటే పకిలించడం అనో యికిలించడం అనో మనం వాఖ్యానించవచ్చు. ఎదుటివారు పరధ్యానంగా వుండి తలుపు కొట్టుకుంటే గబుక్కున నవ్వేస్తారు. పొరపాటుగా కాలు తట్టుకొని ముందుకు పడబోతే లేక పడితే పకపక నవ్వటం సభ్యత అనిపించుకోదు. ఒక స్త్రీ పడబోతే ఎదుటి పురుషులు నవ్వారని పురుషజాతినంతా దుమ్మెత్తి పోస్తుంది ఆమె. అదే మనిషి, ఒక్కసారి ఎవడైనా పడబోతేనో లేక జారితేనో లేదా సైకిల్ మీదనుంచి క్రింద పడ్డాడనుకోండి, ఈమె నవ్వుతుంది. అదికూడా తప్పేకదా! రైలుస్టేషనులు, సినిమాహాలు, బజార్లు యిట్లాంటిచోట్ల చాలామంది మనుష్యులు కలుస్తారు. అందరిలోకి ఎత్తివేసినట్లుగా పొడవుగానో పొట్టిగానో వుండేవాళ్ళను చూచి ముసిముసిగా నవ్వుతారు. వెక్కిరింపుగా నవ్వటం అంత మంచిది కాదు. మనం ఎవరిని చూచి నవ్వామో వాళ్ళ మనస్సు ఎంత బాధపడుతుందో వాళ్ల స్థానంలో మనంవుంటే మనం ఎంతగా నొచ్చుకుంటామో ఊహించుకుంటే ఎవరూ ఎవరినీ వెక్కిరించినట్లుగా నవ్వరు. కాలు జారిపడ్డ దుర్యోధనుని చూచి ద్రౌపది నవ్వినందుకు నానా భీభత్సం జరిగింది. క్రిందపడి వాళ్ళు బాధపడుతుంటే వాళ్ళుపడ్డ పోజు బాగా లేదనో భూమికి సమతలంగా కాకుండా కొద్ది డిగ్రీల కోణంలో పడ్డారనో నవ్వటం సభ్యత కాదు.

రాని నవ్వు; లేని సిగ్గు

ఎదుటివాళ్ళ మనస్సు నొప్పించకుండా నవ్వాలి. మనం నవ్వినందున వాళ్ళు నవ్వటానికి బదులు బాధతో మూతి ముడుకోకూడదు. నవ్వతగినంత కారణం వుంటే నవ్వదగిన సమయమైతే హాయిగా నిరభ్యంతరంగా మనసారా నవ్వచ్చు. అదైనా ఇంపుగా నవ్వాలి. వీణానాదం లాంటి శబ్దం అందరికీ లేకపోయినా, వున్న కంఠంతోనే మనసారా నవ్వితే బాగుంటుంది. రానినవ్వును నవ్వటం, లేని సిగ్గును అభినయించటం ముఖాన్ని మరింత వికృతంగా చేస్తాయి. పదిమంది కలిసి నవ్వుతూ తుళ్ళుతూ జల్సాగా వున్నప్పుడు నవ్వకుండా, నవ్వు వచ్చినా బిగబట్టి ఆపుకుంటే మరీ ఘోరంగా వుంటుంది. నవ్వినంతలోనే తమ గౌరవానికి అంతస్థుకి హాని కలుగదు. మరీ గంభీరంగా వుంటే జంతువులు కూడా దగరకు వచ్చేందుకు భయపడతాయి. మనసారా నవ్వగలిగినవారు నిజంగా అదృష్టవంతులు. ★

కొళాయి దగర గలాటా

కొళాయి దగర గలాటాలు ఆరంభం కావడంతో వేసవికాలం వచ్చేసింది. మన మీ కాలంలో ఒకవంతు ఆహారం తీసికొంటే మూడువంతులు నీరు త్రాగుతాము. కనుకనే మన మీ కాలంలో నీటికె నానా అవస్థా పడాల్సి వుంటుంది. బొంబాయి, హైదరాబాద్, మద్రాసు లాంటి మహానగరాల్లో యిండ్లలోనే కొళాయి లుంటాయి గనుక తంటా లేదు. కాని మా అనంతపురం లాంటి చిన్న పట్టణాలలో యిండ్లలో కొళాయి లుండటం అరుదు. ఒక్కొక్క హైరోడ్‌కు మూడు, నాలుగు చొప్పున కొళాయి లుంటాయి. మామూలు రోజుల్లో అయితే యిక్కడున్నంత నీటిసౌకర్యము మరెక్కడా వుండదు. ప్రతియొక్కరు బట్టలు వుతకటానికి, అంట్లు తోమటానికి కూడ ధారాళంగా కొళాయి నీళ్లే వాడేస్తారు. కాని వచ్చిన అవస్థంతా వేసవి కాలములోనే.

అడ్వాన్సు బుకింగ్

కొందరు ఏ విరిగిపోయిన కడవనో తెచ్చి కొళాయి దగ్గర పడేసి తమవంతు రిజర్వ చేసికొని వుంటారు. నీరు పడేవేళకివచ్చి మా కడవ యిక్కడ వుందంటూ దానిపేరు చెప్పి–సుమారు పదికడవలైనా పట్టుకపోతూ వుంటారు. కొందరు ధైర్యంచేసి బిందెలు కూడ కొళాయిదగ్గర పడేసిపోతూవుంటారు. మరేం చేస్తారు, పాపం, గంటలకొద్దీ యిక్కడ నిల్చుంటే యిళ్లలో పనులు జరగవద్దా? ఒకవేళ గంటలకొద్దీ నిల్చున్నామే అనుకోండి, తీరా వంతువచ్చింది కదా పట్టుకుందామని తయారయేసరికి "మేము కడవ రాత్రే యిక్కడ పడేశాము వుండవమ్మా వుండు" అంటూ రిజర్వ చేసికొన్నవారొస్తారు.


సహస్ర నామార్చన

ఇంతలో "నేను నిన్న మధ్యాహ్నమే పడేశాను" అంటూ మరొకరు హాజర్.

ఆ పట్టుకుంటున్నామె బిందె సగము నిండినాసరే, దాన్ని తీసేసి ఈవచ్చినవారికి వదలాల్సిందే. లేకపోతే సహస్రనామ పూజలు తప్పవు. సరే ఈ రెండవ ఆమె పట్టుకుంటూ వుండగానే "వుండవమ్మా, నేను నీకంటే ముందు. అసలు నేనొచ్చినప్పుడిక్కడ ఎవ్వరూ వుండలేదు" అంటూ మరొకామె తుఫానువలె దూసుకవస్తుంది. "ఎవరూ వుండకపోతే తిన్నగా

(49–వ పేజీ చూడండి)





పిల్లల ఫ్రాకుల మీదికి

పిల్లల ఫ్రాకులమీద, పరికిణీలమీద, చేతి రుమాళ్ళమీద, దిండు గలీబులమీద, దుప్పట్ల మీదపువ్వులూ,ఆకులూ కుట్టేకంటే—జంతువుల బొమ్మలు, కామిక్ బొమ్మలు కుట్టినట్టయితే చాలా బాగుంటాయి.

అలాంటిబొమ్మలు కొన్ని నేనుఇచ్చాను. ఈ బొమ్మలకి ఫలానా రంగులు ఉపయోగించా లన్న బాధేమీలేదు. ఎవరికి యిష్టంవచ్చిన రంగులతో వాళ్లు కుట్టుకోవచ్చు. ఆ రంగులు మాత్రం కంటికింపైన ముదర రంగులు అయితే పిల్లల్ని బాగాఆకర్షిస్తాయి.


పువ్వులూ, కాయలూ కుట్టడంకంటే, యీ బొమ్మలు కుట్టడం చాలా సులువు కూడాను. ★

—పిళ్ళా విజయలక్ష్మీదేవి.









గృహవైద్యం

వడ దెబ్బలకు

వేసంగి అప్పుడే తిరిగి వచ్చింది. ఎండలు బాగా కాస్తున్నవి: 11 గం॥ సమయంలో బయటకు వెడితే కాళ్ళు, కాళ్ళు మాడుతున్నాయి. రాను రాను బాగా ఎండలు ముదురుతాయి. ఉద్యోగస్తులకు, తిరగడం, పని చెయ్యడం తప్పదు. ఏదో, కొద్దికంటె పిల్లలయుం అన్నట్లు, టీచర్లకి, కోర్టువాళ్ళకి యేదో సెలో రకాల్లో సెలవలు వుంటాయి. ఎండలో తిరిగివచ్చే ఆశేష జనానికీ యెండ దెబ్బవల్ల పడిపోకుండా వైద్యం నేర్చుకొని వుండుట ముఖ్యావసరం. అందులో చంటి బిడ్డ తల్లులకి యిది ముఖ్యం. మంచి రోహిణీ కార్తె సమయంలో, యెవరో, యెండలకి వడకొట్టి రోడ్డుమీద పడి, చనిపోయారని, స్పృహతప్పిందని వింటూ వుంటాం. అటి సమయంలో, వెంటనే రోగిని, ఒక చల్లని స్థలమున పరుండబెట్టి, ఒక గ్లాసుడు, లేక రెండు గ్లాసుల మజ్జిగ తేటను, లేక, పల్చనిమజ్జిగను, ఉప్పు వేయకుండా యివ్వవలెను. పిమ్మట, 5, లేక, 6 నీరుల్లిపాయలను చితుకగొట్టి రసం తీసి, ఒక పాత్రలో వుంచుకొనవలెను. ఇత్తడి పాత్ర పూర్తిగా పనికిరాదు. వడ దెబ్బ కొట్టిన వారికి, చల్లని, నూతిలో నీరుగాని, కుండలలో నీరుగాని తీసుకుని అందులో ఒక తెల్లని మురికి లేని గుడ్డను ముంచి, పిండివేసి, ఆ తడి బట్టతో రోగి వళ్లంతయు శుభ్రంగా తుడిచి ఉల్లి రసములో మరి ఒక గుడ్డను ముంచి పిండి వేసి, ఆ తడిగుడ్డతో వళ్లంతయు కొత్త ఉల్లిరసము అంటునట్లుగా తుడువవలెను. రోగికి, ఈ వుల్లిరసపు ఘాటుకు వళ్ళు, కొద్దిగా మండును. అయినను, వెంటనే నీళ్లతో కడిగి వేయరాదు. ఉల్లిరసము వంటికి పట్టించిన పిమ్మట, 4, 5, గంటలు, మాత్రమే మంచి పిమ్మట చల్లని నీళ్ళ స్నానము తలారా చేయించి, వెంటనే తలను శుభ్రముగా తడిలేకుండా తుడిచి, రోగిని చల్లని ప్రదేశములో పండబెటాలి. లేదా, బాగుగా విసనకర్రతో విసురుచుండవలెను. ఒక శుభ్రమైన తెల్లని గుడ్డను వేసుకుని 4, 5 నిముషములు వుంచి, మళ్ళీ వేసి, వాటిలోముంచి, వేయుచుండవలెను. ఈ విధముగా చేసిన,

డి. వి. లక్ష్మి
ఏలూరు.

యెంత వడదెబ్బకొట్టి, స్పృహతప్పిపడిపోయినను, ఒక్క పూటలో రోగి స్వస్థత చెందును. స్పృహతప్పిన వెంటనే మజ్జిగను ఇచ్చుట ముఖ్యము. రోగికి తెలివి వచ్చిన తర్వాత స్పృహతప్పిపడిపోయినవారికి చన్నీటిస్నానమేమిటని, గోరువెచ్చని నీటినిస్నానం చేయించిన, రోగికి మరింతమంట లెక్కి మరల స్పృహతప్పే ప్రమాదము ఉండును.

పసిపిల్లలకు

ఇంక చంటి బిడ్డలకు. ఈ వేసంగి 3, 4, నెలలూ చంటిపిల్లలందరిని వారితల్లులు చాలా జాగ్రత్తగాచూచుకోవలసి వుండును. అంటే ఈ 3, 4 నెలలు సరిగా చూడరనికాదు; యే విషయంలో నైనా చిన్న, చిన్న వైద్యాలు, మనపెద్దలని అడిగి తెలుసుకొని వుండుటకొని, లేక, వాళ్లు చేస్తోంటే, చూచుటకొని చాలామంచిది. చంటిబిడ్డల గల, మధ్యాహ్నము పండుకో బెట్టు సమయమున, బయటనుండి వేడిగాలి రాకుండగా, పెద్ద తలుపు మూసివేసి, కిటికీ తలుపులకి పెద్దపెద్ద గుడ్డలను తడిపి కట్టవలెను. అట్లు చేసిన చల్లనిగాలి గదిలోనికి ప్రవేశించి బిడ్డలకు హాయిగా వుంటుంది. ఉల్లిపాయను మధ్యకు కోసి ఆ చెక్కలను, బిడ్డలను పడుకో బెట్టిన స్థలమునకు 4, 3, అడుగుల దూరములో 4, 5 ఉల్లిచెక్కలను పెట్టవలెను. అట్లుపెటిన ఉల్లిపాయనుండి వచ్చిన ఘాటు గాలిలోకలసి పసిపిల్లలకి వడదెబ్బ తగుల కుండా చేయును. కొన్ని గంటల పిమ్మట ఉల్లి చెక్కలు వడలిపోవును. వేసంగి వెళ్లు వరకు ఇట్లు ప్రతిరోజూ చేయుటవలన నోరు లేని పిల్లలను వడదెబ్బ బారినుండి తప్పించిన వారమగుదుము. పెద్దలకు 'మజ్జిగ' యిచ్చి నట్లుగానే ఒక నెలపిల్లల దగ్గరనుండి, 7, 8 సంవత్సరముల పిల్లవరకు, ఖర్జూరపు రసమునుగాని, యెండుద్రాక్షపండ్ల రసమును గాని యిచ్చుట చాలామంచిది.

ఉదయమున, 5, 6, ఎండు ఖర్జూరపు కాయలను చితుకగొట్టి, పుచ్చు, పురుగులు లేకుండా చూచి, ఒక శుభ్రమైన కప్పు నీటిలో నానవేసి, మధ్యాహ్నము నుంచి యెండ సమయములో రసము వేసి బిడ్డలకు పట్టిన వడ దెబ్బకు తట్టుకుందురు లేక యెండుద్రాక్ష పండ్లను కూడా పై విధముగానే చేసి యివ్వ వచ్చును. ఇటిచ్చుటవలన, పిల్లలు యెండలకు చిక్కి పాడైపోకుండా వుండెదరు. రక్త పుష్టి ఆరోగ్యమూను. పెద్దలకుకూడా చాలా మంచిది. ఇట్లు ఈ రసమును, ఒక నలభై రోజులు తప్పక పుచ్చుకున్న యెడల మలబద్ధము, గుండెదడ, కడుపులో మంట మొదలగు వ్యాధులు కూడా గుణమిచ్చును.

దోమలు చాలా యెక్కువగా వున్న సమయంలో కూడా ఒక పళ్లెములో ఉల్లిపాయముక్కలను వేసి ఒక చోట వుంచిన దోమలు ఆ ఉల్లిపాయలమీద వ్రాలి ఆ ఘాటుకు చనిపోవును. ముఖ్యంగా యెలక్ట్రిక్ దీపాలువున్నవారు, మురికికాలువలు ఇంటికి దగ్గరలోవున్నవారు ప్రతిరోజూ ఇట్లా దోమల బాధనుండి తప్పించుకొనవచ్చును. ★

★ వంటలు ★

'వేపపువ్వుతో'

వేపపువ్వు వంటికి చాలా మంచిది. ముఖ్యంగా ఈ పువ్వు ఉగాది పోయిన పది పదిహేను రోజులలో, పెరిగి కాయగా మారే సమయంలో కోసివెయ్యాలి. కోసినదానినుండి ఈనెలు తీసివేసి చింతపూవువలెనే చేట యందు వేసి నలిపి చెరిగివేయాలి. మొగలు మిగిలిపోయి పువ్వు విడిగా వచ్చివేస్తుంది. దానిని బాగా ఎండబెట్టి పరిశుభ్రమైన ఒక డబ్బాలో వేసి గట్టిగా మూతవేసినచో సంవత్సరంవరకు నిల్వవుంటుంది.

ఇక ఈ పువ్వును వాడే విధానం పరిశీలిస్తే అటు వంటకాలకు, ఇటు వైద్యానికి కూడ పనికి వస్తుందని స్పష్టమవుతుంది. ఆ ఎండిన పువ్వును నేతితో గాని, డాల్డాతో గాని ఎఱ్ఱగా వేయించి కొంచెము జీలకఱ్ఱ కారముతో కలిపి అన్నములో వేసుకొనిన రుచితోపాటు ఆరోగ్యకరంగా వుంటుంది.

పచ్చి పువ్వుతోనే కాకుండ ఎండిన పువ్వుతో కూడ పచ్చడి చేసుకోవచ్చు. చింతపండు పులుసులో తగినంత బెల్లము, ఉప్పు, పసుపు పోపుసరకు వేసి వేయించిన వేపపువ్వు తగుమాత్రంగా కలిపి పచ్చడి చేసుకోవచ్చు. ఎక్కువ పువ్వు వేసినచో పచ్చడి చేదుగా వుంటుంది. ఇది ఎంతో ఆరోగ్యకరమైనది. పథ్యానికి కూడ పనికి వస్తుంది.

అటాగే వేపపువ్వు చారుకూడ కాచుకోవచ్చు. తగుమాత్రం చింతపండు, ఉప్పు, బెల్లము, పసుపు, నీళ్ళు ఒక రాచిప్పలోగాని స్టెయిన్‌లెస్‌స్టీల్ గిన్నెలోగాని వేసి కాచవలెను. అది మరిగిన తరువాత చారుపోపులో ఒక చిటికెడు నేతితో వేయించిన (ఎండిన) వేప పువ్వును కలిపి చారులో వేసి దానిని నిత్యము ఉపయోగిస్తే చాల ఆరోగ్యంగా ఉంటుంది.

పైత్యం, అరుచి, అజీర్తి వంటి వాటికి ఈ పువ్వుతో తయారు చేసిన 'మురబ్బా' నిత్యము వాడితే కొన్ని దినాలలో ఆ బాధ తప్పుతుంది. పంచదారతోగాని, పటిక బెల్లముతోగాని మిఠాయి పాకమును పట్టి నేతితో ఎఱ్ఱగా వేయించిన వేప పువ్వును ఆ పాకములో వేసి బాగా కలియునట్లు కలిపి స్టెయిన్‌లెస్ స్టీలు పేటులో వేసి ఆ వేడి మీదనే ఆ పాకమును ముక్కలుగా జేసి ఒక సీసాలో వేసి గట్టిగా వేసుకోవాలి. ప్రతి ఉదయం పరగడుపున ఒక్కొక్క ముక్క చొప్పున తీసుకుంటే ఒక వారంరోజుల్లో యిది మంచిగుణాన్నిస్తుంది.

—తటవర్తి రామలక్ష్మి, జగ్గన్నపేట]

* * *

గోధుమ లడ్డు గారెలు

ఒక శేరు గోధుములు(ఎఱ్ఱవి) బాగుచేయవలెను. మంచినీళ్లలో 4 గరిటెలు మినపప్పు నానవేయవలెను బాగా నానిన తరువాత బాగా కడిగి బుట్టలో వేయవలెను. నీళ్లు బాగా కారిపోయినతరువాత రుబ్బురోలులో బాగా, గారెపిండిలా రుబ్బవలెను. కావలిస్తే, కొత్త ఉప్పు, అల్లం, పచ్చిమిర్చి వేసుకోవచ్చును. తరువాత గారెవలె గుండ్రముగా చేసుకొని నూనెలో గాని, నేతిలో గాని వండుకొన్న గోధుమగారెలు తయారగును. చాలా రుచిగావుండి, పుష్టి కలిగించును. మామూలుగా రుబ్బి గారెలా లేక వుండలవలె తయారుచేసి పంచదార పాకము లేక బెల్లం పాకము పట్టి అందులో కూడా వేసుకోవచ్చును. వుండలుగా చేసుకుంటే గోధుమ లడ్డు అగును. రుచిగాను వుంటుంది. వంటికి బలమైన ఆహారం. పిండివంట నిల్వవుండును.

—ఇవటూరి శ్యామలాదేవి, తెనాలి]

* * *

పూర్ణపు వంకాయ బజ్జీలు

సవాశేరు లేతవంకాయలు, చిన్న చిన్నవి ఏరుకోవాలి. వాటిని తొడిమ తీయకుండా నాలుగు పక్షాలు (గుత్తివంకాయకూరకు తరిగినట్లు) చేయాలి. మరీ చివరదాకా చీల్చకూడదు. గిన్నెలో కాయలు మునిగేటట్లుగా నీళ్ళుపోసి కొంచెం ఉప్పు వేసి ఉడకబెట్టాలి. కాయలు మెత్తబడినతరువాత చిల్లుల పళ్లెంలో కుమ్మరిస్తే నీరు ఓడిపోతుంది.

చారెడు నువ్వులు, చారెడు గసగసాలు, చిన్న పచ్చి కొబ్బరిముక్క, కొద్దిగా అల్లం, రెండు చింతపండు రేకులు, తగినంత ఉప్పు వేసి మెత్తగా నూరాలి. ఆ ముద్దను కొద్ది కొద్దిగా ఈ వంకాయల్లో కూరి వుంచుకోవాలి.

పావుసేరు సెనగపిండిలో ఒక చారెడు బియ్యపుపిండి, ఉప్పు, కారం, చిటికెడు సోడా వేసి బజ్జీలపిండిమాదిరి కలుపుకోవాలి. బాణలిలో నూనె పోసి పొయ్యిమీద పెట్టి, మరిగిన తరువాత, ఒక్కొక్క కాయనూ ఈ పిండిలో ముంచి తీసి, బజ్జీలలాగే దోరగా వేయించుకోవాలి.

—తెన్నేటి అహల్యాదేవి, హనుమకొండ]

★

వనితా వాణి



విద్యార్థినుల దుస్తులు

"నేనింక కాలేజికి పోనమ్మా" అను వ్యాసము వ్రాసి నేటి విద్యార్థినుల విపరీత నాగరికత పద్ధతులలో అలంకరణలను వెల్లడి చేస్తూ దానివలన కలుగు దుష్ఫలితములను నేటి యువతులకు తెలియజేసిన శ్రీమతి బి. లీలగార్కి నా అభివందనములు. లీలగారు విద్యార్థినుల అలంకరణకు కొన్ని నిబంధనలు విద్యాసంస్థలు చేస్తేమంచిదనే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. విద్యార్థినులే కాక ఉద్యోగాలలో ఉండే స్త్రీలు కూడా విపరీత పద్ధతులతో అలంకరణ చేసుకొని పురుషులమధ్య తిరుగుచుండటము తరచు మనము చూస్తుంటాము. ఐతే ఇతర ఉద్యోగాలలో ఉండేవారు అలాంటి అలంకరణ చేసుకున్నందువల్ల విద్యార్థునులవలె బాధపడవలసి వస్తుందేమోగాని, ఉపాధ్యాయిని వృత్తిలో ఉన్న యువతులు అలాంటి అలంకరణచేసుకొనిన యెడల వారిని చూచి లేత హృదయములుగల ఆడపిల్లలు చిన్నతనము నుండియే ఆ అలంకరణచూచి మోజుపడి నేటి కాలేజి యువతులవలె తయారవుతారనుటలో సందేహములేదు. ఇప్పటి కాలేజి విద్యార్థుల్లో కూడా సగముమంది అలా తయారయినవారంటే అతిశయోక్తి కాదు. కావున ప్రభుత్వము అధ్యాపక వృత్తివంటి ఆదర్శవృత్తులలో యున్న యువతులనైనా (అందరూ ఇలా ఉంటున్నారని నా భావం కాదు) ఇలాంటి అలంకరణ చేసుకొని స్కూలుకు రావద్దని ఉత్తరువులు చేస్తే రాబోయే కాలేజీలలో ఉన్నత పాఠశాలల లోని విద్యార్థులు కొందరైనా ఇలాంటి విపరీత అలంకరణకు లోను కాకుండా ఉండగలరని ఆశిద్దాము. ఇదే ఉద్దేశముతో పూర్వము పెప్సు("Pepsu") రాష్ట్రములో ప్రభుత్వముచే(ఇప్పుడు పంజాబులో ఉంది) ఇలాంటి ఉత్తర్వులు చేయబడినవి. మనరాష్ట్ర ప్రభుత్వముచేత కూడ అలాంటి ఉత్తర్వులు చేయించుటకు మన ఆంధ్రప్రదేశ్ శాసనసభ్యురాండ్రు ప్రయత్నించడం అవసరం.

—శ్రీమతి అయ్యదేవర వరలక్ష్మి,
వరంగల్, ఆంధ్రప్రదేశ్.]

కాలేజీలలో ఆడపిల్లలందరకు యూనిఫారమ్ డ్రెస్ అమల్లో ఉంచితే ఏ బాధా వుండదేమో!

—స్వర్ణకుమారి,
(అడ్డాడ-కృష్ణాజిల్లా.]

వ్యత్యాసం

మన వైపు అంటే ఆంధ్రలో కాలేజీలలోనూ, హైస్కూళ్ళలోనూ చదువుకునే ఆడపిల్లల సంగతులు వనితాలోకంలో చదువుతూంటే చాలాబాధగా వుంది. మేము ఎనిమిది సంవత్సరాల నుంచీ బెంగాలులోనే (కలకత్తా) వుంటున్నాం. ఇక్కడ కాలేజీలో చదివే ఆడపిల్లలూ మగపిల్లలూ చాలా స్నేహంగా వుంటారు. ఒకరినొకరు అవసరమైతే సహాయం చేసుకుంటారు. ఇంకా చెప్పాలంటే సోదరసోదరీ భావంతో మెలగుతారు. అసలు విద్యార్థులకు విద్యార్థినులను ఏడిపించాలనే ధ్యాసేవున్నట్లు కనపడదు. రాత్రి స్కూళ్ళువుంటాయి. పగలు వుద్యోగం చేస్తూ రాత్రి చదువుకొనేందుకు సదుపాయమన్న మాట. ఈ స్కూల్లో ఆడ, మగా అంతా చదువుతూంటారు. ఇది సాయంత్రం 6 మొదలు రాత్రి 9-30 గంటల వరకు వుంటుంది. కాలేజీ విడిచిన తరువాత తొమ్మిదిన్నరా, పదిగంటల రాత్రి పెళ్ళీడు వయస్సులోవున్న ఆడపిల్లలు ఇళ్ళకు పోతుంటారు. మగవాళ్ళూ వాళ్ళతోనే పోతూంటారు. కాని ఒక్కడుకూడా నోరెత్తడు. 12-3-58 ఆంధ్రపత్రికలో బి. ప్రేమలీల గారు 'అలంకరణనుబట్టి కాలేజీ కుర్రాళ్ళు ఆడపిల్లలను ఏడిపిస్తారని వ్రాశారు. ఇక్కడ విద్యార్థినులు ఎంత ఫాషనుగా అలంకరించుకున్నా అలాంటి ఇబ్బందులు ఉండవు. స్త్రీలను గౌరవించే విషయంలో మన ప్రాంతానికీ బెంగాలుకీ, చాలా వ్యత్యాసం కనపడుతుంది.

ఈ మధ్య మేము కాకినాడనుండి కలకత్తాకు వస్తున్నాము. అంతా పదిపదిహేను మందిమి ఆడవాళ్ళం. ఆడవాళ్ళ పెట్టెలో జాగా లేక మగవాళ్ళ పెట్టెలో ఎక్కాం. అందులో ఒకవైపు బెంచీమీద నలుగురైదుగురు మగవాళ్ళు దానికెదురు బెంచీమీద ఒకాయన కూర్చున్నారు. ఈయన కూడా ఆ నలుగురు కూర్చున్న బెంచీమీదా కూర్చుంటే మేము ఆడవాళ్ళమంతా ఒక బెంచీమీద కూర్చోవచ్చునన్న వుద్దేశ్యంతో నేను "అయ్యా, మీరుకూడా అవతల బెంచీమీద కూర్చుంటే మేము ఆడవాళ్ళం అంతా దీనిమీద కూర్చుంటాము. కొంచెం లేస్తారా?" అన్నాను. దానికా పెద్దమనిషి ఏమన్నాడో చూడండి. "అంత మొహమాటమువున్న వాళ్ళు ఆడవాళ్ళ పెట్టెలోనే ఎక్కకపోయారా!

ఇందులో ఎందు కక్కర్లేదు?" అన్నాడు. ఇలా వుంటుంది మన వ్యవహారం. అదే ఇక్కడైతే మనం బండీ ఎక్కగానే ఆ కూర్చున్న పెద్దమనిషొక్కడూ అవతల బెంచీమీదకు వెళ్ళి మనకు జాగా చూపిస్తాడు. మనవాళ్లని దూషించడం నాఉద్దేశ్యం కాదు. మంచిఅన్నది ఎక్కడైనాసరే చూచి నేర్చుకోవలసిందేకదా. వనితాలోకంలో కాలేజీలో చదివే ఆడపిల్లల ఇక్కట్లు చదువుతూంటే మనవాళ్లకూ బెంగాలీవాళ్లకూ వుండే వ్యత్యాసంగురించి వ్రాయాలనిపించింది.

—వి. శారద, కలకత్తా]

'పాప' కు ఎన్నేళ్లు?

ఏప్రిల్ 2 ఆంధ్రపత్రికలో "అసలు పేర్లూ - కొసరుపేర్లూ" అన్న వ్యాసం బాగానే వున్నా, సాంతం చదివేసరికి ఒక చిన్న సందేహం వచ్చింది. అందులో రచయిత్రి, "మా పాపకి పుట్టినరోజనో, తొట్టిలో పెడుతామనో పేరంటానికి పిలుస్తాంటారు కొంతమంది. తీరా పేరంటానికివెళ్ళి చూసే ఐదారుగురు పిల్లలతల్లయి వద్దూ పొడుగూ కలిగి, అమ్మమ్మలా కన్పించే వ్యక్తే పాపని తెలుసుకున్నప్పుడు ఆశ్చర్యంతో నోరు వెళ్ళబెట్టి చూస్తారు." అని వ్రాశారు. అంత పెద్దవాళ్ళకు పాప అని పేరువుండడం కద్దుగాని, ఎక్కడయినా అంత పెద్దవాళ్ళని తొట్లో పెడ్తారా అని సందేహంవచ్చింది. అదీగాక, అంతపెద్ద వాళ్ళకి పుట్టినరోజని పేరంటానికి పిలుస్తారా? అది సినిమాస్టార్లకే చెల్లుతుందేమోగానీ, ఇంతవరకు అలాంటివాళ్ళని తొట్లో పెడతామనిగానీ, పుట్టినరోజనిగానీ పిలువడం వినలేదు, కనలేదు. రచయిత్రి యికమీదట వయినా యిలాంటి లోటుపాట్లని సవరించుకుని వ్రాస్తే బాగుంటుంది.

—కుమారి ఆరాధ్యుల లక్ష్మి,
చెన్నూరు — కడపజిల్లా]

మీకు తెలుసా?

వనితాలోకంలో గృహవైద్యాలు చాలామంది సోదరీమణులు వ్రాస్తున్నారు. ఇవి చాలామందికి ఉపయోగిస్తున్నా యనుకుంటాను. నాకో వైద్యం విషయం తెలియచేసారా అని ప్రార్థిస్తున్నాను. వేడిచేసి ఒంటికాలి నొప్పి అని వస్తూంటుంది. ఒక్కొక్కప్పుడు రెండు కాళ్ళూకూడా తెగ వాచేస్తాయి. అస్తమానం వేడిచేసినప్పుడల్లా వస్తుంది. దీనితో చాలా బాధగా వుంటుంది. దీనికి ఏదైనా వైద్యం చెప్తారని ఆశిస్తున్నాను.

—డి. వి. రమణ, గూడూరు]

'వచ్చినవీ-నచ్చినవీ'

మార్చి 19 వ తేదీ పత్రికలో పి. కోటేశ్వరిగారు వ్రాసిన సగ్గుబియ్యపు బూంది చేసినాను. మిక్కిలి రుచికరముగానున్నది. వారు చెప్పినప్రకారం చేశాను. కాని నేతిలో వెయ్యగానే బియ్యం ఇల్లంతా చిందాయి. వెంటనే మూతవేసినాను. మిగతాది వారు చెప్పినట్లుగానే చేశాను. చాలా రుచిగానున్నవి. చేయబోయే సోదరీమణులు మూతపెట్టుట మాత్రం మరువవద్దు. ఇలాగే మన 'వనితాలోకం' ద్వారా మనకువచ్చిన-నచ్చిన పిండివంటలు కుట్లు వగైరాలు పంపుచున్న ఎడల మన వనితాలోకం దినదిన ప్రవర్థమానమై విరాజిలును.

ఏ సోదరీమణికైనా దోమతెరబట్టపై ఎంబ్రాయిడరి చేసే విధానం తెలిసినచో 'వనితాలోకం' ద్వారా తెలియజేయ ప్రార్థన.

—వేదాంతం విశాలాక్షి, పెదప్రోలు]

* * *

జంగా విజయలక్ష్మిగారు వ్రాసిన మగువలు; మర్యాదలు వ్యాసం చక్కగా వుంది. 'ప్రతిమనిషీ కూడా అప్పుడప్పుడు ఆత్మవిమర్శన చేసుకుంటూ ఉండడం ఉజ్వల భవిష్యత్తుకు దారితీస్తుంది' అనే వాక్యం అక్షరాలా నిజం అనిపిస్తుంది. ఈ పత్రికలోనే (9-4-58) కె. లలితాంబగారు రాసిన 'నిదానంలేని వాగ్దానం' కూడా చాలా బాగుంది. ఆవిడ రాసింది అక్షరాలా నా విషయంలో జరిగింది. అందుకే ఈ రోజుల్లో ఒకళ్లమీద ఆధారపడి ఉండడం మంచిది కాదేమో. మన ప్రయత్నాలు మనం ఏ విషయంలోనైనాసరే చేసుకోవడం మంచిది.

—ప్రభల వెంకటేశ్వరరావు, పూనా]

ఉన్న మాటంటే

ఎం. ప్రభావతిగారు వ్రాసిన అప్పు చేసి పప్పుకూడు అనే వ్యాసం చాలా బాగుంది. సాధ్యమైనంత వరకూ ఉన్న దాంతోనే గడపాలి, మరీ గత్యంతరం లేకపోతే అప్పు అడిగి తీసుకున్నా త్వరగా తెచ్చి ఇస్తే ఇచ్చిన వెంటనే ఇచ్చారు కదా యని అనిపిస్తుంది. అప్పు అడిగితీసుకొని అడిగించుకొని విసిగించి మరీ ఇస్తారు. ఇన్ని రోజులయినది ఇవ్వలేదని అడిగితే ఎక్కడికైనా పారిపోతామనుకున్నారా? అని సమాధానమిస్తారు. మర్యాదస్థులు దెబ్బలాటంటే భయముకలిగినవారయితే నలుగురూ చూచి నవ్వుతారన్న సిగ్గు

★ దగాపడిన తమ్ముడు ★

(27-వ పేజీ తరువాయి)

వచ్చింది. అంచేత ఆరువు లేదన్నాడు. అంచేత యేమీ తోచక పూరుబందుట వేప చెట్టుక్రింద కొడుకును పట్టుకొని కూర్చున్నాడు. ఇంటికివెళ్లే వస్తు. అక్కడవుంటే కొడుకునుచూస్తూ నిరాశతో మనసునిండుకపోతోంది. మాటిమాటికి రాత్రిపీసకు జరిగిన పరాభవమే జ్ఞప్తికివస్తోంది.

ఆ రాత్రి నీలి అడిగింది "బెంగగా అగుపిస్తున్నావు. మనసులో ఏంవున్నాది?"

"ఏమీ లేదులే" అన్నాడు.

అప్పుడు మళ్ళీ ఏ ప్రశ్నా వెయ్యలేదు. ముసలమ్మ లేకపోవటం యేదో వెలితి కనిపిస్తోందని ఒకటి రెండుసార్లు పుల్లయ్యే అన్నాడు. అలా ఒంటిమీద అయ్యా చేయి వుంటేగాని నిద్రపోని కొడుకు వేపు చూస్తుంటే, గతం అంతా జ్ఞప్తికి వస్తోంది. పుల్లయ్యకు-ఆ నాటి రాత్రి గరిడీ! ముసలాడిగా లేని ముసలాడు ఏమన్నాడు? "నా కొడుకు-ముచ్చటగా ముద్దుగావున్న పాపడు నాలాగే గెరాగిరజాలు పెడ్తాడు. నలుగురిలో మెప్పు తెస్తాడు! దేనికీ జడడు! నా కొడుకు...నా కొడుకు..."

అలా చేతిని నిమిరాడు. కొడుకు ముఖం ఆ లేతబుడ్డీ దీపపు వెలుగులో ఎంత ముచ్చటగా కనిపిస్తోంది. "నా కొడుకుని గరిడీలో ఘటుకుడ్ని చేస్తాననుకున్నాను. దొంగల్ని పట్టేదొరని చేస్తానని-దొసిళ్ళతో దానం చేస్తాడని...పుట్టెని నమ్మి సెమటకార్చి మా వరువు నిలబెడ్తాడని...అంతయేతుకు యోగి కాను? నా కొడుక్కి యేంవుంచాను? ఒంటిమీదగుడ్డపాతి లేదు-కడుపునిండుగా గంజైనా లేదు! బువ్వ బువ్వని యేడుస్తూనే పడున్నాడే...నా అయ్యా..."

అలా దుఃఖం యీ తలపులతో ముంచుకురాగా ప్రక్కనే చేరబడి కొడుకును చేరదీసికుంటూ పడుకున్నాడు.

కొంతసేపటికిగానీ కళ్ళల్లో తడి తుడుచుకోలేదు. ఆ సమయానికి నీలి కూతుర్ని నిద్దరపుచ్చి దగ్గరగావచ్చింది.

"ఏం అలాగ వున్నావు?"

జవాబు లేదు.

"నాలాగ నివ్వెలాగవుంటావు? ఏనాడు ఆకలంటే నీకు తెలిసొచ్చేదా? కష్టాలంటే నీకు యేంతెలుసును? అందుకే అలాగ గాబరాపడిపోతున్నావు. కొన్నాళ్ళు కష్టాలుపడితే నీకూ ఓర్పువస్తాది. ఇప్పుడు మనకంటే యెవురు సుకపడ్తున్నారులే!"

ఈ చివరి వ్యాఖ్యానంతో పెళ్ళంవేపు వింతగాచూసాడు. ఆమె చిన్ననవ్వునవ్వి మొగుడు వేపుచూస్తూ "ఎవురికితగ్గ కష్టాలు వారికీఉన్నాయ్. మనకి పొలంలేక ఒకపూట ఉంటే ఒకపూటలేదు. మరి ఆదెమ్మకు తినడానికేంలోటు? ఆ కడుపునొప్పితో బుక్కెడుగంజి తాగగలుగుతోందా? ఏమైనా యేకష్టాలైనా యెంతకాలం వుండిపోతాయి. ఇవిగో తొలగుతాయి. ఒళ్ళు గట్టిగా వుండగా మనకేలభయం?"

అప్పటికీ పుల్లయ్య మాటాడలేదు. పరిస్థితి పోల్చుకున్న నీలిదగ్గరగా జరిగి "మామ్మ చెప్పింది! సెయ్యకాలితే కుండయేత్తేసావని! నా మొగుడు అంతదయిరం లేనోడా? ఆ దయిరం నీలోకి యెప్పుడొస్తాదంటే నలుగురిలో నీ మంచీనూ సైనే! అందరిలోనూ మంచి సెడ్డా రెండూవుంటాయి. నివ్వు యిదివరకు ఆలలోని మంచే తీసుకొనేవోడివి—యిప్పుడు సెడ్డతీసుకుంటున్నావు. అప్పుడు నీ మనసుయెంత బాగుండేది—ఒకోపూట గరిడీసరదాలో తిండిమానేసేవోడివి! అప్పుడెలాగ ఉన్నావు. ఇప్పుడు ఒకపూట లేకపోతే బెజారెత్తిపోతావు! ఎంచేత? నాకెప్పుడూ యెలాగ బ్రతుకుతామని పిరికి లేదుసుమా?"

పుల్లయ్య చల్లగా మెల్లగా చెప్పతున్న పెళ్ళంతో ఒక్కసారి "పీసలాంటోడే దొంగయితే..."

నీలి సెమ్మదిగా నవ్వింది "అవును తప్పెవరిది? పీసదే! పిల్లలున్నారు—నా గవుర్నమెంటోడు, పెద్దయితే నా పిల్లనిమూడడా అని—పెద్దోడ్ని సగంసదివించి పనీపాటుకి పనికిరాకండా సేసాడు! ఆడు కలెక్టేరు యెప్పుడైపోతాడు? మరి సీనోళ్ళకి యెవరి కింద కంబారుగాయేసినా యేడాదికి పదిపుట్లు దాన్నం తెచ్చుందురు."

"అదే సెప్పినావు? అంతబతుకు బతికాడు..."

"అయితే యిప్పుడు యిలా సచ్చిపోవటం మంచి దంటావా? వచ్చేయేడు మలు నలుగురి పశువులు మంద కాయడా? నివ్వు పెద్ద రైతుయింట్లో సేరావంటే యిరవైపుట్లు కొలవడా? ఏం సేసుకుంటారు?"

పుల్లయ్యకు పౌరుషంవచ్చి "నానా! పానుర్లో బిచ్చం యెత్తుకుంటాను గానీ జాతోడింట్లో నాకరీకి కుదురుతానే!"

అభినయంతో "అలాగంటే యెలాగ?" పడుకున్నవాడు చప్పున లేచి "నాను పెద యింటోడిని-పెద్దబతుకు బతికాను- వూర్లో పెద్దగానే వుంటాను. అసలు నీనుంచే ఆల పనిపాటకి యెత్తున్నానుగానీ...నాకు యీ కూలిపని అబ్బితే- నాకొడుక్కి అదే అబ్బతాది! పశువులుకాసే దద్దమ్మని సేసావా నా కొడుకిని? ఆడుదొంగల్ని పట్టే దొరౌతాడు? నా పేరు వూరిపేరూ నిలబెడ్తాడు!"

"అవును- ముందుతిని బతకాలా? సెటు పువ్వుపూసి కాయలు కాయాలంటే భూమిలో గత్తం వెయ్యాలా వద్దా? నీకు అంత పౌరుషం కొఆగాదంటాను".

పుల్లయ్య లేచి నిల్చున్నాడు. కడుపు మంటకు యీమాటలు మరింత రాజింపాయ్. ఇటూ అటూ అయిపోతూ "మా వంశం పౌరుషం గలవంశం- నాను పౌరుషంలోనే పుట్టాను- పౌరుషంతోనే సస్తాను. నీలీ! అలా సచ్చిపోతాను గానీ...దొంగతనం సెయ్యనే...అడుక్కోనే......!"

ఆవేశంతో మాటలు వేగంగా గట్టిగా రావటంతో మలు "బువ్వ" అంటూ లేచి కూర్చొని యేడుస్తున్నాడు. పుల్లయ్య చప్పున కూర్చుని కొడుకుని పరుండబెట బోయాడు. కానీ "అమ్మా బువ్వే!" అంటూ కళ్లునులుపుకొని యేడుస్తున్నాడు.

నీలికతుం వుబికి పొంగిపోయింది కానీ కొడుకు అయిదేళ్ళవాడిప్పుడు ...రెండేళ్ళ క్రితమే యీపరిస్థితి వస్తే కొడుకు ఆకలి తీర్చేది! పుల్లయ్య ప్రక్కకు తిప్పుకున్నాడు. పడుకోబెట్టి యిద్దరిచేతులూ కొంతసేపటివరకూ వీపుమీద మెల్లగా పడితేగానీ మలుకు నిద్దరపటలేదు. అంతసేపూ ఒకరిముఖాలు ఒకరు చూసుకున్నారు. పుల్లయ్యచివరికి అన్నాడు "ఇంక మిగిలింది ఆ కంచమే... రేపు పొద్దున్న యిచ్చి" అన్నాడు. నీలి మౌనందాల్చింది.


[ఇంకావుంది]

వనితావాణి

చేత బోతేపోయిందని పూరుకోవాలి.

—యం. కుసుమాంబ, తాడేపల్లిగూడెం]

శ్రీమతి ప్రభావతిని అభినందిస్తూ ఇంకా ఈ క్రిందివారు ఉత్తరాలు వ్రాశారు: వి. వెంకట లక్ష్మమ్మ (కడప), కె. లీల (విజయవాడ), కె. తాయారు (గుడివాడ), న్యాయపతి రామదాస్ (బరంపురం), జానకి (బందురు), కె. గిరిజ (బళ్ళారి), ఎం. సీతాదేవి (ములుగు) చింతలపల్లి పార్వతీదేవి (పానుగపాడు.) ★



★ యుక్తి ★

పెన్నూరను గ్రామములో
ఉన్నాడొక పేదవాడు
పొట్టిలింగ మతనిపేరు
'పొట్టి'యంచు పిలుతురతని.

శివుని గూర్చి తపముజేసి
పేదరికము బాపుకొనగ
పయనమయ్యె అడవిలోకి
పొట్టిలింగ మొక్కనాడు.

పొట్టిలింగ మడవియందు
చెట్టుక్రింద కూరుచుండి
తిండిలేక కొన్నినాళ్లు
ఘోరంబుగ తపముజేసె.

భూతేశుం డొక్కనాడు
ప్రత్యక్షంబై వెంటనె
"ఒక్కవరం కోరుకొనుము"
అని యడిగెను పొట్టివాని.

పొట్టివాడు సంతసించి
కోటిధనము కోరబోవ
పిల్లవాణ్ణి కోరుమనిన
ఆలిమాట జ్ఞప్తివచ్చె.

"ఒక్కవరము కోరుమనుచు
శంకరుండు ఆజ్ఞనిచ్చె!
ఎట్లా"యని మనసునందు
చాలతడవు యోచించెను.

యోచించగ నతని కొక్క
చక్కనైన యుక్తి తట్టె.
కోర్కెలన్ని ఒకటిజేసి
పరమేశుని అడిగెనిట్లు:

"బంగారపు తొట్టిలోన
నాదుబిడ్డ ఊగుచుండ
ధనరాసుల భోగముతో
చూచుభాగ్య మిమ్ము ఈశ!"

పొట్టివాని యుక్తికపుడు
పరమేశుడు సంతసించి
"అలాగే వరమిచ్చితి"
అనియంటూ మాయమాయె.

చూచితిరా! బాలలార!
ఒక్కవరముతో నతండు
సిరియు శిశువు కల్గునట్లు
యుక్తిచేత కోరుకొనెను. ★

నా ప రా మ య్య

పరీక్షపేపర్ల దొంగలు

"మాష్టారూ...అయ్యగారు అర్జంటుగా మిమ్మల్ని పిలుచుకొని రమ్మన్నారండి" అని చెపుతూ, చేతులు పిసుక్కొంటూ నమ్రంగా నిలబడిన బంట్రోతు సూరన్న కేసి చూచి, మనసులో "ఏ మొచ్చి పడిందో, వారం రోజుల్కితమే నేను స్కూల్లో చేరింది; నాతో యీ రాత్రి ఎనిమిది గంటలప్పుడు యేం పనో; ఉదయం యెలాగైనా స్కూలుకు వెళ్ళుతానుగా!...... జరుగుతైన పనేమిటో కనుక్కోవాలి" అనే కుతూహలంతో బయలుదేరాడు మోహనరంగం.

మోహనరంగం రాగానే, డ్రాయింగ్ రూమ్‌లో పేముకుర్చీలో కూర్చోమని, ఎదురుగావున్న రోజ్‌వుడ్ కుర్చీలో ఆసీనుడయ్యాడు హెడ్మాష్టర్ శ్రీధర్.

"ఎలా వుందండి మీ కీవూరి వాతావరణం, అదీను? స్కూల్లో అంతా బాగుందా?" అని ఆప్యాయంగా అడిగాడు శ్రీధర్.

"ఊరికే ముందండి? అన్ని విధాలా సదుపాయంగానే వుంది. స్కూల్లో పిల్లలు కొంచెం రౌడీ మూకలాగున్నారు. నిన్న ఒక అబ్బాయి 'సైన్సుపేపర్ తయారు చేసి యిచ్చేశారా సార్?' అని బహిరంగంగా క్లాస్‌లోనే అడిగేశాడు. పిల్లల ప్రవర్తన మాత్రం కొంచెం విచ్చలవిడిగా వున్నట్లు వుందండి" అంటూ నసుగుతూ చెప్పాడు సైన్సు మాష్టారు మోహనరంగం.

"పిల్లల పోకిరీతనాన్ని ఇట్టే తెలుసుకొన్నారే! మీలో పరిశీలనాశక్తి, కార్యదీక్ష వుందని గ్రహించే మిమ్మల్ని పిలిపించా" నన్నాడు శ్రీధర్.

"నా పరిశీలనాశక్తికి, యీ పిలుపుకు సంబంధం యేమిటండీ.?" అని సూటిగా ఆత్రంతో అడిగాడు మోహనరంగం.

"వస్తున్నా, అసలు విషయంలోకి. మీకు తెలిసే వుండొచ్చు, మన పాఠశాలలో గడచిన సంవత్సరాలలో వార్షిక పరీక్ష ప్రశ్నాపత్రాలు తప్పకుండా బట్టబయలయిపోతున్నాయని. రెండేళ్ళ క్రితం ప్రశ్నాపత్రాలు బహిరంగమైనందుకు మనమిషన్ వారి ప్రెస్ ఫోర్‌మెన్ కారణమని అతన్ని వుద్యోగం నుండి బర్తరపుచేశాము. గత సంవత్సరం, మేమంతా తర్కించి, తర్కించి, ప్రశ్నాపత్రాలను మద్రాసులో ఒక ప్రవేట్ ముద్రాక్షరశాలలో ముద్రణ కిచ్చాము. పరీక్షలు వారం రోజులున్నాయనగా నేనే స్వయంగా ఒకరోజు రాత్రికి రాత్రి కార్లో వెళ్ళి, ప్రెస్ యజమానికి ప్రత్యేకమైన సలహాలిస్తూ, క్వెశ్చన్ పేపర్ల ప్యాకెట్టులను అందిస్తూ, అతిరహస్యంగా పేపర్లను ముద్రింప చేయమని కోరాను. "అతి రహస్యం బట్టబయలు" అన్నట్లు, గత సంవత్సరంకూడ పేపర్లు బయటపడ్డాయి. రహస్యం ఎలా బయటికి పొక్కిందని అందరం ఆశ్చర్యపడ్డాము. పట్టుమని యిక పదిరోజులు లేవు పరీక్షలు. దగ్గిరకొస్తుంటే నాకు ఆందోళన యెక్కువౌతోంది. ఎలాగైనా యీ మారు ప్రశ్నాపత్రాలను గుట్టుగా వుంచాలని, బయటపడకుండా వుండేలా చూడాలని నా ఆశయం. నేను యోచించి, యీ విషయం గూర్చి చర్చించుటకూ, దీనిని సమగ్రంగా పరిశీలించి ప్రశ్నాపత్రాలు వెల్లడి కాకుండా అరికట్టే మార్గం కనుగొనేందుకు ఒక సలహా సంఘాన్ని నియమించాను. మిమ్మల్నికూడ సభ్యుల జాబితాలో చేర్చాను. రేపు సాయంత్రం అయిదు గంటలకు యిక్కడే మా ఇంట్లో చర్చలు జరుపుదాం. తప్పకుండా మీరు హాజరు కావాలి. ఈ సభ గూర్చి కూడ గుప్తంగా వుంచాలి. ఇది చెప్పేందుకే మిమ్మల్ని పిలిపించాను. మీరింక వెళ్లొచ్చు"నని పెద్ద వుపన్యాస మిచ్చాడు శ్రీధర్.

"అలాగేనండి" అంటూ సెలవు

పుచ్చుకొని వెళ్లిపోయాడు మోహనరంగం.


మర్నాడు సలహా సంఘం సభ. సభ్యులయిన మోహనరంగం, డ్రిల్ మాష్టర్ చిట్టిబాబు, లెక్కల మాష్టారు జేకబ్ హాజరయ్యారు. కార్యక్రమం కాఫీతో ప్రారంభమయింది. తర్వాత అసలు చర్చలలోకి దిగారు. చిట్టిబాబూ, జేకబ్ యేవో సలహా లిచ్చారు. శ్రీధర్‌కి అవేమీ అంతగా నచ్చలే. తర్వాత మోహనరంగం, యోచించి వుంచిన పథకాన్ని వివరించాడు.

"నేను ఆచూకీ తీసినంతవరకు, ప్రశ్నాపత్రాలను మాష్టర్లుగాని, ప్రెస్‌వాళ్లుగాని బహిరంగపఱచడం లేదు. క్వొశ్చన్ పేపర్లను దొంగిలించడం ద్వారా అవి పిల్లలలో వెల్లడి అవుతోంది. దాన్ని అరికట్టడానికి నేనొక మార్గాన్ని కనిపెట్టాను. ఆయా సబ్జక్టులలో పేపర్లు పరీక్షకు ముందురోజు సాయంత్రమే తయారు చేయించి, మన డూప్లికేటర్ మిషన్ ద్వారా, పరీక్షకు అరగంట ముందుగా కావలసిన ప్రతులను తీయించి, పరీక్షల్ని నిర్వహిస్తే, బయటపడడానికి వీలుండ"దని ముక్తసరిగా ముగించాడు.

సంఘసభ్యులంతా యీ మార్గానికి ఏకగ్రీవంగా ఒప్పుకొన్నారు. శ్రీధర్ కూడ మోహనరంగం సలహాను మెచ్చుకొన్నాడు.

* * *

మోహనరంగమే రంగంలోకి దిగి తనే డూప్లికేటర్‌ను ఆపరేట్ చేస్తూ, రహస్యంగా హెడ్మాష్టర్ గదిలో, ప్రతులనుతీసి, మొదటిరోజు ప్రశ్నాపత్రాలని గదులలోని వాచర్లకు అందించాడు.



"ముద్దులొలికే పాప"
పోడూరి దివ్యప్రభాకర్, విశాఖపట్నం.

అదేమి కర్మమో కాని, ఫోర్త్ ఫారం ప్రశ్నాపత్రం బయటపడింది ఆ రోజు. పరీక్ష ప్రారంభమైన పది నిముషాల్లో, కాపీకొడుతుంటే పట్టుబడిన అయిదుగురు విద్యార్థుల దగ్గర దొరికిన మడిచిన స్లిప్పులలో పేపర్లోని ప్రశ్నలకు వరుసగా జవాబులు వ్రాయబడి వుండడం దీనికినిదర్శనం.

రెండోరోజుకూడ పేపర్లు తెలిసిపోయాయ్. ముందురోజుసాయంత్రం హెడ్మాష్టర్‌తో తను తప్పక డిటెక్టు చేస్తానని కోసిన కోతలు ఫలించలేదని మోహనరంగం మొహం ముడుచుకొన్నాడు. అయితే "పట్టు పట్టానంటే అంతు తేలేంతవఱకు నిద్రపో"నన్నాడు మళ్ళీ యీరోజు.

* * *

మూడోరోజు వుదయం ఏడు గంటలకు మురళిని, గోవిందరావును, పాఠశాల బంట్రోతు సూరన్నను పోలీస్‌స్టేషన్‌కి తీసుకు వెళ్తూండగా, పాఠశాల ఆవరణ ప్రాంతంలో చేరిన ప్రజలు మోహనరంగం మాష్టారి పట్టుదలను, పరిశోధనా శక్తినిగూర్చి, పొగడుతున్నారే గాని, విద్యార్థులు చేసిన చెడ్డపనిగూర్చి అంతగా అనుకోవడం లేదు.

పోలీస్‌స్టేషన్‌లో హెడ్మాస్టర్, పాఠశాల మాష్టర్లు, పురప్రముఖుల సమక్షంలో, సబ్ ఇన్‌స్పెక్టర్ మోహనరంగాన్ని, ఈ దొంగతనాన్ని యెలా కనిపెట్టారని ప్రశ్నించగా, మోహనరంగం నవ్వుతూ యిలా చెప్పుకు పోయాడు: "ఇది చాల సులువైన కేసు. నేను విద్యార్థులే చేతులు కలిపి పేపర్లను సంగ్రహిస్తున్నారని గ్రహించాను. మొట్ట మొదటిరోజు పేపర్ బయటపడింది. ఆరోజు రాత్రే స్కూలు పైమేడ డాబానుండి ఎనిమిది గంటలనుండి రాత్రంతా కావలా కాచాను. ఎవరూ స్కూలు ఆవరణంలోకి అడుగుపెట్ట లేదు. రెండో రోజు పేపరు బయటపడడం ఆశ్చర్యమైంది. తార్కికంగా యోచిస్తే, ముందు రోజు సాయంత్రం అయిదు గంటలకు సెట్ చేసి, గాడ్రెజ్ బీరువాలో వుంచిన, కవరులోని వ్రాత ప్రతిలోనే కీలకం వుందని, నిర్ణయానికొచ్చాను. నిన్న హెడ్మాష్టారితో చెప్పి, సూరన్నకు కూడా తెలియకుండా హెడ్‌మాష్టారి గదిలో కజ్జ బీరువా వెనుక నక్కి కూర్చొన్నాను. చీకటిపడగానే, ఆరుగంటలప్పుడు గది యెడమవైపు నుండే తలుపు తోసుకొని గోవిందరావు, మురళీ వచ్చారు. టార్చిలైట్ వేసి డూప్లికేట్ తాళాలతో గాడ్రెజ్ కప్ బోర్డును తెరిచారు. ప్రశ్నాపత్రాన్ని తీసి చదివి రాసుకొంటున్నప్పుడు, నాకు ప్రత్యక్షంగా పట్టుబడ్డారు. బంట్రోతు సూరన్న గాడ్రెజ్ బీరువాతాళం హెడ్మాష్టారి డ్రాయర్‌లోని డూప్లికేట్

పరీక్షాపత్రాల దొంగలు

తాళం చేతుల గుత్తిలోంచితీసి వీళ్లకి యివ్వడం, గది ప్రక్క తలుపు గడియవేయకుండా మూసి వుంచడం వీరి దొంగతనానికి దోహద మిచ్చాయి."

సబ్ యిన్స్పెక్టర్ "సూరన్నే దొంగతనానికి మార్గాన్ని చూపి, ప్రోత్సహించాడే!" నని చెపుతూ, అతన్ని లాకప్‌లోకి ఒక తోపు తోసి, మోహనరంగానికి గట్టిగా షేక్‌హాండ్ యిస్తూ, "అద్భుతమైన డిటెక్షన్"అని మెచ్చుకొన్నాడు. ★



జీవితం-చదువు

(11 వ పేజీ తరువాయి)

పరితలనుంచి ఏవిధమైన రెస్పాన్స్ వస్తుందో చూడవచ్చు.

"ఏమండోయ్ ఎందాకా వచ్చిందికథ?"

రామాయణంలో పిడకలవేట అంటే ఇదే! మంచి రసవత్తరఘట్టంలో చచ్చుప్రశ్నలో ప్రవేశించింది శ్రీమతి.

"ఒక్క అయిదునిముషాలు ఆగు. ఆఖరు ఘట్టంలోకి వచ్చాను."

"అప్పుడే ఆఖరుఘట్టంలోకి వచ్చారా?- ఇవ్వాళల్లా పట్టుందన్నారు మరి?"-ఆశ్చర్య పోయింది.

"కాంచెంఆగుదేవీ! నన్ను మాట్లాడించకు" విసుక్కున్నాను.

మొహం కందగడ్డ చేసుకుంది. సూర్యాస్తమయానంతరం ఆకాశం సంధ్యారాగం పులుముకున్నట్లు. ముక్కులో నే తుంచాలి గాని మానయిన తర్వాత నరుకుదామంటే వరాలు తెగుతయ్. రూపాయి వడ్డీమీద అనురాగం అప్పు తెచ్చుకుని విసవిసా ఇంట్లోకి పోయిన శ్రీమతిని కేకేశాను.

వచ్చింది. దగ్గరకురాలేదు. అల్లంత దూరాన గది గడపదగ్గర నిల్చున్నది 'ఏమిటా' అన్నట్లు. దేవి ప్రసన్నంకోసం అభిమానం తాకట్టుపెట్టి ఆప్యాయత తెచ్చుకున్నాను గొంతులోకి.

"అంతకోపమయితే ఎట్లా చెప్పు?"

శ్రీమతి మొహాన తారాడుతున్న సాంధ్య మేఘాలు విడిపోయి, చంద్రోదయమయింది. నల్లని కళ్ళలో పున్నమివెన్నెల ప్రతిబింబించింది. తెలని పలువరుస తళుక్కుమంది. నడిచివచ్చింది నవ్వులగవ్వలు కుమ్మరించుకుంటూ టేబుల్‌మీద కాగితాలు పేజీలవారీగా సర్దుతూ—

"అయిదునిమిషాల్లోఅయిపోతుందన్నారు కాబట్టి — ఇప్పుడెంతయింది, పదకొండేగా—పన్నెండున్నరకు 'సరస్వతీ'కి పోదాం. మంచి క్రైమ్‌పిక్చర్ —'హంతకుడు' ఏమంటారు? మాట్లాడరేం?"

పక్కింటివారిఅమ్మాయి పార్వతి ఎప్పుడు కొటిందో దాలిగుంటలోంచి పారిపోయిన కుక్క తిరిగి అక్కడికే చేరుతున్నది.

నాకు నవ్వువచ్చింది. ఇంకా దిగులుపడుతున్నాను, శ్రీమతి నా కాలాన్ని వృధా చేస్తున్నదేమోనని. అంత్యఘట్టంగురించి ఇక ఆలోచించాల్సిన అవసరంలేదు. రెండు నిమిషాల్లో వ్రాసేయగలను. శ్రీమతి నుంచి 'మేటర్' బాగా అందింది. కొందరు కోరకుండానే, తమకు తెలియకుండానే సహాయం చేస్తారు.

"త్వరగా ఆ మిగిలింది కాస్తా వ్రాసేసుకోండి! శుభస్యశీఘ్రం అన్నారు పెద్దలు"

"అవశ్యం..." ★

అమెరికన్ నటీనటులు

(6 వ పేజీ తరువాయి)

విశ్వవిద్యాలయ బృందంవారు నాటక ప్రదర్శనవల్లనైతేనేం, వారి ప్రవర్తనవల్లనైతేనేమి హైదరాబాదు పౌరుల హృదయాలలో ఒక స్థానం సంపాదించుకొన్నారు. తమ స్నేహభావానికి చిహ్నంగా భారతీయ నాట్యసంఘం (ఆంధ్రప్రదేశ్ శాఖ) నటరాజు చిత్తరువునొకటి వారికి బహూకరించింది.

అమెరికానుంచి చౌకగాదిగుమతి అయ్యే చౌకబారు భూతద్దాలకు బదులు, ఇటువంటి కళాకారుల బృందాలను తరుచు భారతదేశానికి పర్యటనార్థం రప్పించగలిగితే, అమెరికా భారతదేశాలమధ్య కరుడుగట్టిన విభేదాలు కరిగిపోతాయి కనీసం సాంస్కృతిక రంగంలో.

తుదిని ఒక్కమాట: ఈ కార్యక్రమ పరంపరతో ఆంధ్రప్రదేశ్‌లో థియేటర్ సెంటర్ చక్కగా పనిచేస్తుందన్న సంగతి వెల్లడిఐంది. నిర్వాహకులు, సహృదయులు, అనేకవిధాల సమర్థవంతులు. కాని ప్రచార సాధనాల విలువను వీరు పూర్తిగా గ్రహించినట్టులేదు. సికిందరాబాదు త్యాగరాజ గానసభవారు త్యాగరాజువలె నేనిష్కాములు వారికి ప్రచారం అవసరంలేదు. ప్రచారం ప్రమాదకరమని భావించే సంస్థలు కూడా నగరంలో లేకపోలేదు. అటువంటి సంస్థలపైనే పత్రికలు ఎక్కువ దృష్టిబరపడం తమ బాధ్యతగా స్వీకరిస్తాయి. భారతీయ నాట్య సంఘం అటువంటి సంస్థకాదు. అది చేస్తున్న ప్రయోజనాత్మకమైన కృషి ప్రజలకు తెలియాలంటే నిర్వాహకులు ప్రచారసాధనాల ఆవశ్యకతను గుర్తించడం అవసరం. ★

★ స్వతంత్ర వివాహము ★

(23-వ పేజీ తరువాయి)

వతి. ఈ ప్రశ్న విని తన్మయుడయ్యాడు శేఖర్.

"లేదు. నాకు యింకా వివాహము కాలేదు. నాకు యిష్టములేని అమ్మాయిని మా వాళ్ళు చెయ్యాలనుకొన్నారు. నేను అందుకు ఒప్పుకోలేదు"

"భేష్! చాలా మంచిపని చేశారు. నేనూ అంతే!...నాకు యిష్టము లేని సంబంధము మా వాళ్ళు చేసుకోమన్నారు. నేను అందుకు ఒప్పుకోలేదు. ఇంకేదైనా మంచిసంబంధము చూడటముకోసము మా నాన్నగారు వూరుకు వెళ్లారు. ఆయన చూసిన ఏ సంబంధాన్ని, నేను చేసుకోదలచలేదు. నేను మనసారా ఎవరిని ప్రేమిస్తానో వారినే చేసుకోదలచుకొన్నాను," అంది హేమావతి నవ్వుతూ శేఖర్ ముఖభావాల్ని ఓకంట కనిపెడుతూ.

ఆ మాటలతో శేఖర్ చాలా తృప్తి చెందాడు. శేఖర్‌కు ఆత్రం ఎక్కువ. ఈ సందర్భాన్ని వృధాగా పోనీయకూడదనుకొని, తనను ప్రేమిస్తోంది. కాబట్టే తనతో అంత చనువుగా వ్యవహరిస్తోందని అపోహపడి—

"మనిదరము వివాహము చేసికొందామా" అనేశాడు శేఖర్.

"వాట్!..." అంటూ తారాజువ్వలా లేచింది హేమావతి. ఏమౌతుందోనని శేఖర్ చాలా భయపడ్డాడు.

హేమావతి తనని ప్రతివిషయంలోను పరీక్షిస్తోంది. కాని అది గమనించేస్థితిలో లేడు శేఖర్ కొంచెము సేపు మౌనము వహించి మళ్ళీ మాటాడింది.

"ఏమిటి యీ అకస్మాత్తాలోచన? మీ టెన్నిస్ ఆటను చూసి మెచ్చుకొని, మీతో చనువుగావుండి, ప్రతిరోజు మీదగ్గర టెన్నిస్ ఆట నేర్చుకొనేటందుకు రావటమువల్ల మీరిల్లా మాట్లాడవచ్చునా? ఈ నవయుగంలో ఒక స్త్రీ ఒక పురుషుడితో చనువుగా ప్రవర్తిస్తోందంటే దానికి అర్థము ఆమె అతనిని ప్రేమిస్తోందనేనా? ఇదేనా మీరు చదువుకొన్నది? ఇదేనా మీరు తెలుసుకొన్నది? మీరు నన్ను పెళ్ళి చేసుకొనేటందుకు తగిన అంతస్తులేనివారని నేను చెప్పటములేదు. కాని నేనెవరో మీకు తెలుసునా? నా గురించి మీకేమైనా తెలుసునా? మన పెళ్లికి యీ పదిహేను రోజుల స్నేహమే చాలు ననుకొంటున్నారా?" అని కొంచెము తీవ్రంగానే ఖండించింది హేమావతి.

ఆమె మాటలు శేఖర్‌ను చిత్రవధ చేసినట్లయింది. అంత కోపము ఒక్క నిముషములోనే మాయమయింది. స్త్రీ హృదయం అంటే యిల్లాగే వుంటుంది కాబోలు అనుకొన్నాడు శేఖర్.

"క్షమించండి. తొందరపడి మీ మనస్సును నొప్పించాను" అన్నాడు శేఖర్.

"అనవలసినదేదో అనేశారు. ఫర్వాలేదు. మిమ్మల్ని నేను నమ్ముతున్నాను. నేను మీ విషయంలో కొన్ని వివరాలు తెలుసుకోవాలనుకొంటున్నాను. అవి పూర్తిగా తెలుసుకొన్నాక నేను తృప్తిచెందితే తప్పకుండా మిమ్మల్నే చేసుకొంటాను." అంటూ లేచింది హేమావతి.

ఆ నాటికి వారి సంభాషణ ముగిసింది. శేఖర్ వెళ్ళిపోయాడు.

*　*　*

4

"ఎవరీ హేమావతి?" ఎన్ని విధాల ప్రయత్నించినా శేఖర్‌కు సమాధానము దొరకలేదు. కనీసము ఆమె తండ్రిపేరు కూడా తెలుసుకోలేకపోయాడు. ఈ ప్రశ్నే అతనిని చాలా బాధిస్తోంది.

మామూలుగానే యింకొక నెల రోజులు టెన్నిస్ ప్రాక్టీసు జరిగింది. హేమావతి మాత్రము తనలో ఏమిమార్పు రానివ్వకుండా మామూలుగానే సంచరించింది. కాని శేఖర్‌ని "సిగ్గు" బాగా ఆవహించింది. అనేకసార్లు మాటలుకూడా తడబడ్డాడు. తననుగురించి విచారిస్తానందే, తన తల్లితండ్రులను కలుసుకొంటుందేమోనని చాలా భయపడ్డాడు. మరొక నెల గడిచింది.

ఒక రోజున టెన్నిస్ ఆట పూర్తయిన తర్వాత "మీతో కొంచెము మాట్లాడాలి. ఒకసారి యింటికి వస్తారా!" అని అడిగింది హేమావతి.

తన విషయంలో విచారణ పూర్తయింది కాబోలు. ఏమేమి తెలుసుకొందో అని జంకుతూనే హేమావతి వెంట వెళ్ళాడు శేఖర్.

మామూలుగానే మేడమీద గదిలో కూర్చున్నారు. కాఫీ ఫలాహారములు అయిన తరువాత హేమావతే ముందుగామాట్లాడింది.

మిస్టర్ శేఖర్! ఆనాడు అకస్మాత్తుగా, అనాలోచితంగా మీరు వేసిన ప్రశ్న నన్ను చాలా కలవరపరిచింది. మనము వివాహము చేసుకొనేముందు నాకు కలిగిన సందేహాలను మీరు నివృత్తి చేయగలరనుకొంటాను."

"ఏమిటి ఆ సందేహాలు?"

"మీరు పెళ్ళిచేసికొంటానని చెప్పి, ప్రేమించినట్లు నటించి కాలేజీ అమ్మాయిలను మొదలయినవాళ్ళను మోసగిస్తున్నట్లు తెలిసింది. ఇందుకు మీ సమాధానము?"

"లేదు. పచ్చి అబద్ధము" అన్నాడు శేఖర్ ఉద్రేకంతో.

"మీ క్లాస్ మేట్ వనజను పెళ్ళిచేసుకొంటానని మీ స్నేహితులందరితోను చెప్పినట్లు మరొకవార!"

ప్రశ్నకు వెంటనే సమాధానము చెప్పటానికి శేఖరుకు సాధ్యముకాలేదు. కొంచెము ఆలోచించి "నేను వనజా స్నేహంగా వుండటము, దానికి తోడు అఖిలభారత టెన్నిసు పందెములలో గెలిచిన తరువాత యింకా చనువుగా వుండటము చూసినవాళ్లు ఆ విధంగా నా విషయములో కథలు కడితే నేనేమి సమాధానము చెప్పగలను?" అన్నాడు శేఖర్.

"సింగపూరులో వున్న మీ మేనమామ కూతురును మీకిచ్చి తప్పక పెళ్లి చేస్తానని మీ నాన్నగారువాళ్లకువాగ్దానాలుచేసికొన్నారుటగా! మరి మీరు ఆ అమ్మాయిని ఎందుకు చేసికోలేదు?"

"ఏ కాలంలోనో జరిగిన వాగ్దానానికి నేనా బాధ్యుణ్ణి?"

"ఆ అమ్మాయిని పెళ్లి చేసుకొనేందుకు మీరుకూడ ఒప్పుకొన్నారేమో!"

"లేదు."

"అబద్దాల్లో పచ్చి అబద్ధము. నాకు కావలసింది నిజము."

"నేను ఒప్పుకోలేదు. నా తల్లితండ్రులు

★ స్వతంత్ర వివాహము ★

అప్రమానం ఆ విషయమే మాట్లాడుకొనే వారు. కాని నేను ఆవిషయంలో కలగ చేసుకోలేదు. "

"చింత చచ్చినా పులుసు చావలేదన్నట్లుంది నీ విమర్శ" అంటూ కోపంగా హేమావతి లోపలికివెళ్ళి ఒక పుత్తరము తెచ్చియిస్తూ "ఇది ఎవరు రాశారు?" అంది.

అది యిదివరలో సుబ్బులు స్కూల్ ఫైనల్ చదువుతూండగా శేఖర్ వ్రాసిన ప్రేమ లేఖ. ఆ ఉత్తరంచూసిన శేఖర్‌కు తల పగిలినంతపని అయింది. కొంచెము సేపు ఏమీ మాట్లాడలేక పోయాడు. హేమావతి సామాన్యస్త్రీయో, లేక రహస్య పరిశోధకురాలో అతనికి అర్థం కాలేదు.

"ఇది నేనువ్రాసినదే. కాని యిదిమీకు ఎల్లా వచ్చింది?"

"ఎల్లా వస్తే మీ కెందుకు? మీ గురించి భోగట్టా చేస్తే యిటువంటివి బయట పడుతున్నాయి. ఈ వుత్తరంలో ఆదర్శప్రేమ అంటూ, ప్రేమంతా ఒలికించినట్లు వ్రాసి, తర్వాత ఆమెను చేసుకోనని మొండిపట్టు పట్టుకొని కూర్చొన్నారే! తీరా నేను మిమ్మల్ని పెళ్ళి చేసుకొన్నాక, రేపు నాకన్న అందమైనది, నాకన్న చదువుకొన్నది, నాకన్న ధనవంతురాలు మీకంటికి కనిపిస్తే నా గతి ఏమౌతుంది? మీ ఆదర్శప్రేమగతి ఏమౌతుంది? పెద్ద చదువు చదువుకొని యింత





సినిమా

'ఉత్తమ భారతీయ చిత్రాలు'

1957 వ సంవత్సరానికి రాష్ట్రపతి సువర్ణ పతకం, శాంతారాం చిత్రం 'దో ఆంఖేఁ బారా హాత్'(రాజ్ కమల్ కళామందిర్)కు లభించింది.

ఈ ఏడాది బహుమతి ప్రధానోత్సవంలో విశేషాలు రెండు. ఒకటి, చిత్రనిర్మాతకు, దర్శకునకు నగదు బహుమతులు ఇవ్వడం అని విదితమే.

రెండవది, నాలుగేళ్ళ తరువాత, ఈనాటికి తొలిసారిగా బాలల చిత్రాలకు ప్రధానమంత్రి పేరిట ఇవ్వదలచిన సువర్ణపతకం వినియోగం కావడం. ఈ గౌరవం ఏ. వి. ఎం. పేరిట శ్రీ మెయ్యప్ప చెట్టియార్, ఉత్తరాది నిర్మాత శ్రీ సదాశివ్ జె. రావ్ కవి కలిసి, శ్రీ సంతోషి దర్శకత్వాన నిర్మించిన 'హం పంఛీ ఏక్ డాల్ కే' చిత్రానికి దక్కింది. దీనికి సువర్ణపతకంతో పాటు 30 వేల రూపాయలు నిర్మాతలకూ, ఐదు వేల రూపాయలూ దర్శకునికీ ఇచ్చి సత్కరిస్తారు.

తెలుగు చిత్ర పరిశ్రమలో ఒకదానికీ రజితపతకం లేకపోవడం అనేది ఈయేడే జరిగింది. ఉన్నవాటిలో పొన్నలూరివారి 'భాగ్యరేఖ'కూ అన్నపూర్ణావారి 'తోడికోడళ్ళు' చిత్రానికీ రాష్ట్రీయస్థాయిన ప్రశంసాపత్రాలు మాత్రం లభించాయి. రజతపతకానికి తగుననిపించుకొనేపాటి చిత్రం తెలుగులో గతసంవత్సరం లేదా? అన్న విషయాన్ని, లేకపోతే ఎందుకని అనే విషయాన్నీ మన నిర్మాతలే ఆలోచించుకోవాలి. ఉన్నంతలో ఒక మంచి విషయం ఏమిటంటే, ప్రశంసాపత్రాలు పొందిన తెలుగు చిత్రాలు రెండూ, దేశంలో కూడా ఔననిపించుకుని శత దినోత్సవాలు జరుపుకోవడం. బహుమానాలకూ, బాక్సాఫీస్‌కూ ఈవిధంగా పొత్తు కుదరడం, సంతోషించదగ్గ విషయం. 'భాగ్యరేఖ' దర్శకనిర్మాతలు బి. ఎన్. రెడ్డి, వసంతకుమార్ రెడ్డిగారలూ 'తోడికోడళ్ళు' దర్శక నిర్మాతలు ఆదుర్తి సుబ్బారావు, డి. మధుసూదనరావు గారలూ ఆ చిత్రాలలో పని చేసిన కళాకారులూ టెక్నీషియన్‌లూ అభినందనీయులు.

బహుశా ఈ పత్రిక మీ చేతికి అందే నాటికి ఢిల్లీలో బహుమతి ప్రదానం జరుగుతూ ఉంటుంది.

బహుమతుల వివరాలు:

కథా చిత్రాలు

రాజ్ కమల్ వారి 'దో ఆంఖేఁ బారా హాత్' రాష్ట్రపతి సువర్ణపతకం, 25 వేల రూపాయల నగదు.

అఖిలభారత ప్రశంసాపత్రం అందుకొన్న చిత్రం 'అంధేరీ ఆలో' (బెంగాలి). దీనికి 12,500 నగదు బహూకరిస్తారు.

మహబూబ్ ప్రొడక్షన్స్ వారి గేవాకలర్ చిత్రం 'మదరిండియా'కు—అఖిల భారతస్థాయి ప్రశంసాపత్రం లభించింది.



రిపబ్లిక్ వారి 'పెళ్లి సందడి' లో నాగేశ్వరరావు, అంజలీదేవి



కాశీనాథ్ ప్రొడక్షన్స్ వారి "రామాంజనేయయుద్ధం"లో సంధ్య, బేబీ చంద్రకళ, బేబీ కృష్ణభవాని.

ప్రాంతీయ స్థాయిలో

ప్రాంతీయ స్థాయిలో ఈ క్రింది చిత్రాలకు బహుమతులు ఇస్తారు.

రజత పతకాలు : గృహదేవత (మరాటీ), పడత పైంకిలి (మలయాళం), ప్రేమ్ దే పుత్రి (కన్నడం). సువర్ణ పతకం పొందిన 'దో ఆంఖేఁ బారా హాత్'కూ, అ. భా. ప్రశంసాపత్రం పొందిన బెంగాలీ చిత్రం 'అంధేరీ ఆలో'కు రజత పతకాలు కూడా ఇస్తున్నారు.

ప్రశంసా పత్రాలు : 'మదరిండియా', 'ముసాఫిర్' (హిందీ), 'లాహా కాపత్', 'హారానో సూర్' (బెంగాలీ), 'ముదలాళి' (తమిళం), 'భాగ్యరేఖ', 'తోడికోడళ్ళు' (తెలుగు), 'మాక్ ఆరు మోరమ్' (అసామీస్).

బాలల చిత్రాలు

ఎ. వి. ఎం. వారి 'హం పంఛీ ఏక్ డాల్ కే' చిత్రానికి ప్రధాని సువర్ణ పతకం, 25000 నగదు బహుమతి. 'జన్మతిథి' అనే బెంగాలీ చిత్రానికి ఈ శ్రేణిలో ప్రశంసా పత్రం, 12,500 నగదు బహుమతీ ఇస్తారు.

డాక్యుమెంటరీలు

'హిమాలయన్ టేపిస్ట్రీ' అనే చిత్రానికి రాష్ట్రపతి సువర్ణ పతకం, ఐదు వేల రూపాయలు నగదు. 'మందూ' అనే చిత్రానికి ప్రశంసాపత్రం, 2500 నగదూ ఇస్తారు. 'ధర్తీకి ఝంకార్' అనే చిత్రానికి అఖిల భారత ప్రశంసాపత్రం ఇస్తారు.

ఆర్. ఆర్. దివాకర్ అధ్యక్షుడైన పదిమంది సభ్యుల కేంద్ర బహుమతి నిర్ణాయక సంఘం, ఈ బహుమతులకు అర్హమైన పై చిత్రాలను ఎన్నిక చేసింది. ప్రాంతీయ సంఘాలు, ఆయా ప్రాంతీయచిత్రాలలో మంచివాటిని సిఫార్సు చేశాయి.

కేంద్ర సంఘం మొత్తం 18 కథా చిత్రాలు, 8 బాలల చిత్రాలూ, ఒక చిన్న చిత్రం, 44 డాక్యుమెంటరీలు (వీటిలో నాలుగు పెద్దవి, మిగతావి నాలుగువేల అడుగుల లోపువి) చూచింది. ★

వంజికోట్టై వాలిబన్


ఎవరికేది కావలిస్తే అది లభించేలా (కనడానికీ, వినడానికీ) బ్రహ్మాండమైన రాజభవనాలూ, కోటలూ, గోడలూ, కొండలూ, సుందరమైన ప్రకృతిదృశ్యాలూ, పెద్ద ఎత్తున యుద్ధాలూ, మనోహరమైన నృత్యాలూ, సంగీతం, హాస్యం మొదలైనవన్నీ రక్తికట్టే కథలో బిగించి దర్శకనిర్మాత శ్రీ ఎస్. ఎస్. వాసన్ తీసిన భారీచిత్రం జెమినీవారి 'వంజికోట్టై వాలిబన్' మొన్న తమిళ ఉగాదినాడు మద్రాసు వెలింగ్‌టన్, సరస్వతి, ప్రభాత్ సినిమాలలో విడుదల అయింది. గత గురువారంనాడు పత్రికల వారికి చూపించారు.

జెమినీ కథాశాఖకు 'చంద్రలేఖ' తరువాత రేకెత్తే కలిగిన ఈ చిత్ర కథలో అక్కడ పోలికలు లేకపోలేదు. దుర్జయుడనే దుర్జనుడు అనగనగా ఒక రాజుగారిని సేనానిగా సేవిస్తూ, ఆయనకు పుత్రోదయం కాగానే, తుళ్లిపడి పుంజుకొని, ఆ వంజికోట రాజ్యాన్ని కబళింప జూస్తాడు. అతడు రాజుని చంపేవరకు, మంత్రి చొక్కలింగం జాగ్రత్తపడి యువరాజుని, రాకుమార్తెను వెంటబెట్టుకు పారిపోతాడు. తన భార్యాబిడ్డలను కూడా తీసుకుపోవాలని ...

... లో కథలో ప్రవేశించి వారిని వేరుచేస్తుంది. మంత్రి భార్య దుర్జయుడి ఖైదులో పతి క్యారెక్టర్ యాక్షన్ చేస్తూ ఉంటుంది. పిల్లలిద్దరూ గాలికీ ధూళికీ పెరిగి పెద్దవాళ్ళవుతారు. గాలి వాటానికే, (ఇక్కడ తుఫాను, దృశ్యాన్ని అద్భుతంగా తీశారు) కోటకి చేరుకుంటారు. అక్కడ అన్న సుందరలింగం, చెల్లెలుకు పెళ్ళి ఏర్పాటు చేసేలోగా, ఆమె దుర్జయుడి దౌర్జన్యానికి బలి అవుతుంది. తమ్ముళ్లంగా సుందరలింగానికి దుర్జయుడికీ 'పరిచయం' కలుగుతుంది. దుర్జయుడు అతని ఖైదులో వేస్తాడు. సుందరం అక్కడ తన తల్లిని కలుసుకుని, ఫ్లాష్ బాక్‌లో కథ అంతా తెలుసుకుని, ఖైదు తప్పించుకుని, ప్రమాదవశాత్తు ఒక 'ప్రేమ కథ'లోకి జారి పడతాడు. అక్కడ ఓ కోయ పిల్లను లాలించి తప్పించుకొని, వంజికోటవచ్చి, అజ్ఞాతవాసంలో ఉన్న తండ్రి (మంత్రి)నీ, యువరాజునూ, రాకుమార్తెనూ కలుసుకొంటాడు. ఆనక, వారంతా కలసి ఊరూరూ తిరిగి ప్రజాబాహుళ్యాన్ని ఆకట్టుకుని 'తిరుగుబాటుకి' సర్వం సిద్ధం చేసుకుంటారు. తీరా చూస్తే, నాయకులు పలుగురూ మళ్ళీ దుర్జయుడి ఖైదులోనే పడతారు. అప్పుడు 'వంజికోట వాలిబన్' (యువకుడు) జెమినీ గణేశన్, మారువేషంలో వెళ్ళి దుర్జయుడి కొలువు సంపాదించి, రకరకాల వేషాలు వేసి, మంత్రిని మళ్లీ విడిపిస్తాడు. ఈసారి మళ్ళీ అందరూ రాజభటులకు పట్టుబడిపోతారు. దుర్జయుడు వారిని కొరతను వేయించబోయేవరకు ప్రజాబాహుళ్యం అంతా రాజుగారికే జై కొట్టి తిరగబడుతుంది. భారీ సెట్లమీద పెద్ద బాక్సాఫీస్ యుద్ధం జరుగుతుంది. ఇందులో వైజయంతిమాల, పద్మిని, సుందరీబాయ్ ప్రభృతులు కూడా పాల్గొంటారు. చివరకు దుర్జయుడు మరణిస్తాడు. యువరాజు సింహాసనం ఎక్కుతాడు. వంజికోట వీరుడు రాజకుమార్తెను పెళ్ళాడుతాడు.

ఇందులో జెమినీగణేశన్, వైజయంతిమాల, పద్మిని, కన్నాంబ, వీరప్ప, తంగవేలు మొదలగువారు నటించారు. సంగీతదర్శకుడు సి. రామచంద్ర చక్కని వరసలు వినిపించారు. తమిళ సంగీతం ముఖ్యమైన సందర్భాలలో జెమినీలో మొన్నటివరకు ముఖ్య సంగీతదర్శకులుగా పనిచేసిన ఈమని శంకరశాస్త్రి, ఒకటి రెంటిని, ఎస్. వి. వెంకటరామన్ కూర్చారు. శంకరశాస్త్రిగారు, కావడి నృత్యానికి చేసిన జానపద బాణీ పాట, మరో జిప్సీ డాన్సు సంగీతం, వెంకటరామన్ చేసిన మరో పాట శ్రావ్యంగా ఉన్నాయి.

నృత్యాలు అన్నీ ఆకర్షణీయంగా ఉన్నాయి. పద్మిని వైజయంతిమాల కలిసి ...



టోక్యోలో జరుగనున్న ఆసియా క్రీడోత్సవాలకు భారతదేశంనుండి ఆటగాళ్ళ బృందం వెళ్ళబోతున్నది. వారి దారి ఖర్చులకై ప్రధాని, భారత ఒలింపిక్ సంఘం, నిధి సేకరిస్తున్నారు. ఏప్రిల్ పదిన మద్రాసులోని సినీనటులు నృత్యనాటక ప్రదర్శనాలు ఇచ్చి, వసూలైన మొత్తాన్ని ఈ నిధికి సమర్పించారు. ఈ సందర్భంలో తెలుగు నటులు వేసిన 'చింతామణి' నాటకంలో ఒక సన్నివేశం. రేలంగి, ఎస్. వరలక్ష్మి, గిరిజ ఇందులో ఉన్నారు.

'బియాండ్ ది హొరైజన్'

భారతదేశంలో పర్యటించవచ్చిన అమెరికన్ యువబృందం—వేన్‌సేట్ యూనివర్సిటీ థియేటర్ వారు, ఆఖరు మజిలీ మద్రాసు అన్నామలైమందిరంలో రెండు నాటకాలు, మూడు ఏకాంకికలు ప్రదర్శించారు. ఏప్రిల్ 8, 9, 10 తేదీలలో వారు ప్రదర్శించినవి: సొఫోకిల్స్ నాటకం 'ఈడిపస్ రెక్స్', యూజిన్ ఒనీల్ నాటకం 'బియాండ్ ది హొరైజన్',

ఏకాంకికలు: థార్న్‌టన్ విల్డర్ వ్రాసిన 'పుల్‌మన్‌కార్ హైవాథా', మోలియర్ నాటిక 'ది ఎఫెక్టెడ్ యంగ్ లేడీ' ఒనీల్ నాటిక 'వేర్ ది క్రాస్ ఈజ్ మేడ్' మద్రాసులో ఈ ప్రదర్శనలు థియేటర్ సెంటర్ అధ్వర్యాన జరిగాయి. శ్రీమతి రుక్మిణీదేవి నిర్వాహకురాలు. ఉత్సవాలను గవర్నరు శ్రీ విష్ణురాం మేధీ ప్రారంభించారు. పురప్రముఖులు, నగరంలోని నాటక చలనచిత్ర కళాకారులూ చాలమంది వచ్చారు. ఏప్రిల్ 11న మద్రాసు థియేటర్ సెంటర్ వారు, సంస్కృతంలోను, మలయాళంలోను, ఇంగ్లీషులోను మూడు ఏకాంకికలు ప్రదర్శించారు. 13న కళాక్షేత్ర (అడయారు) బృందం శ్రీమతి రుక్మిణీదేవి అధ్వర్యాన 'కుట్రాల కురవంజి' అనే నృత్యనాటికను ప్రదర్శించారు.

అమెరికన్ బృందం ప్రదర్శించిన వాటిలో యూజిన్ ఒనీల్ వ్రాసిన విషాదాంతనాటకం 'బియాండ్ ది హొరైజన్' సర్వత్రా ప్రశంసలందుకొంది. (మిగత నాటికల గురించిన వివరాలకు ఈ పత్రిక 8 వ పుట చూడండి.)

"నిర్దుష్టమైన ప్రదర్శనం" అని మద్రాసు విశ్వవిద్యాలయ ఉపాధ్యాయుడు డా॥ లక్ష్మణస్వామి ముదలియార్ ప్రశంసించారు. ఈ నాటకం దర్శకుడు లియోనార్డ్ లియోన్‌ను, నటవర్గాన్ని, ప్రదర్శన విధానం, సెట్స్ నిర్ణయించిన రిచర్డ్ స్పియర్‌ను ఆయన ప్రశంసించారు.

తనమనసు తను తెలుసుకోలేక, ఒరులను



వేన్ విశ్వవిద్యాలయ నటబృందం 9 వ తేదిన మద్రాసులోని అన్నామలై మందిరంలో "బియాండ్ ది హొరైజన్" అనే నాటకం ప్రదర్శించారు. నాటకంలోని ఒకసన్నివేశాన్ని చిత్రంలో చూడవచ్చు.

చిత్రానికి అది విశేషాకర్షణ.

మొత్తానికి బాక్సాఫీస్ సెట్స (చంద్రలేఖను మించినవి), యుద్ధాలూ, బాక్సాఫీస్ డాన్సులూ (పద్మినికీ, వైజయంతికీ పోటీ), బాక్సాఫీస్ డైలాగులూ ('మేం డబ్బుకు ఆశించం, మేం ఎవరనుకున్నావు? పేదవాళ్ళం' ఇత్యాది), పుష్కలంగా గల ఈ చిత్రం వినోద కాలక్షేపానికి నిక్షేపం వంటిది.

దీన్నే శ్రీ వాసన్, 'రాజ్ తిలక్' పేరిట హిందీలోకూడా నిర్మించి ఉత్తరాదిన విడుదల చేశారు. ★


క్షోభపెట్టిన ఒక అమ్మాయి కథను, ఆమె చాంచల్యంవల్ల, ఇద్దరన్నదమ్ములు పడ్డ వ్యథను ఒ నీల్ ఈ నాటకంలో చిత్రించారు. ఆ అన్నదములు రైతుబిడ్డలు. పెద్దవాడు ఆండీ పొలంపనులు చూస్తూ, పదహారణాల రైతుబిడ్డగా పెరుగుతాడు. చిన్నవాడు రాబర్ట్‌కు ఈ మట్టిపని గిటదు. ఎంతసేపూ దేశాటనం గురించి కలలుకంటూ ఉంటాడు. ఈస్థితిలో వారిజీవితంలో ప్రేమఘట్టం ఆరంభం అవుతుంది. వాళ్ళతోపాటె తిరుగుతూ పెరుగుతున్న పిల్ల 'రూత్'ను ఆండీ పెండ్లాడుతాడని పెద్దలు మాట అనుకుంటారు కాని, దురదృష్టవశాత్తూ. రూత్, తనకాబోయే మరిది రాబర్ట్ ఊహాపోహాలు విని, అతని సొగసుకని మోజుపడి, అతన్ని పెళ్ళాడడానికి అంగీకరిస్తుంది. రాబర్ట్ ఆ వైనం వెల్లడిచేసి, దేశాటనం అక్కరేదంటాడు. అప్రతిభులైన తలిదండ్రులు తేరుకునేలోగానే, పెద్దవాడు ఆండీ మనసు రాయిచేసుకుని, తనే దేశాటనం పోతానంటాడు. తమ్ముడు పెళ్ళాడి ఓ యింటివాడు అవుతున్నాడు కాబట్టి, పొలం పనులు వాడే చూసుకోవచ్చునని నచ్చచెప్పి, వాళ్ళ చుట్టం, కెప్టెన్ డిక్ స్కాట్ వెంట పోతాడు. ఆనక అతన్ని సిరి వరిస్తుంది. ద్రాక్షపళ్ళ వ్యాపారంచేసి బాగా డబ్బు గడిస్తాడు. తరవాత స్పెక్యులేషన్‌లో దిగి దెబ్బతింటాడు. మొత్తానికి తను ఇంట్లో ఉన్నన్నాళ్ళూ, 'దూరతీరాల గురించి' తమ్ముడు కన్న కలల మాధుర్యం ఆ తీరాలలో తిరుగుతున్న అన్నకు లవలేశం సోకదు. అడపా తడపా ఇంటికొస్తూ ఉంటాడు; అతనికితగినట్టే, ఇక్కడ తమ్ముడి స్థితీ బాగుండదు. తమ్ముడూ, మరదలూ ఇల సాటిలేని జంటలా, చిలకాగోరింకలలా ఉన్నట్టు కనబడరు. వాళ్ళ జీవితంలోనూ ఏదో అసంతృప్తీ, అణచుకుంటున్న బాధా ఇతనికి గోచరిసాయి. వ్యవసాయం వెనకబడుతుంది. తమ్ముడు మంచాన పడతాడు క్షయతో. అతను మరణశయ్యమీద ఉండగా, చివరకు మరదలు చెబుతుంది కారణం: "ఆండీ! నేను నిన్ను పెళ్లిచేసుకోవలసినదాన్ని. కాని రాబర్ట్‌ని ప్రేమించాననుకుని అతన్ని కట్టుకున్నాను. దారుణమైన పొరపాటు చేశానని గ్రహించాను. నేను రాబర్ట్‌ని ఎన్నడూ ప్రేమించలేదు. నిన్నే' అంటుంది రూత్.

ఆండీ మండిపడతాడు జీవితంతో చెలగాటం ఆడిన రూత్ మీద. 'ఎన్నాళ్ళయింది? ఈ సత్యం కనిపెట్టి?' అంటాడు.

"ఐదేళ్ళ క్రితమే తెలుసు. ఆ సంగతి మా పెళ్ళయిన కొత్తల్లోనే రాబర్ట్‌కి చెప్పాను" అంటుంది రూత్.

ఆడదాని ఈ క్రౌర్యం చూచి, కొయ్య

(56-వ పేజీ చూడండి)



తన్నులు తిన్నాడుగాని గుర్నాథం పడడం బూరెలగంపలోనే పడ్డాడు - పడ్డ అవస్థ ఫలించింది - కోరినకన్నె కంటపడింది - రిపబ్లిక్ వారి "పెళ్లిసందడి"లో సరోజాదేవి, చలం.



సంగీతావారి 'ఇంటిగుట్టు'లో సూర్యకాంతం, గుమ్మడి, పుష్పవల్లి.

అమెరికన్ చలనచిత్రకళ పరిణామాలకథ

(గతవారం తరువాయి)

కొన్నింటిలో డబ్ల్యు. ఎస్. హార్ట్ నటన అద్వితీయంగా ఉంది. డైరెక్టర్లు, రచయితలు చేసే పనిమీద "పర్యవేక్షణ" విధానాన్ని ఆయనే తొలిసారిగా ప్రవేశపెట్టింది. కథా విధానం, ఎడిటింగ్ లపట్ల ఆయన అత్యంత శ్రద్ధాసక్తులతో పనిచేసేవాడు. హాలీవుడ్ లో టాకీయుగం ప్రారంభమైనతర్వాత, సంభాషణలద్వారా వివిధపాత్రలను అత్యద్భుతంగా పోషించటానికి ఇంకా వీలుకలిగింది. శబ్దం అంటూ లేకపోయినట్లయితే "గాన్ విత్ ది విండ్," "ఆల్ క్వయిట్ ఆన్ ది వెస్టర్న్ ఫ్రంట్," "సిటిజన్ కేన్," "ది బెస్ట్ ఇయర్స్ ఆఫ్ అవర్ లైవ్స్," "ది గ్లాస్ మూ నేజరీ," "జూలియస్ సీజర్," "మార్టి" "జయంట్" మొదలైన కళాఖండాలు వచ్చి ఉండేవికావు.

హాలీవుడ్ ఆర్థికమాంద్యం

1952-53 లో హాలీవుడ్ లో ఆర్థిక మాంద్యంవల్ల కెమెరాల్లో, ప్రొజెక్టర్లలో మాత్రమే మార్పులు తేగలిగారు. టెలివిజన్ పోటీమూలంగా థియేటర్ల వ్యాపారం కొంత వరకు కుంటుపడింది. అలాంటి పరిస్థితుల్లో "దిస్ ఈజ్ సినేరమా," "వ్యానా డెవిల్" చిత్రాలు బ్రహ్మాండంగా జయప్రదమైనాయి. దానితో విశాలమైన 'సినేరమా' 'విస్టావిజన్' 'వైడ్ స్క్రీన్', 'సినిమాస్కోప్', తెరల వైపూ, త్రీ-డైమన్షన్ చిత్రాల వైపూ హాలీవుడ్ నిర్మాతలందరూ మొగ్గుచూపారు. టెలివిజన్‌లో 'చిన్న తెర' ద్వారా చూచే ప్రేక్షకులకు, ఈ నూతన చిత్రాలు కన్నులపండువుగా తోచాయి. "ట్వెంటియత్-సెంచరీ ఫాక్స్" సంస్థ తమ చిత్రాల నన్నింటినీ 'సినిమాస్కోప్'లో నిర్మింపసాగారు. అదేవిధంగా పారమౌంట్ సంస్థ 'విస్టావిజన్'లో — అంటే అంతకు ముందు నిర్మించిన చిత్రాలకంటే ఎత్తుగానూ వెడల్పుగానూ కనిపించేలాగ - చిత్రాలు నిర్మింపసాగారు.

నిజానికి ఈ నూతనవిధానం 15 నుంచి 58 సంవత్సరాలకు పూర్వమే కనిపెట్టబడినదని చెప్పొచ్చు. సినేరమా మూలసూత్రాన్ని 1938 లోనే ఫ్రెంచ్ వ్యాలర్ కనిపెట్టాడు. 1900 లో పారిస్‌నగరంలో జరిగిన ఒక సంతలో రెండు 'సినేరమా' తెరలు ఎదురు బొదురుగా నిలబెట్టితే ఎలాఉంటుందో-- అంటే వర్తులాకారంగా ఉండే తెరమీద "సినియోరమా" అనేపేరుతో చలనచిత్రం ప్రదర్శించారు. 1920 లో 'ఎనాగ్లిఫిక్' విధానంలో త్రిడైమన్షన్ చిత్రాలు చూపబడ్డాయి. 1935 లో చాకరకం పోలారాయిడ్ ఫిల్టర్లు ఉపయోగించి ఎడ్వర్డ్ హెచ్. ల్యాండ్ అమెరికాలో బహువర్ణకమైన 3-డి చిత్రాలను ప్రదర్శించారు. 1928 ప్రాంతంలో ఫ్రెంచి శాస్త్రవేత్త హెన్రి క్రేషియన్, అమెరికన్ శాస్త్రవేత్త హెచ్. సిడ్నీ న్యూకమర్ హాలీవుడ్‌లో సినిమా



హాలీవుడ్ నటి గ్రెటా గార్బో, పేరుప్రతిష్ఠలు ఎంతటి ఉన్నతిని అందుకున్నాయో, అంత 'ఎత్తున' ఆమెగురించి ప్రచారంకూడా సాగింది. ఇటు ఉత్తమనటనకు, అటు బాక్సాఫీస్ విజయాలకూ కూడా గార్బోపేరు చిహ్నమై వెలిగింది. హాలీవుడ్ చేసిన గార్బో పబ్లిసిటీకి ఇదొక మచ్చుతునక

ఫాక్స్ తొలిసారిగా ప్రవేశపెట్టారు. 1920 లోనే విస్టావిజన్ కనిపెట్టబడింది. కెమెరాలో ఫిల్మ్‌ను అడ్డంగా పరుగెత్తించి సాధారణంగా 35 మిల్లీమీటర్ల ఛాయా చిత్రానికి రెట్టింపు పెద్దదిగావుండే చిత్రాన్ని తయారు చేసే విధానాన్ని అమెరికన్ పరిశోధకుడు ఇ. డబ్ల్యు. క్లార్క్ పేటెంట్ చెయించాడు.

1929, 1930 లో అమెరికన్ ఆప్టికల్ పరికరాలు వినియోగించి, మామూలు తెరలకంటె రెట్టింపు వైశాల్యం గల తెరలపై ప్రదర్శించేటందుకు తగిన చిత్రాలు నిర్మించ ప్రారంభించారు. కాని 1929 లో కలిగిన ఆర్థికమాంద్యం మూలంగా ఫాక్స్, తదితర నిర్మాతలూ ప్రారంభించిన భారీ చిత్రాల నిర్మాణం నిలుపుదల చేయవలసి వచ్చింది. అలా కాకపోయిన పక్షంలో, అమెరికాలో వైడ్‌స్క్రీన్ చిత్రాల నిర్మాణం పాతికేళ్ళ క్రితమే ఆరంభమై ఉండేది.

ఎడిసన్ కనిపెట్టిన 'పీప్‌షో', పోర్టర్ నిర్మించిన "ది గ్రేట్ ట్రెయిన్ రాబరీ" రోజులనుంచీ, హాలీవుడ్ చిత్రాలు సాంకేతికంగానూ, కళాత్మకంగానూ పురోగమిస్తూ వచ్చాయి. టెక్నికలర్ ప్రాసెస్‌తో బహువర్ణచిత్రాలు మనం తిలకించగలుగుతున్నాము. ఈస్టమన్, ఆన్స్కో (జర్మన్ ఆగ్ఫానుంచి ఉత్పన్నమైంది) నెగటివ్ ప్రాసెస్ విధానంవల్ల కూడా టెక్నికలర్ చిత్రాలు తయారవుతున్నాయి. 1945 నుంచి ఇంగ్లండ్, ఫ్రాన్స్, ఇటలీ దేశాలు నిర్మిస్తున్న కళాఖండాలవల్ల హాలీవుడ్ నిర్మాతలు ఉత్తేజితులై నవలలు, నాటకాలు మొదలైనవాటి అనువృత్తాలనూ, సరిక్రొత్త కల్పనాసాహిత్యాన్నీ తెర మీదకు మహత్తరచిత్రాల రూపంలో ఎక్కించసాగారు.



సిసిల్. బి. 'డిమిల్ చిత్రం టెన్ కమాండ్ మెంట్స్'లో ఈజిప్టురాజుగా యుల్ బ్రెనర్.

అమెరికన్ చలనచిత్రకళ

పరిణామాల కథ

హాలీవుడ్ నిర్మాతలు వారి యూనిట్లతో కొన్నింటిని, ఇతరదేశాలకు పంపి అక్కడి వాతావరణంతో చిత్రాలు షూట్ చేయటం వల్ల అవి అందంగానూ, వాస్తవికంగానూ కనిపిస్తాయి.

ప్రస్తుతం హాలీవుడ్‌లో తయారవుతున్న చిత్రాల్లో సైలెంట్ ఫిల్ముల్లోని నటన, వేగమూ; టాకీల్లోని సంభాషణలు, సంగీత సృష్టీ సమ్మిళితమై ప్రేక్షకులకు విజ్ఞానం, వినోదం వెదజల్లే కళాఖండాలుగా జగద్విఖ్యాతి గాంచుతున్నాయి. ★

'బియాండ్ ది హొరైజన్'

[53 వ పేజీ తరువాయి]

మారిపోతాడు ఆండీ. ఐదేళ్ళుగా భర్తని ఇలా క్షోభ పెడుతూ, తను పడుతూ నిభాయించుకుంటున్న ఆమె మీద అతనికి ఏవగింపు కలుగుతుంది. 'నేను నిన్ను ఎన్నడూ ప్రేమించలేదు...నీకు నాకూ సంబంధం లేదు" అంటాడు కఠినంగా.

కాని అప్పటికే రాబర్ట్‌కు ఆయుర్దాయం చెల్లింది.

అతని ఆఖరు కోరిక: "మీరిద్దరూ పెళ్ళి చేసుకోండి...ఆండీ! రూత్‌ని సుఖపెట్టు"

* * *


ఇందులో అన్నదమ్ములుగా రాబర్ట్ సారింగ్, ఎర్ బెటింజర్, రూత్‌గా సింతియా జాయ్‌నర్‌లు స్మరణీయమైన నటన ప్రదర్శించారు. ఆండీ తల్లిదండ్రులుగా మార్జరీ డిబాల్, రాబర్ట్ వర్లీలు, రూత్ తల్లిగా హెన్రియెట్టా హార్మ్లిన్, కెప్టెన్ స్కాట్‌గా జోసెఫ్ కారెట్ నటించారు.

నిజానికి ఈ నాటకంలో నటనగురించి విడిగా చెప్పుకోలేము. రంగస్థలంమీద ప్రసరించిన మెత్తటి 'మంద్రస్థాయి' కాంతి, కథావస్తువు తత్వానికి అమరేవిధాన ఎరుపుఛాయ కలసిన గోధుమవర్ణపు తెరలూ గోడలూ, ఒకొక్క అంకం ముగియగానే వినవచ్చే విషాదసూచక సంగీత వ్యాఖ్య, మొదలైన వాటన్నిటిలోను నటన కలసిపోయి, ఈ నాటకం జీవితంఅంత తీవిగా అందంగా, భయంకరంగా క్రూరంగా సాగిపోతుంది. ప్రేక్షకుల దృష్టి దాని గమనం మీదనే నిలుస్తుంది తప్ప అమెరికా వాళ్ళు తెచ్చుకున్న హంగులమీదకుగాని చేస్తున్న ఉపాయాలమీదకుగాని పోదు. ఇక్కడకు వచ్చిన ఈ బృందం పూర్వోత్తరాలు ఏమీ మనకు బాగా తెలియకపోయినా ప్రదర్శనలో రసపోషణకు అవసరమైన శిల్పం వీరి వద్ద మనం నేర్చుకోవలసినది చాలా ఉందని చెప్పుకోవాలి. సెట్‌లు రెండే ఉన్నాయి. ఒకటి, రాబర్ట్ దూరతీరాల గురించి కలలుగన్న చోటు— ఆ వూరి శివారు. అక్కడే అతడు, అతనిభార్య తప్పటడుగు వేస్తారు. చివరికి జీవితంఅంతా నాశనం చేసుకున్న రాబర్ట్ అక్కడే ప్రాణంవిడుస్తాడు. అక్కడే, అతని కోరిక మన్నించి ఆండీ రూత్‌లు పెళ్లాడి నవజీవనం ఆరంభించ సంకల్పిస్తారు.

రెండోది రాబర్ట్ ఇల్లు. ఈ యింటిలో కాంతిప్రసారం, టెక్నికలర్ చిత్రాలలో ఏర్పాట్లను మించిఉంది. కాగా వీటిలో లెన్సు ముందర గ్రహించి ప్రసరించే అవసరం లేదు కాబట్టి, ప్రేక్షకులు ఎదటనే ఉన్నారు కాబట్టి కథాకాలం రాత్రి అయినపుడు లైటింగ్ సినిమాలకన్న సహజంగా ఏర్పాటు చేయడానికి సాధ్యం అవుతుంది.

విశేషం ఏమిటంటే వారు చేసి సాధించారు. అందుకే ఒకాయన, 'మనకీ వాళ్ళకీ తేడా ఏమిటా'ని అడిగితే 'ఏముంది ప్రొడక్షన్' అన్నారు రెండో పెద్దమనిషి ముక్తసరిగా. ★

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad



ముంజలకాలం

ఫొటో : వసల కృష్ణకుమార్ — [illegible]

Regd. No. M. 4479 Andhra · Patrika · Illustrated Weekly.

పద్మిని కున్నట్టి దేహకాంతి

మీకున్నూ కలుగును!

సొగసైన పద్మిని, భారత్
ప్రొడక్షన్స్‌వారి "విక్రమాదిత్యన్"
చిత్రములో తార.



పద్మిని, ఉత్తమ నర్తకి, నటీమణిగానేగాక సౌందర్యము కున్నూ భారతదేశమంతటా ప్రశంసనీయురాలైయున్నది. నత్వ సౌష్టవమైన చర్మము, పద్మిని వంటి సురూపవతులైన సినిమా తారలకైనట్లే మీ కున్నూ గొప్ప సొత్తు. అందుచేతనే, సినిమాతారలు చేయుచున్నట్లు—లక్స్ టాయిలెట్ సబ్బుతో మీ చర్మమును పోషించుకొవలెను. ఇది సొగసైన పద్మిని సూచన: "చర్మ సౌందర్యమును కాపాడుకొనుటకు, నేను వాడుచున్నట్టి శుద్ధమైన, తెల్లని, సబ్బుకంటె అతిసౌమ్యమైనది ఇంకేదీ లేదు ... అది లక్స్ టాయిలెట్ సబ్బు" పద్మిని లక్స్ సబ్బుయొక్క మీగడవంటి నురగకు, మనోహరమైన పరిమళమునకు ఆనంద పరవశురాలౌతుంది. మీరున్నూ అట్లే ఆనంద పరవశులగుదురు ... లక్స్‌ను నేడే వాడి చూడండి!

శుద్ధమైన, తెల్లని

లక్స్ టాయిలెట్ సబ్బు



సినిమా తారలకు సౌందర్యము
నిచ్చు సబ్బు

LTS. 565-X52 TL